శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



భారతీయ స్టార్టప్ మిషన్ 'దృష్టి'

వాణిజ్య గ్యాస్ ధర పెంపుపై తమిళనాడులో సిపిఐ నిరసన

స్వతంత్ర జర్నలిజానికి శిక్ష 07



సంపుటి 09, సంచిక: 154 | సోమవారం | 04-05-2026 | ఖమ్మం   Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar   పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# ఉక్కిరిబిక్కిరి

● మండుతున్న ఎండలకు అల్లాడుతున్న జనం ● మొదటిసారిగా అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ ● అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం ● ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు ● మహబూబాబాద్ జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిడుగుపడి కార్మికుడి మృతి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. మరో వైపు సాయంత్రం వేళల్లో అకాల వర్షాలు కురవడంతో ఇటు సామాన్య ప్రజలు, అటు రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భానుడి భగభగలకు ప్రజలు అల్లాడుతుండగా, అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతుల్లో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కాగా, ఉదయం 8 గంటలనుంచే సూర్యుడి ప్రతాపం కొనసాగుతుండటంతో జనం బయటకురావాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 వరకు నమోదవుతున్నాయి. ఆదివారం అన్ని జిల్లాలో 40 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వరంగల్, భూపాలపల్లిలో46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. దీంతో మొట్టమొదటిసారిగా వాతావరణ శాఖ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆరెంజ్ అంటే 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అయితే, రానున్న మూడు నుంచి నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### ఏడు రోజులు వర్షాలు

రాష్ట్రంలో మండుతున్న ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. రానున్న ఏడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. వాతావరణ శాఖ విడుదల చేసిన తరువాయి 12లో

నాలుగు రాష్ట్రాలు, యుటి అసెంబ్లీల

# ఫలితాలు నేడే

● కొన్ని గంటల్లో తేలనున్న ముఖ్యమంత్రుల భవితవ్యం
● ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేసిన ఇసి
● సమస్యాత్మక ప్రాంతాల్లో బలగాల మోహరింపు




నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అయితే సోమారం మధ్యాహ్నం నాటికి ఏ రాష్ట్రంలో ఎవరిది గెలుపు అనే విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది.ఇక ఈ ఎన్నికల ఫలితాల ద్వారా కీలక రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, ఎంకె స్టాలిన్, పినరయి విజయన్‌ల భవితవ్యం తేలనుంది. గతానికి భిన్నంగా ఈసారి ఆయా రాష్ట్రాల్లో భారీగా పోలింగ్ నమోదైంది. పలు ఎగ్జిట్ పోల్స్ మిశ్రమ ఫలితాలను వెల్లడించాయి. దాంతో ఏ రాష్ట్రంలో ఎవరు గెలుస్తారనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఫలితాల ప్రభావం జాతీయ రాజకీయాలపై ఎక్కువగా ఉంటుందని రాజకీయా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక ఎగ్జిట్‌పోల్స్ అంచనాల ప్రకారం అసోం, పుదుచ్చేరిల్లో అధికార మార్పిడి జరగబోదని, రెండు చోట్లా ఇప్పుడు అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమియే మళ్లీ అధికారాన్ని చేపట్టబోతోందని సర్వే సంస్థలన్నీ ముక్తకంఠంతో చెప్పాయి. కానీ పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల ఫలితాల గురించే సర్వే సంస్థలు మిశ్రమ ఫలితాలను వెల్లడించాయి. అయితే బెంగాల్‌లో మమతాబెనర్జీ నేతృత్వంలోని టిఎంసి ఓటమిపాలు కానుందని మెజారిటీ సర్వే సంస్థలు అంచనా వేశాయి. తమిళనాడులో డిఎంకె అధికారం నిలబెట్టుకుంటుందని మెజారిటీ సంస్థలు చెప్పినా.. ఒకటి రెండు సర్వే సంస్థలు మాత్రం నటుడు విజయ్ నేతృత్వంలోని టివికె అధికారం చేపట్టబోతోందని అంచనా వేశాయి. ఇక కేరళలో పదేళ్లుగా అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్ కూటమికి ఈసారి ఓటమి తప్పదని సర్వే సంస్థలు చెప్పాయి.

**న్యూఢిల్లీ :** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కోసం యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హోరాహోరీ ప్రచారం, రికార్డు స్థాయి పోలింగ్, టిఎంసి, బిజెపిమధ్య గట్టిపోటీ నెలకొందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల మధ్య సోమవారం ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. నాల్గోసారి మళ్లీ అధికారం చేపట్టాలని అధికార టిఎంసి భావిస్తుండగా, చరిత్రాత్మక విజయంతో బెంగాల్ గడ్డపై తొలిసారి కాషాయ జెండా ఎగరేయాలని బిజెపి పట్టుదలతో ఉంది. సిపిఐ(ఎం), కాంగ్రెస్ పార్టీలు కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. 294 అసెంబ్లీ స్థానాలకుగానూ 293 నియోజకర్గాల ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫల్తా' నియోజకవర్గంలో ఎన్నికల అక్రమాల కారణంగా పోలింగ్‌ను ఇసి రద్దు చేసింది. అక్కడ ఈనెల 21న రీపోలింగ్, మే 24న కౌంటింగ్ జరగనుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 2నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ కేంద్రాల్లో శనివారం రీపోలింగ్ ముగిసింది. 87శాతం ఓటింగ్ నమోదైంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాయి 8లో



## నివాసిత భవనంలో భారీ అగ్నిప్రమాదం

**తొమ్మిది మంది సజీవదహనం**

● భవనంలో రెండు, మూడు, నాల్గొవ అంతస్తుల్లో చుట్టుముట్టిన మంటలు
● తప్పించుకునేందుకు వీలు లేకపోవడంతో అగ్గికి ఆహుతి
● భవనం నుంచి 15 మందిని రక్షించిన సహాయక సిబ్బంది

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో పలు చోట్ల భారీ ఎత్తున అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నివాసిత గృహాల్లో మంటలు అంటుకు పలువురు మృత్యువాత పడుతుండగా, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లితోంది. తాజాగా దేశ రాజధాని ఢిల్లీలో ఓ నివాసిత భవనంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తూర్పు ఢిల్లీలోని వివేక్ విహార్‌లో ఆదివారం తెల్లవారుజామున ఒక నివాస భవనంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఒక పసిబిడ్డతో సహా రెండు కుటుంబాలకు చెందిన తొమ్మిది మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. వివేక్ విహార్ ఫేజ్1లోని నాలుగు అంతస్తుల భవనంలో తెల్లవారుజామున 3.48 గంటలకు ఈ ఘటన జరిగింది. సమాచారం అందడంతో, పోలీసులు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. భవనంలోని రెండవ, మూడవ, నాల్గవ తరువాయి 12లో

## కరీంనగర్‌లో కాల్పులు

● జ్యూవెలరీ షాపులో భారీ దోపిడీ ● అడ్డుకున్న సిబ్బందిపై కాల్పులు




ప్రజాపక్షం/కరీంనగర్

కరీంనగర్‌లో కాల్పుల ఘటన కలకలం రేపింది. నగరంలోని జ్యోతినగర్ ప్రాంతంలోని పీఎంజే జ్యువెలరీ షాపుపై ఐదుగురు సాయుధ దుండగులు దాడి చేసి, విచక్షణారహితంగా కాల్పులు జరిపి భారీ మొత్తంలో బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాథమిక వివరాల ప్రకారం రెండు బైకులపై వచ్చిన దుండగులు పథకం ప్రకారం షోరూమ్ లోకి చొరబడి సిబ్బందిని తుపాకులతో బెదిరించారు. దోపిడీకి అడ్డువచ్చిన సిబ్బందిపై తరువాయి 8లో

## సర్ నిలిపివేయాల్సిందే

● పౌర సమాజం డిమాండ్
● ఓటర్ల జాబితాలో భారీ కోత అత్యంత అప్రజాస్వామికమని వ్యాఖ్య
● ఇసి విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయిందని విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోని పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియపై పౌర సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రక్రియ వల్ల దేశవ్యాప్తంగా దాదాపు 6 కోట్ల మంది అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారని, ఇది అత్యంత అప్రజాస్వామికమని వివిధ రంగాల ప్రముఖులు ఆదివారం విడుదల చేసిన ఒక ఉమ్మడి ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 2025 నుండి అమలులోకి వచ్చిన ఎస్‌ఐఆర్ విధానం ద్వారా భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) తన విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయిందని వారు విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల తరువాయి 12లో

14 అంశాలతో అమెరికాకు

## ఇరాన్ కొత్త ప్రతిపాదన

● నాకు సంతృప్తిలేదు, ఐనా సమీక్షిస్తున్నాం : ట్రంప్
● 30 రోజుల్లో శాశ్వతంగా యుద్ధానికి తెర దించుదాం : ఇరాన్
● శాంతియుత అణు ఇంధన హక్కుపై పునరుద్ఘాటన



**లాహోర్:** చర్చల్లో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగించేందుకు 14 అంశాలతో ఇరాన్ మరో కొత్త ప్రతిపాదన చేసింది. అమెరికా–ఇరాన్ మధ్య అధికారిక మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా ఈ కొత్త ప్రతిపాదనను ట్రంప్‌కు పంపారు. అణ్వాయుధం గురించి ప్రధానంగా ప్రస్తావించకపోయినప్పటికీ, ''అణురంగం''లో షరతులతో కూడిన పట్టువిడుదల ధోరణి ప్రదర్శించాలని సంకేతాలు ఇచ్చింది. శాంతియుత ప్రయోజనాలకోసం అణు ఇంధనాన్ని ఉత్పత్తిచేసుకునే హక్కు ఇరాన్‌కు ఉందని పునరుద్ఘాటించింది. ఇప్పుడు ''బంతి అమెరికా కోర్టులోనే ఉంది'' అని వ్యాఖ్యానించింది. ఈ ప్రతిపాదన ఈ క్షణంలో తనకు సంతృప్తి కలిగించలేదని ట్రంప్ తక్షణ స్పందనగా చెప్పారు. ఐనప్పటికీ, ఈ తాజా ప్రతిపాదనపై తాము సమీక్షిస్తున్నామని మియామిలోని పామ్‌బీచ్‌కు వెళుతూ మార్గమధ్యలో విమానంలో మీడియాకు ట్రంప్ చెప్పారు. వారు తప్పుగా ప్రవర్తించినా,ఏదైనా చెడు చేసినా మళ్ళీ దాడులు ప్రారంభమవుతాయని, చాలా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి తరువాయి 12లో

యువతకు కేంద్ర, రాష్ట్ర పాలకులు మోసం

## సమరశీల ఉద్యమాలకు సిద్ధమవుదాం

**ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నాయకుల పిలుపు**



ప్రజాపక్షం/హైదరాబాద్

అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడికక్కడ ఎఐవైఎఫ్ పతాన్ని ఎగరువేసి ఈ ఏడాది పోరాట దినోత్సవంగా పరిగణించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం వద్ద ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని జూబ్లీహిల్స్, గురుబ్రహ్మ నగర్‌లో రాష్ట్ర కార్యనిర్వహాక అధ్యక్షులు కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ ఎఐవైఎఫ్ జెండాను ఎగురవేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం వద్ద ఆదివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులపై సమరశీల ఉద్యమాలకు సిద్ధమవుదామంటూ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలో పూర్తిగా విఫలం కావడంతో దేశంలో నిరుద్యోగ తరువాయి 12లో

విత్తన చట్టం ప్రతిపాదన

## అటకెక్కింది!




● ముసాయిదా బిల్లుపై దృష్టి సారించని ప్రభుత్వం ● యథేచ్ఛగా కొనసాగుతున్న నకిలీ విత్తన విక్రయాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆరుగాలం శ్రమిస్తూ ప్రజలకు పట్టెడు అన్నం పెడుతున్న అన్నదాతలకు నకిలీ విత్తనాలను అమ్ముతూ మోసం చేస్తున్న పలు విత్తన కంపెనీలను కట్టడి చేసేందుకుగా ఉద్దేశించిన విత్తన చట్టం ప్రతిపాదన అటకెక్కింది. విత్తన చట్టం రూపకల్పనకు తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కమిటీ తన నివేదికను గత ఏడాది అగస్టులో ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నివేదికను తక్షణమే మంత్రివర్గ సమావేశంలో చర్చించి గత శీతాకాల అసెంబ్లీ సమావేశాలలో చట్టం రూపంలో రానుందని జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఇప్పటివరకు ముసాయిదా బిల్లుపై ఇటు వ్యవసాయ, రైతు కమిషన్ గానీ ఆటు ప్రభుత్వం కానీ దృష్టి సారించకపోవడం గమన్హారం. రాష్ట్రంలో తీసుకురానున్న తరువాయి 8లో

పప్పు దినుసుల సాగు

## క్షీణిస్తోంది!



● అధిక పెట్టుబడులు, దిగుబడి తగ్గడమే ప్రధాన కారణం
● ఉచిత విద్యుత్, సాగు నీటి లభ్యత పెరగడం, వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గడంతో పెరుగుతున్న వరి సాగు


ప్రజాపక్షం/హైదరాబాద్

పెరుగుతున్న వరి సాగు పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల సాగుకు ఉరి వేస్తోంది. గడిచిన 13 ఏళ్లలో పప్పుదినుసులు, కూరగాయల సాగు గణనీయంగా క్షీణించింది. ఇందుకు అనేక కారణాలే ఉన్నాయి. ఈ పంటలు వాణిజ్య పంటలు కావడంతో అధిక పెట్టుబడి అవసరముండడం, దిగుబడి తక్కువ రావడం, మార్కెట్‌లో ఆశించిన ధర లభించపోవడం ప్రధాన కారణాలుగా కనబడుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రైతులకు 24 గంటల పాటు ఉచిత అందుబాటుకీ రావడం, సాగు నీరు లభ్యత పెరగడం, మరో వైపు వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గడం, వరి ధాన్యానికి మంచి మద్దతు తరువాయి 8లో

# సమసమాజ నిర్మాణానికి అక్షర ఆయుధం అలిశెట్టి కవిత్వం



డా॥ఎస్.విజయ భాస్కర్
9290826988



ఉమ్మడి తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తెలుగు సాహిత్యంలో అలిశెట్టి ప్రభాకర్ తెలియని వ్యక్తులు లేరు. అలిసెట్టి ప్రభాకర్ 39 సంవత్సరాలే జీవించినా తెలుగు సాహిత్యంలో తన ముద్రను చెరగని సంతకంగా పదిల పర్చుకున్నాడు. అలిసెట్టి ప్రభాకర్ శివైక్యం చెంది 33 సంవత్సరాలు గడిచినా ఆయన రాసిన కవిత్వం ప్రజల నాలుకలపై నినాదాల రూపంలో, దినపత్రికల్లో పతాక శీర్షిక రూపంలో మనకు నిత్యం దర్శనమిస్తుంది. అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని ఇటీవల జగిత్యాల జిల్లాలో జరిగిన ప్రజా దీవెన సభలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సమితి ( భారతీయ రాష్ట్ర సమితి ( బిఆర్ఎస్) వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తన ఉపన్యాసం అలిశెట్టి ప్రభాకర్ కవిత్వమైన **'గుండె సైన్యం'** కవిత

> **'చీకట్లో జడుసుకుంటే**
> **ఒక చెట్టే నీ చుట్టూరా**
> **అరణ్యమై భయపెడుతుంది**
> **గుండెంటు కలిగుంటే**
> **నీ వెంట అదే**
> **పెద్ద సైన్యమై నిలుస్తుంది.'**

అని ప్రారంభించడంతో అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని ఈనాటి తరానికి తెలియజేయడానికి ఈ వ్యాసం. అలిశెట్టి ప్రభాకర్ తల్లి దండ్రులు కీ॥శే.లక్ష్మి, చినరాజం పుణ్య దంపతులకు 12–01–1954లో గతంలో కరీంనగర్ జిల్లా ప్రస్తుతం జగిత్యాల జిల్లాలోని జగిత్యాలలో జన్మించారు. ఆయన సహచరి భాగ్య, కుమారులు సంగ్రామై, సంకేత్ గతంలో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని చిక్కడపల్లిలో ప్రస్తుతం ఉప్పల్ సమీపంలోని ఫిర్జాధిగూడలో నివాసం. 12–01–1993లో భౌతికంగా మన నుండి దూరమైన కవిత్వ రూపంలో మనకు ప్రతిరోజూ పలకరిస్తూనే ఉంటాడు.

**మరణం నా చివరి చరణం కాదు కవితలో**

> **'మరణం నా చివరి చరణం కాదు**
> **మౌనం నా చితాభస్మం కాదు**
> **మనోహరాకాశంలో విలపించే చంద్రబింబం**
> **నా అశ్రుకణం కాదు ' అంటాడు.**

మొదట చిత్ర కారుడిగా జీవితం ప్రారంభించాడు.ప్రారంభంలో పండుగల, ప్రకృతి దృశ్యాల, సినీ నటుల బొమ్మలను పత్రికలలో వేశాడు. తర్వాత జగిత్యాలలో 'సాహితీ మిత్రదీప్తి' సంస్థ పరిచయంతో కవిత్వ రంగంలోకి ప్రవేశించాడు. 1974లో ఆంధ్రసచిత్ర వార పత్రికలో వచ్చిన 'పరిష్కారం' ప్రచురణ రూపంలో అచ్చయిన మొదటి కవిత. జగిత్యాలలో 1976లో స్టూడియో పూర్ణిమ, 1979లో కరీంనగర్‌లో స్టూడియో శిల్పి, 1983లో హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో చిత్రలేఖ ఏర్పాటు చేసుకొని జీవిక కోసం ఫోటో గ్రాఫర్‌గా జీవిత పోరాటంలో కవిగా ఎదిగాడు. కుంచెని, కెమెరా లెన్సుని, కలాన్ని ఏ కం చేసి తెలుగు కవితకు పుష్టి చేకూర్చాడు. ఏనాడు సం పాదన కోసం ఆరాటపడలేదు. తన కళ ప్రజల కోసమే కళ కళ కోసమే కళ ప్రజల కోసమే అనే చివరి వరకు నమ్మాడు.

### అలిశెట్టి రచనలు

**1978లో ఎర్ర పావురాలు**
**1979లో మంటల జెండాలు, చురకలు**
**1985లో రక్తరేఖ**
**1989లో ఎండమావి**
**1990లో సంక్షోభ గీతం**
**1992లో సిటీ లైఫ్ ప్రచురింపబడిన**
**కవిత సంకలనాలు.**

ఆంధ్ర జ్యోతి దినపత్రికలో ఆరెళ్ళ పాటు సీరియల్‌గా 'సిటీ లైఫ్' పేరుతో హైదరాబాద్ నగరంపై రాసిన మినీ కవితలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. తన కవిత్వంలో పాఠకుల ఆలోచన దృక్పథాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన కవి.తెలుగు సాహిత్యంలో ప్రముఖ అభ్యుదయ, విప్లవ, ప్రజాకవి శ్రీశ్రీ తర్వాత అంత ఎక్కువగా కోట్ అయిన కవిత్వం ప్రభాకర్‌ది. రూపంలో సంక్షిప్తతనీ, వస్తువులో జీవిత విస్తృతిని, సమాజపు లోతుల్నీ ఇమిడ్చాడు. సమాజమార్పుని, సమసమాజాన్ని కాంక్షిస్తూ పేదరికాన్ని బలైన కవి. సమాజంలోని అనేక రుగ్మతలపై కలాన్ని ఖడ్గంగా ఉపయోగించిన వాడు అలిశెట్టి ప్రభాకర్. వేశ్య అనే కవితలో

> **తను శవమై....**
> **ఒకరికి వశమై...**
> **తనువు పుండై...**
> **ఒకడికి పండై....**
> **ఎప్పుడూ ఎడారై...**
> **ఎందరికో ఒయాసిస్సు.....**

అని వారి దీన స్థితిని ఎక్స్‌రే తీసినట్లు మన ముందుంచాడు.

> **ప్రజాకవి గద్దర్‌పై**
> **కవితైన ట్రిగ్గర్‌లో తిన్నగా**
> **తుపాకీ గొట్టం మీదుగా**
> **నడిచొస్తే కనిపిస్తాం దొక ట్రిగ్గర్**
> **సరాసరి శత్రువు గుండెల పైకి**
> **గురి పెట్టబడిన బాట మీదుగా**
> **పయనిస్తే కనిపిస్తాడొక**
> **గద్దర్! అంటాడు.**

ఉభయ తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రభుత్వం చేత ప్రచురించబడుతున్నపాఠ్యపుస్తకాల్లో ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పిజిలలో అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని ప్రచురించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సి ఇఆర్‌టిఇ) ప్రచురించిన పదోతరగతి పాఠ్య పుస్తకంలో 5వ పాఠం 'నగర గీతం' అనే కవిత ఎంతో మంది విద్యార్థులకు ఇష్టమైన పాఠంగా మారి తెలుగు సాహిత్యంపై ఆసక్తిని, అభిరుచిని, జిజ్ఞాసను పెంపొందిస్తుంది.

> **నగరా మోగిందా**
> **నయాగరా దుమికిందా**
> **నాలుగురోడ్ల కూడలిలో ఏమది?**
> **అదే నగరారణ్యహోరు**
> **నరుడి జీవనఘోష**
> **తల్లి ఒడివంటి**
> **పల్లెసీమల్నొదిలి**
> **తరలివచ్చిన పేదరైతులూ**
> **ఇనుప్పెట్టెల్లాంటి**
> **ఈ పట్టణాల్లో**
> **ఊపిరాడని మీ బతుకులూ**
> **నగరంలో ప్రతిమనిషి**
> **పఠనీయ గ్రంథమే**
> **మరీ నీ బతుకు**
> **పేజీలు తిరిగేసేదెవరో!**
> **ఉదయమే**
> **బస్సుల్లో రిక్షాల్లో**
> **పేవ్మెంట్లపై విరబూసిన**
> **కాన్వెంట్ పువ్వుల సందడి**
> **రాలే చదువుల పుప్పొడి!**
> **సిటీ అంటే అన్నీ**
> **బ్యూటీ బిల్డింగ్లు కావు**
> **అటు భవంతులు ఇటు పూరిళ్ళూ**
> **దారిద్ర్యం, సౌభాగ్యం సమాంతర రేఖలు!**
> **ఇది వెరైటీ సమస్యల మనుష్యుల**
> **సమ్మేళన కోలాహలం!**
> **ఎంతచేసినా ఎవరికీ**
> **తీరిక దక్కదు కోరిక చిక్కదు**
> **మెర్క్యూరీ నవ్వులు,పాదరసం నడకలు**
> **కొందరికి రెండు కాళ్ళు**
> **రిక్షావాళ్ళకి మూడుకాళ్ళు**
> **ఉన్నవాళ్ళకి నాలుక్కాళ్ళు!**
> **నగరంలో అన్ని పక్కలా**
> **సారించాలి మన చూపులు**
> **మహానగరాల రోడ్లకి**
> **మరణం నాలుగువైపులు!**
> **నగరం మహావృక్షంమీద**
> **ఎవరికి వారే ఏకాకి!**
> **నగరం అర్థంకాని రసాయనశాల**
> **నగరం చిక్కువీడని పద్మవ్యూహం!!**

అంటూ ఎలాంటి కఠిన పదాలు, అర్థం కాని పదాలు, ధాంభికాలు, సంస్కృత భూయిష్టమైన పదాలు లేకుండా అందరికి అర్థం అయ్యే భాషలో సులభ శైలిలో రాసి విద్యార్థులకు ఇష్టమైన పాఠంగా మారింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కాంక్షించిన కవి. 39 సంవత్సరాలకే మరణించి ఉండక పోతే తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా తెలంగాణ సాహిత్యంలో వినూత్న మైన రీతిలో సాహిత్యం వెలువడేది. అలిశెట్టి ప్రభాకర్ కవిత్వంలో ఆంగ్ల పదాలు తెలుగు సాహిత్యంలో సులభంగా కలిసి పోతాయి. ట్రీట్మెంట్, పెయింటింగ్, క్యూ, బ్యాండేజీ, మినీ టానిక్, ప్లాస్టిక్ సర్జరీ, రైటర్స్, మాన్ స్క్రిప్ట్ డాక్టర్స్, ప్రిస్క్రిప్షనూ పర్సనల్ పోయమ్, ట్రిగ్గర్, లెటస్ గో..... లాంటి అనేక పదాలు కన్పిస్తాయి.

### అలిశెట్టి ప్రభాకర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా తెలంగాణ సాహిత్యంలో లబ్ధి ప్రతిష్ట కలిగిన అనేక కవులలో ముఖ్యంగా బండి యాదగిరి, గద్దర్, గోరేటి వెంకన్న, అందే శ్రీ, గూడ అంజయ్య, అశోక్ తేజ లాంటి కవుల వరుసలో ఏమాత్రం తగ్గని సమాజంపై ఎంతో ప్రభావం కలిగించిన కవి అలిశెట్టి ప్రభాకర్. అలిశెట్టి ప్రభాకర్ కుటుంబం ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) ప్రభుత్వం గానీ, కాంగ్రెస్ ప్రభుత్వం గానీ వారి ఆర్థిక పరిస్థితిపై ఆరా తీయకపోవడం శోచనీయం. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి కోటి రూపాయలు 500 గజాల స్థలంను కేటాయించడం జరిగింది. 'జయ హే తెలంగాణ జననీ జయకేతనం ' అనే గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడం జరిగింది. తెలంగాణలోని కవులకు, కళాకారులకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మంచి ప్రాధాన్యత లభిస్తుంది. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కవుల, రచయితల రచనలు మాత్రమే పాఠ్య పుస్తకాలలో ప్రచురించేవారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత తెలంగాణ రాష్ట్ర పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సి ఇఆర్‌టిఇ) ప్రచురించిన పుస్తకాలలో తెలంగాణ కవుల, రచయితల కళాకారుల రచనలకు ప్రాధాన్యత పెరిగింది.తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల లో పుట్టి పెరిగిన అలిశెట్టి ప్రభాకర్ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నందున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐదు కోట్ల పది ఎకరాల స్థలాన్ని కేటాయించి ఆదుకోవాలి. పుస్తక ఎగ్జిబిషన్‌లోనూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లోనూ అలిశెట్టి ప్రభాకర్ ద్వారాన్ని నిర్మించారు. అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం, సాహిత్యం తెలంగాణ రాష్ట్రంపై అధిక ప్రాధాన్యత ఉండడం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అలిశెట్టి ప్రభాకర్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## ఈ వారం కవితలు

### ఆకును నేను



ఆకును నేను ఆకును నేను
ఆప్యాయంగా గాలి ఊపితే
ఊగే ఆకును నేను ఆకును నేను!

రా రమ్మని పిలిచే చేతును నేను
చెట్టు చేతును నేను
ఎండకు గొడుగును నేను
సేదా తీర్చి ప్రాణవాయువును ఇచ్చే
ఆకును నేను ఆకును నేను

ఈ ఊపుల ఊగులు
వర్షానికి పిలుపులు.
ఈ నీడలు పొద్దు మాపు కాలానికి
సమయాల గడియారపు
కొలతలు కొలతలు!

ఈ పచ్చదనాల
చలువ పందిళ్ళు తోరణాలు
శుభములు మీకు శుభకరములు
ఆకును నేను ఆకును నేను

ఊగి ఊగి నేను నేలకు రాలినా
ఊపిరులూది ఊతమిచ్చిన
నేలతల్లికి సారాన్నవుతాను
తెలుసుకుంటే మీరు తెలుసుకుంటే
జీవన సారాన్నవుతాను
నవజీవన సారాన్నవుతాను
ఆకును నేను ఆకును నేను

ఆది రాతల ఆది కావ్యాల ఆనవాలుని
అమూల్య సంపదల
తాళపత్ర గ్రంథాన్ని
ఆకును నేను ఆకును నేను

ఆకునై నదిలో రాలనా
నదిలో కొట్టుకుపోయే చిట్టి చీమను
దరికి చేర్చే నావను అవుతాను
నావను అవుతాను

ఆకును నేను ఆకును నేను

ఆకులు రాలి తరువు మోడు వారినా
శిశిర ఋతువుకు
నేను ఋజువు అవుతాను
కొత్త ఆశల చిగురాకునై
నవ వసంతానికి స్వాగతమవుతాను
ఆకును నేను ఆకును నేను

మంగళ కలశంలో మాంగల్య ఆకును
ఆయుర్వేద ఆరోగ్యాల తాంబూలాల
ఆకు దినుసును
ఆకును నేను పచ్చని ఆకును నేను

ఆకులు రాలిన లెక్క
ఈడుగా తన ఈడుగా
కాండం రాసుకుంటుంది పక్కా
ఆకును నేను ఆకును నేను

రాలుట రాలిపోవుట
ప్రయాసలనుకోవద్దు!
వచ్చినందుకు మంచిని పంచండి
మనుషులారా మంచిని పంచండి
ఓమనుషులార మంచిని పంచండి!

ఆకును నేను ఆకును నేను
ఆప్యాయంగా గాలి ఊపితే ఊగే
ఆకును నేను ఆకును నేను

– బక్కారెడ్డి పటోళ్ళ

### అక్షర కామికా!

సాహితీ దీపాలు వెలిగించు
దివ్యమైన దీప్తిని చిమ్మించు
అక్షరాల ఆరాధనతో
అజ్ఞానాంధకారాన్ని అంతమొందించు!

నవ్వులు చిందించు
నిశ్శబ్దాల్లో నవనీతమై
హృదయాలను తాకించు
మాటల మధ్య మాధుర్యమై
మనసుల్ని మమతానురాగాలతో
నింపించు!

సూర్యోదయం కావించు
ప్రభాతంలో ప్రతీ శ్వాసకు
ప్రాణం పోయించు
చిగురుటాకుల చప్పుడు లాగా
చిన్న ఆశల్ని చిగురించించు!

జాబిలిని పొడిపించు
వెన్నెలలో వెలుగుల వర్ణాలను
విరజిమ్మించు
నిశీధిలో నిశ్శబ్ద గీతమై
నిత్య సౌందర్యాన్ని నింపించు!

అందాలు చూపించు
అక్షరాల్లో అనుభూతుల
అద్దమై నిలబెట్టు;
కవిత్వాన్ని కాన్వాసుగా మార్పించు
కలల చిత్రాలను ఆవిష్కరించు!

ఆనందం కలిగించు
పదాల్లోపలుకుల పూలవర్షం కురిపించు
వేదనల వెన్నెల తొలగించి
వెలుగుల వైభవం పరిపించు!

ప్రేమను పంచిపెట్టు
హృదయాల్లో పలకరింతల
పావురమై ఎగిరించు
అక్షరాల ఆలింగనంలో
అనురాగాన్ని అమృతమై కరిగించు!

కవితలను చదివించు
లోకానికి కాంతిని చూపించు
సాహిత్య వెలుగుల కిరణాలతో
సమస్త జగత్తుని ప్రకాశింపజేయించు!

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

### ఇంట్రొవర్టు కవిత

నువ్వు ఇంట్రొవర్టువి
అన్నాడొక మిత్రుడు
వాకింగులో నడుస్తూ
సో...వాట్? అన్నాను

అదేంటి మనుషులతో
మమేకం కాకపోతే
కవిత్వమెలా వస్తుంది
ఆశ్చర్యం అతని ముఖంలో

కవిత్వానికి కావాల్సింది
భావాలు చదివే మనస్తత్వం
ప్రకృతితో తాదాత్మ్యం చెందుతూ
పరిసరాలను పలికించగలిగే నేర్పు

మౌనంలో మోగించే కవితానాదం
కమనీయం, కడు రమణీయం
నిశ్శబ్దంలో వచ్చే ఆలోచనలకు
తీరిక ఎక్కడిది తికమక తప్ప

గడ్డి పోచలతో పిట్ట, గూడు కట్టినట్టు
మనసు పొరల పొత్తిళ్ళనుండి
కవిత్వం గూడు అల్లుకుంటుంది
అదొక అజరామరం సృజన కార్యం
ట్రాఫిక్‌లో నా బండి కొంచెం
'స్లో' అయితే చాలు వెనకనుండి
హారన్ల మోత ఉన్నకాలుష్యానికి
తోడుగా ఈ శబ్ద కాలుష్యం ఒకటి

కాలం స్పీడు పెరిగిందో
కలికాలంలో మనుషుల
ఓపిక మంటగలిసిందో కానీ
నిశ్శబ్దంలో ఎంత సంతృప్తి

అందుకే, నేను ఇంట్రొవర్టుని
కదిలిస్తే కడదాకా వదలని
విక్రమార్కుడిని....!

న్యాలకంటి నారాయణ
9550833490

## ప్రాచీన కవుల కవితా వైభవం

తెలుగు సాహిత్యం అనగానే మనకు కవిత్రయము, ప్రబంధ కవుల అమరవాణి గుర్తుకు వస్తుంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన మన భాషలో, ప్రాచీన కవులు అందించిన అక్షర సంపద కేవలం సాహిత్య కృతి మాత్రమే కాదు, అది ఒక జీవన విధానం. కాలం మారుతున్న కొద్దీ మనం ఆధునికత వైపు పరుగులు తీస్తున్నాం, కానీ ఆ ఆధునికతకు కావలసిన దృఢమైన పునాదులు మన ప్రాచీన సాహిత్యంలోనే ఉన్నాయి. నన్నయ్య నుండి ధూర్జటి వరకు మన క వులు రాసిన ప్రతి అక్షరంలోనూ ఒక లోతైన జీవిత సత్యం దాగి ఉంది. ఈ కవితా వైభవాన్ని మనం కేవలం పాత కాలపు రాతలుగా చూడటం లేదు, నేటి తరానికి అవసరమైన దిశానిర్దేశకాలుగా చూడాలి. ప్రాచీన కవుల కవితా వైభవం అంటే కేవలం అలంకారాలు, ఛందస్సు మాత్రమే కాదు; అది మనిషిని మనిషిగా నిలబెట్టే నైతికత. కవిత్రయం మహాభారతాన్ని రచించినప్పుడు, వారు కేవలం ఒక కథను చెప్పలేదు, మానవ స్వభావంలోని ఒడిదుడుకులను, ధర్మ సంకటాలను పాఠకుడి కళ్లముందు ఉంచారు. నేటి తరం యువత తరచుగా ఒత్తిడికి, అయోమయానికి లోనవుతుంటారు. అటువంటి సమయంలో భారతంలోని పాత్రలు మనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. కౌరవ పాండవుల పోరాటం బయట జరిగిన యుద్ధం మాత్రమే కాదు, మనిషి అంతరాత్మలో నిత్యం జరిగే సంఘర్షణకు ప్రతీక. ధర్మరాజులోని సహనం, కర్ణుడిలోని దానగుణం, అర్జునుడిలోని ఏకాగ్రత... ఇవన్నీ నేటి కాలపు విద్యార్థులకు, ఉద్యోగులకు, ప్రతి ఒక్కరికీ అవసరమైన జీవిత పాఠాలు. ప్రాచీన సాహిత్యాన్ని చదవడం అంటే ఒక కాలపు సంస్కృతిని అర్థం చేసుకోవడం మాత్రమే కాదు, సంక్షోభ సమయాల్లో ఎలా స్థితప్రజ్ఞతతో వ్యవహరించాలో నేర్చుకోవడం. భాష పరంగా చూస్తే, ప్రాచీన కవుల శబ్ద సంపద మనకు విస్మయాన్ని కలిగిస్తుంది. నన్నయ్య వాడిన పదాల్లోని గంభీరత, తిక్కనలోని నాటకీయత, శ్రీనాథుని కవితా విన్యాసం, పోతన భక్తి భావం, ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకంలోని వైరాగ్య ధోరణి... ఇవన్నీ ఒక అద్భుత ప్ర పంచాన్ని నిర్మిస్తాయి. నేటి డిజిటల్ యుగంలో మనం వాడే భాష సంక్షిప్తమైపోతోంది. ఒక భావాన్ని వ్యక్తం చేయడానికి పదుల కొద్దీ పదాలను వాడే చోట, నేడు కేవలం ఒక ఎమోజీతో సరిపెట్టేస్తున్నాం. దీనివల్ల మన భావ వ్యక్తీకరణ శక్తి క్షీణిస్తోంది. ప్రాచీన సాహిత్యాన్ని చదవడం ద్వారా మనకు పదాలపై పట్టు పెరుగుతుంది, భాషా సౌందర్యం అలవడుతుంది. మంచి సాహిత్యం చదివే వ్యక్తికి ఆలోచనలలో స్పష్టత, సంభాషణలో హుందాతనం వస్తాయి. ఇది నేటి పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడుతుంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ప్రాచీన సాహిత్యం మనకు 'గురువు' యొక్క గొప్పతనా న్ని, 'ప్రకృతి'తో మనిషికి ఉండాల్సిన అనుబంధాన్ని గుర్తు చేస్తుంది. ప్రబంధ క వుల వర్ణనలలో ప్రకృతి ఒక పాత్రలా కనిపిస్తుంది. వేసవిని, వానాకాలంని, పు వ్వులను, నదులను వారు వర్ణించిన తీరు మనకు ప్రకృతిని ప్రేమించడం నేర్పుతుంది. నేడు పర్యావరణం ప్రమాదంలో పడిన తరుణంలో, మన ప్రాచీన కవు లు ప్రకృతిని ఎలా ఆరాధించారో, ఎలా కాపాడుకున్నారో తెలుసుకోవడం చాలా అవసరం. అలాగే, కవిత్వంలో కనిపిస్తుంది అంటే అది కేవలం కల్పన కాదు, అది సమాజంలోని మంచిని ప్రతిబింబించే అద్దం. సమాజం పట్ల బాధ్యత, కు టుంబం పట్ల ప్రేమ, మిత్రధర్మం వంటి విలువలు మన ప్రాచీన కావ్యాల్లో అడుగడుగునా కనిపిస్తాయి.నేటి తరానికి ప్రాచీన సాహిత్యం అర్థం కావడం లేదన్నది ఒక అపోహ మాత్రమే. సరైన మార్గదర్శకత్వం ఉంటే, ఆ కవిత్వంలోని రసాన్ని నేటి తరం కూడా ఆస్వాదించగలదు. మనం చేయాల్సిందల్లా ఆ సాహిత్యాన్ని 'చారిత్రక రికార్డులు'గా చూడటం మానేసి, వాటిని మన దైనందిన జీవితంతో అనుసంధానం చేసుకోవడమే. ఒక కష్టకాలంలో ఉన్నప్పుడు ధూర్జటి శతకం లో ని ఒక పద్యం మనకు ఇచ్చే ధైర్యం, ఆత్మవిశ్వాసం ఎంతో గొప్పవి. ఆ కవుల వైభ వం అంటే కేవలం వారి పాండిత్యం కాదు, ఆ పాండిత్యంతో వారు ప్రపంచానికి అందించిన వెలుగు. ఆ వెలుగు నేటికీ, రేపటికీ నిత్యం అవసరమే. మన మూలాలను మర్చిపోకుండా, వాటిని ఆధునికతతో జోడించి జీవించడమే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి. అక్షరం ఎప్పటికీ అక్షరమే, అది కాలంతో సంబంధం లేకుండా మానవజాతిని ఉద్ధరిస్తూనే ఉంటుంది. మన ప్రాచీన సాహిత్య వారసత్వాన్ని అందిపుచ్చుకోవడం అంటే, మన ఉనికిని మనం మరింత బలంగా నిర్మించుకోవడమే.

– కాళేశ్వరం కృష్ణమూర్తి, 9705196097

## సాహితీవనంలో దళిత ఆణిముత్యం సలంద్ర లక్ష్మీ నారాయణ

ప్రముఖ తెలుగు దళిత కవి, రచయిత, హేతువాది. నిజామాబాద్‌లో జన్మించిన ఆయన, చిన్నతనం నుంచే మూఢనమ్మకాలను ప్రశ్నించి, దళిత సాహిత్యోద్యమానికి పునాదులు వేసిన ముఖ్యమైన వ్యక్తి, 'దళిత మానిఫెస్టో' వంటి రచనల ద్వారా సామాజిక అసమానతలను, సమస్యలను ప్రతిబింబించారు, ఆయన రచనలు తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. సలంద్ర లక్ష్మీ నారాయణ 12 జనవరి 1956లో నిజామాబాద్‌లోని దారు గల్లీలో పుట్టాడు. నిరుపేద కుటుంబం. పాఠశాల వయసులోనే హేతువాదం వైపు నడిచాడు. కర్మ సిద్ధాంత పునాదులపై నిర్మించిన పుక్కిటి పురాణాలను ప్రశ్నించాడు. భావవాదాన్ని ధ్వంసం చేశాడు. చిన్ననాటి నుంచే అన్వేషణ. తీరని దాహాల అన్వేషణ. అక్షరాల్లో వెల్లువెత్తిన వేనవేల సంద్రాల్ని గుండెల్లో నింపుకున్నాడు. సాగిపోయాడు. కలలై.అలలై.పాటలై హోరెత్తాడు. 1973లో హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తి చేశాడు. చుట్టూ అలముకున్న చీకట్లు. పేదరికం. కన్నీళ్లు. కష్టాలు. గుండెతడి వున్న మనిషి కదా. మనుషుల కోసం తపించాడు. అతనికి బతుకే ఓ యుద్ధమని తెలుసు. ప్రతికూల పరిస్థితుల్లో ప్రతిఘటనై నిలబడ్డాడు. కలబడ్డాడు. నమ్మిన విశ్వాసాల కోసం పల్లేరుగాయల్ల నడిచాడు. సలపరించే గాయాలు. మానని గాయాలు. కళ్లెదుటే ధ్వంసమైపోతున్న స్వప్నాలు. అతణ్ని రాటుదేల్చాయి. వడిసెల రాయిలా మలిచాయి. అందుకే గురితప్పని విలుకాడయ్యాడు. ఎక్కుపెట్టిన పద్యమయ్యాడు.

సలంద్ర నక్సల్ బరీ రాజకీయాలతో తీవ్రంగా ప్రభావితమయ్యాడు. 'దున్నేవారికే భూమి' నినాదం విప్లవాన్ని ప్రేమించేలా చేసింది. సామాజిక బాధ్యతగా జర్నలిజాన్ని ఎంచుకున్నాడు. 1974లో 'యిందూరు వాణి' పత్రికకి అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేశాడు. 'ప్రజారాజ్యం' పత్రిక ఎడిటింగ్‌లో సహాయకుడిగా, 'ఆంధ్ర పత్రిక'కు విలేకరిగా పనిచేశాడు. 1975లో సిద్ధాంత విభేధాల వల్ల 'యిందూరు భారతి'కి రాజీనామా చేశాడు. 1975లో బైస రామదాసు 'కేకలు' పత్రిక స్థాపించాడు. ఆ పేరును సూచించింది సలంద్రే. ఆ పత్రిక రూపొందడం వెనక సలంద్ర కృషి వున్నది. 1979లో ప్రజాసాహితి ప్రచురణగా 'చావుగీతం' ప్రకటించాడు.1980లో విప్లవ రచయితల సంఘంలో సభ్యుడయ్యాడు.1982లో ఉస్మానియా యూనివర్సిటీలో చేరాడు. అక్కడ రాడికల్ విద్యార్థుల సహచర్యం సలంద్ర ఆలోచనల్ని విశాలం చేశాయి. ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిజం న్యాయశాస్త్రం చదివాడు. ఒకవైపు చదువు. పత్రికా రచన.మరోవైపు విప్లవ రాజకీయాలు.ఆంధ్రభూమిలో పార్ట్ టైమ్ విలేఖరిగా పనిచేశాడు. సలంద్ర సహచరులకు ఓయూ క్యాంపస్‌లోని సి హాస్టల్ రాజకీయ చర్చల కేంద్రంగా ఉండేది. సాంబమూర్తి, ఖలీల్, అల్లం నారాయణ, మరికొందరు రాడికల్ విద్యార్థులకు నీడనిచ్చిన తావది. క్యాంపస్ గోడలపై నక్సల్బరీ రాజకీయ నినాదాలు విద్యార్థుల్ని ఉత్తేజపరిచేవి. బీడీ ముక్కను రంగుల్లో ముంచి వాల్ పోస్టర్ రాసేవాడు సలంద్ర. ఆర్ట్స్ కాలేజీ ఎన్నికల్లో ఆర్ఎస్‌యూ అభ్యర్థిగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయాడు. 1983లో రమను ఆదర్శ వివాహం చేసుకున్నాడు. 1985లో జర్నలిస్టు యూనియన్‌కి సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

సలంద్ర 1981లో 'దళిత మానిఫెస్టో' ప్రకటించాడు. ఇది ఆనాటి యువతరాన్ని ఆలోచింపజేసింది. నడవాల్సిన దారిని చూపింది. మనిషిని మనిషిగా చూడని మతాన్ని ధ్వంసం చేయాలని పిలుపునిచ్చాడు. కులాన్ని కూకటి వేళ్లతో పెకలించాలన్నాడు. అంతిమంగా వర్గపోరాటమే విముక్తి మార్గమని చాటాడు. 'పొద్దింకా పొడవలేదు', 'కోరస్', 'మహోన్నతానంతం', 'అమరుడు', 'కాంట్రడిక్షన్స్', 'జాతీయత', 'నిప్పంటిద్దాం', లాంటి అద్భుత మైన కవిత్వం రాశాడు. వేడిగాలి కవితా సంకలనం ద్వారా తన తొలి కవితా సంపుటిని అందించాడు.1979లో సలంద్ర రచించిన చావు గీతం కవితా సంపుటి సంచలనం సృష్టించింది. తన అనుభవాలను, ఆచరణాత్మకంగా పదునుపెట్టుకొనే సమయంలోనే సలంద్ర ఆరోగ్యం పాడైంది. రోజు రోజుకీ క్షీణించింది. వాంతులు, ఫిట్స్ ఎక్కువయ్యాయి. దీంతో 1986 సెప్టెంబర్ 14న ఉస్మానియా ఎఎంసి వార్డ్‌లో చేరాడు. వైద్యం అందుతున్న క్రమంలోనే అపస్మారక స్థితికి చేరాడు. మరుసటి రోజు ఫిట్స్ తగ్గాయి. అప్పడప్పుడూ కొద్దిగా స్పృహలోకి వస్తున్నాడు. 16న మేల్కొన్నాడు. కళ్లు తెరిచాడు. మనుషుల్ని గుర్తించాడు. మెడినోవాలో పరీక్షించారు. ట్యూమర్ గ్లోమా ఉన్నట్లు నిర్ధారణయింది. ఆ మూడు రోజులూ మూత్రం రాక అవస్థ పడ్డాడు. సెప్టెంబర్ 17న ఆకస్మికంగా ఊపిరొదిలాడు. తన జీవితమంతా ఉద్యమాలు, పోరాటాలే. జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడిన సలంద్ర మరణం దినపత్రికల్లో సింగిల్ కాలమ్ వార్త యింది. సరైన వైద్యం అందక చనిపోతే, సాధారణ మరణంగా రిపోర్ట్ చేశారు. జర్నలిస్టులు హంతక వ్యవస్థకు కొమ్ముకాశారు.

సుధాకర్. ఎ.వి, 9000674747

## జీవిత సత్యాల తాత్విక అన్వేషణ
# 'అశోకవనంలో తెల్లపూలు'



సమాజంలో మనకు కనిపించే సాధారణ దృశ్యాల వెనుక అసాధారణమైన సత్యాలు దాగి ఉంటాయి. జర్నలిస్ట్ రాజేందర్ దామెర (దారా) రాసిన 'అశోకవనంలో తెల్లపూలు' అటువంటి నిగూఢ సత్యాలను ఆవిష్కరించే వ్యాసాల సమాహారం. 2020–21 మధ్య కాలంలో ఆయన రాసిన 'బ్లాక్ ఇంక్' శీర్షికతో ప్రచురితమైన పది వ్యాసాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. రచయిత తన అనుభవాలు, సంఘర్షణలు, లోతైన ఆలోచనలను పాఠకులతో పంచుకుంటూ, సమాజపు ద్వంద్వ ప్రవృత్తిని నిర్మొహమాటంగా ప్రశ్నించారు. ఈ పుస్తకంలోని మొదటి వ్యాసం 'మరణించటం నేర్చుకోవాలి' మనిషికి చావు పట్ల ఉన్న భయాన్ని పటాపంచలు చేస్తుంది. సాధారణంగా చావును ఒక విషాదంగా చూసే సమాజంలో, మరణాన్ని జీవిత పరిపూర్ణతగా చూడాలని రచయిత సూచించారు. ఒక ప్రయా ణం గమ్యాన్ని చేరుకున్నప్పుడే ఎలా పూర్తవుతుందో, మనిషి జీవితం కూడా మరణంతోనే పరిపూర్ణమవుతుందని ఆయన విశ్లేషించారు. 'మళ్లీ మళ్లీ మరణించాల్సిన అవసరం లేని విధంగా చనిపోవటం నేర్చుకున్నాడు కబీరు' అన్న కలేకూరి ప్రసాద్ మాటలను ఉటంకిస్తూ, చావు పట్ల స్పష్టమైన అవగాహన ఉన్నవాడే బతికున్న కాలాన్ని ఆస్వాదించగలడని నిరూపించారు. 'స్లో పాయిజన్' అనే వ్యాసం మనిషిని బానిసగా మార్చే మానసిక సంకెళ్లను చర్చిస్తుంది. మరణ భయమే అన్ని భయాలకు మూలమని, ఆ భయం వల్ల మనిషి జీవితాన్ని అనుభవించలేకపోతున్నాడని రచయిత ఆవేదన వ్యక్తం చేశారు. 'సింహంలా స్వేచ్ఛ యొక్క గర్జన చేయాలంటే, ఇతరుల అభిప్రాయాల పట్ల భయాన్ని వీడాలి' అన్న ఓషో తత్వాన్ని రచయిత ఇందులో లోతుగా విశ్లేషించారు. సమాజం విధించిన కృత్రిమ కట్టుబాట్లను ధిక్కరించి, వ ర్తమానంలో జీవించడమే నిజమైన స్వేచ్ఛ అని ఆయన స్పష్టం చేశారు. పుస్తక శీర్షికకు ప్రాణం పోసిన వ్యాసం లో, సత్యం అనేది వ్యక్తిగత దృష్టి కో ణంపై ఆధారపడి ఉంటుందని రచయిత వివరించారు. అశోకవనంలో సీతమ్మను చూసేందుకు వెళ్లిన హనుమంతుడికి అక్కడి పూలు ఆగ్రహం వల్ల ఎర్రగా కనిపిస్తే, ప్రశాంతంగా కథా కాలక్షేపం చేసే హరిదాసుకి అవి తెల్ల గా కనిపిస్తాయి. అంటే, ప్రపంచం మనకు ఎలా కనిపిస్తుంది అనేది మన అంతర్గత స్థితిపైనే ఆధారపడి ఉంటుందని, మనం చూసే దృక్కోణమే మన వాస్తవికతను నిర్మిస్తుందని ఈ వ్యాసం ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతుంది. సమాజంలో మనుషులు ప్రదర్శించే కపటత్వాన్ని 'అబద్ధపు బంధాలు' వ్యా సంలో రచయిత ఘాటుగా విమర్శించారు. ఎదురుగా నవ్వుతూనే వెనుక గోతులు తీసే మనుషులను, స్వార్థం కోసం ఇతరులను బలి చేసే మనస్తత్వాన్ని ఆయన ఎండగట్టారు. ఇటువంటి అశాశ్వతమైన బంధాల వల్ల సమాజానికి ఎలాంటి ప్రయోజనం లేదని, అవి కేవలం మేధావి ముసుగులో సాగే ప్రహసనాలని విశ్లేషించారు. 'అశోకవనంలో తెల్లపూలు' కేవ లం ఒక వ్యాస సంపుటి మాత్రమే కాదు, ఇది పాఠకుడి ని తనలోకి తాను తొంగి చూసుకునేలా చేసే ఒక అద్దం. రచయిత తన సూటితనంతో, లోతైన విశ్లేషణతో జీవి తం, స్వేచ్ఛ, మరణం, మానవ సంబంధాల పట్ల ఒక కొత్త అవగాహనను కల్పించారు. సత్యం కోసం వెతికే ప్రతి పాఠకుడు తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. ఇవి రచయిత వ్యక్తిగత అభిప్రాయాలైనప్పటికీ, సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ఇవి ప్రతిబింబిస్తాయి.

కోగిల చంద్రమౌళి

# నిప్పుల కొలిమితో అప్రమత్తం..

- ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక పడకలు
అందుబాటులో అత్యవసర మందులు
- జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన వైద్య ఆరోగ్య శాఖ





**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రం నిప్పుల కొలిమిగా మారుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఎండల తీవ్రతను ఎదుర్కోవడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక పడకలను, ఐ.వి. ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచింది. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి టీచర్ల వద్ద ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఉండాలని సూచించింది. వడదెబ్బకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపింది.

వాతావరణశాఖ అంచనా ప్రకారం రానున్న రెండు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండబోదని, ఆ తర్వాత 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని ఆరోగ్య శాఖ వెల్లడించింది. అయితే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆదివారం, సోమవారం(మే 4వ తేదీ) గరిష్ట ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉన్నందున ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. మద్యం, టీ, కాఫీలలో ఉండే కెఫిన్, ఆల్కహాల్ శరీరంలో నీటిని బయటకు పంపిస్తాయని, తద్వారా శరీరం ఎక్కువ ద్రవాలను కోల్పోయే ప్రమాదం ఉంటుందని తెలిపింది. కూల్ డ్రింక్స్, సోడాలలోని అధిక చక్కెర, కార్బోనేటెడ్ వాయువులు, యాసిడ్లు కడుపులో గ్యాస్, ఉబ్బరం, కడుపు నొప్పికి దారి తీస్తుందని వైద్యులు చెబుతున్నారు.

### నీరు అధికంగా తాగాలి...

దాహం వేయకపోయినప్పటికీ సరిపడా నీరు తాగాలని, ఒఆర్ఎస్, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటి పానీయాలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ సూచించింది. పుచ్చకాయ, కర్బూజ, నారింజ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే సీజనల్ పండ్లు, కూరగాయలు తీసుకోవాలని తెలిపింది. బయటకు వెళ్ళేటప్పుడు లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని, గొడుగు, లేదా తలకు టోపీ పెట్టుకోవాలని, లేదంటే తలను టవల్ చుట్టుకోవాలని, అలాగే కచ్చితంగా చెప్పులు ధరించాలని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. కాగా మధ్యాహ్నం సమయంలో ఎండలో శ్రమతో కూడిన పనులు, ఆటలాడటం మానుకోవాలని సూచించింది.

### 'వడ దెబ్బ లక్షణాల' పట్ల అప్రమత్తం...

వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని ఆదేశించింది. రాష్ట్రంలోని ఉష్ణోగ్రతలను ఎప్పటికప్పుడు గమనిస్తూ జిల్లా యాంత్రాంగాన్ని వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం చేస్తోంది. ఏ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి? అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నట్లు వెల్లడించింది. శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ కంటే పెరిగితే తీవ్రమైన తలనొప్పి, కళ్ళు తిరగడం, వాంతులు, కండరాలు పట్టేస్తాయని వైద్య ఆరోగ్య శాఖ వివరించింది. ఇవి వడదెబ్బ లక్షణలుగా గుర్తించాలని సూచించింది. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని లేదా 108కి ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పూటకో మాట సరికాదు

- పెండింగ్ ఫీజులను ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టత ఇవ్వాలి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిల విడుదలకు సంబంధించి ప్రభుత్వం పూటకో తీరుగా వ్యవహరిస్తూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌లు విమర్శించారు. గతంలో ఫీజు బకాయిలను సెటిల్‌మెంట్ రూపంలో చెల్లిస్తామన్న ప్రభుత్వం ఆ తర్వాత కళాశాల యాజమాన్యాలు సమ్మె చేస్తే విడతల వారిగా విడుదల చేస్తామని ప్రకటించిందన్నారు. ఇప్పుడు రానున్న విద్యా సంవత్సరం నుంచిగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను నేరుగా విద్యార్థుల అకౌంట్లోకి జమాచేస్తామంటూ జీవో నెం '7' ప్రభుత్వం విడుదల చేయసిందని పేర్కొన్నారు. గత 4 ఏళ్ల నుండి విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ రాక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి మరి విద్యార్థులు సర్టిఫికెట్ తీసుకొనే పరిస్థితి వచ్చిందని, కొందరు విద్యార్థులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోలేక పోతున్నారని, ముందు పాత బకాయిల ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, వారు డిమాండ్ చేశారు. అదేవిధంగావచ్చే విద్యా సంవత్సరం నుండి ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విద్యార్థుల ఖాతాలో ఏ నెల జమా చేస్తారో స్పష్టమైన విధానాన్ని ప్రకటించి విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు.

## ఎకరానికి రూ.40 లక్షల పరిహారంతోపాటు.. రైతుల ప్రయోజనాలు పరిరక్షించాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి..
తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం బహిరంగ లేఖ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఫుడ్ పార్క్ ఏర్పాటు కోసం 1041సర్వే నంబర్‌లో రైతుల నుంచి సేకరించనున్న 138 ఎకరాలకు గాను ఎకరానికి రూ.40 లక్షల చొప్పున పరిహారం అందించడంతో పాటు రైతుల ప్రయోజనాలను పరిరక్షించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం వారు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. భూసేకరణకు సంబంధించి ప్రస్తుత మార్కెట్ విలువతో పోల్చితే ప్రభుత్వం ప్రకటించిన పరిహారం చాలా తక్కువగా ఉందని లేఖలో పేర్కొన్నారు. భూసేకరణతో ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులు తమ జీవనాధారాన్ని కోల్పోయి వారి కుటుంబాల భవిష్యత్తు, జీవనోపాధి దెబ్బతినే పరిస్థితి ఏర్పడనున్న నేపథ్యంలో ఎకరాకు కనీసం రూ.40 లక్షల పరిహారం మంజూరు చేసి రైతులకు న్యాయం చేయాల్సిందిగా వారు కోరారు. సేకరిస్తున్న 138 ఎకరాలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికే కేటాయించి దీనికి అనుబంధంగా ఫుడ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ భూముల్లో కేవలం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు మాత్రమే వినియోగించాలని, కాలుష్యాన్ని కలిగించే పరిశ్రమలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. అదేవిధంగా భూములు కోల్పోయిన రైతుల్లో ఎవరికైనా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలనే ఆసక్తి ఉంటే, ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత వారికే ఇవ్వాలన్నారు. రైతుల భవిష్యత్తు, వారి కుటుంబాల జీవనోపాధి దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాల్సిందిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి భాగం హేమంతరావు, పశ్య పద్మ విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి వారం రోజుల పాటు రైతు వారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి ఈ నెల 9వ తేదీ వరకు రైతు వారంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ వారం రోజుల పాటు వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు, వ్యవసాయ నిపుణులు, రైతులతో మమేకం కానున్నారు. తద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సాంకేతికత సేవలు ప్రతి రైతుకు చేరవేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్ర మాన్ని సోమవారం తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించనున్నారు. రైతు వారోత్సవంలో భాగంగా మొదటి రోజు సోమవారం నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం ప్రకృతి వ్యవసాయం అంశాలపై వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. రెండవ రోజు మంగళవారం ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల ప్రత్యామ్నాయ పంటల సాగు, మూడవ రోజు బుధవారం బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు సహకార సంఘాలు, ఎఫ్‌పిఓల ద్వారా రైతులకు సేవలు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలను వివరించనున్నారు. నాల్గవ రోజు గురువారం వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు, పిఎం కుసుమ్, వ్యవసాయ యాంత్రీకరణ డ్రోన్స్‌పై అవగాహన కల్పించనున్నారు. 5వ రోజు శుక్రవారం పశుసంవర్ధక శాఖ ,పాడి పరిశ్రమ పశుజాతి అభివృద్ధి, దూడల ప్రదర్శన, గడ్డి విత్తనాలు వేసవిలో పశు సంరక్షణ మత్స్యశాఖ చెరువులలో కలుపు మొక్కల నివారణ, వ్యాధుల నియంత్రణ, అధికోత్పత్తికి చర్యలు, నీటిపారుదల శాఖ సమర్థ నీటి విడుదల కోసం గేట్ల నిర్వహణ, ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులు కాలువలలో కంపచెట్లు, గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమాలు చేపడుతారు. 6వ రోజు శనివారం నీటిపారుదల శాఖ చెరువులలో కంపచెట్లు, గుర్రపు డెక్క తొలగింపు, సమతుల్య నీటి వినియోగం, కార్యాలయాల పరిశుభ్రత పౌరసరఫరాల శాఖ వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

**రాబోయే వ్యవసాయ సీజన్‌పై రైతుల్లో నమ్మకం పెంచడమే లక్ష్యంగా రైతు వారం**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నేటి నుంచి నిర్వహించనున్న రైతు వారోత్సవాలు రైతుల ఇంటి వద్దకే చేరే కార్యక్రమంగా రూపొందించబడిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయం, అనుబంధ శాఖల సమిష్టి కృషితో రాబోయే వ్యవసాయ సీజన్‌కు రైతుల్లో నమ్మకం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన వివరించారు. శాఖల మధ్య సమన్వయం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తూ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ప్రతి రోజును ఒక ప్రత్యేక శాఖకు కేటాయించి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

## గౌరమ్మ మృతి పట్ల.. సిపిఐ జాతీయ కౌన్సిల్ సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాతృమూర్తి కె.గౌరమ్మ (100) ఈనెల 1వ తేదీన మరణించడం పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్ర విచారం వ్యక్తం చేస్తోందని జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా సిపిఐ తరుపున సంతాపం తెలిపారు. గౌరమ్మ సుదీర్ఘ జీవితం స్థైర్యం, నిరాడంబరత, కుటుంబం పట్ల అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుందని రాజా పేర్కొన్నారు. ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలతో సహా ఎనిమిది మంది పిల్లలకు తల్లిగా, ఆమె నిబద్ధత, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించారని. ఈ విలువలే సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ అయిన ఆమె కుమారుడు కె.రామకృష్ణ ప్రజా జీవితంలో ప్రతిఫలించాయని పేర్కొన్నారు.

కె.రామకృష్ణకు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులందరికీ సిపిఐ ప్రగాఢ సంతాపం తెలియజేస్తోందని ఈ విషాద సమయంలో పార్టీ వారి దుఃఖంలో పాలుపంచుకుంటూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. గౌరమ్మ స్ఫూర్తి ఆ కుటుంబానికి ధైర్యం, ప్రేరణగా నివాలని రాజా ఆకాంక్షించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని 14 లక్షల మంది బిసి, ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీ విద్యార్థులకు కొండంత అండగా నిలిచే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని రద్దు చేసేందుకు ప్రభుత్వం భయంకరమైన కుట్ర చేస్తున్నదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. ఫీజు పథకాన్ని పాతర వేసేందుకు కుటీల ఎత్తుగడతో జారీ చేసిన జిఒ 7ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కెటిఆర్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ఇప్పటికే గురుకుల వ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చడంతో 142 మందికి పైగా చందమామల్లాంటి పిల్లలు తనువు చాలించారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇప్పటికే గాలికొదిలేశారని, ఇప్పుడు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫీజుల పథకానికే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు విద్యకోసం చేసే ఖర్చులను విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడిగా, బాధ్యతగా చూడాలే తప్ప, భారంగా భావించి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఉన్నత విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలలో ఒక్క పైసా కూడా చెల్లించకుండా రెండున్నరేళ్లుగా తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. 202627 విద్యాసంవత్సరానికి ప్రవేశపెట్టిన మార్గదర్శకాలన్నీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని శాశ్వతంగా సమాధి చేసే మరణ శాసనాలుగానే కనిపిస్తున్నాయని ఆరోపించారు. విద్యాశాఖను విధ్వంసం చేసేందుకే సిఎం రేవంత్‌రెడ్డి తన వద్దనే విద్యాశాఖను పెట్టుకున్నారా? అని కెటిఆర్ ప్రశ్నించారు.

## ప్రశాంతంగా ముగిసిన 'నీట్ యుజి పరీక్ష'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెడిసిన్ కోర్సులలో ప్రవేశాల నిమ్మితం నిర్వహించే 'నీట్ యుజి 2026 పరీక్ష' ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన పరీక్ష సాయంత్రం 5 గంటలకు ముగిసింది. పరీక్ష నిర్వహణ కోసం ఎన్‌టిఎ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్లు మూసివేసి ఆ తర్వాత వచ్చిన వారిని లోపలికి అనుమతించలేదు. రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ లాంటి ప్రధాన నగరాల్లో పరీక్షలను నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద డ్రెస్ కోడ్‌తో పాటు ఇతర నిబంధనలను కఠినంగా అమలు చేశారు. అడ్మిట్ కార్డు, ఫొటో, ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉన్నవారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోపలికి పంపించారు. విద్యార్థులకు 1.45 గంటలకు ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు అందజేసి, రెండు గంటలకు పరీక్ష ప్రారంభించారు.

## ప్రభుత్వ సానుకూల స్పందనపై టిజిఇజెఎసి హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల టిజిఇజెఎసి హర్షం వ్యక్తం చేసింది. ఇందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపింది. హైదరాబాద్‌లోని టిఎన్‌జిఒ భవన్‌లో ఆదివారం జెఎసి నాయకులు సమావేశమయ్యారు. అనంతరం జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతుల విషయంలో జాప్యం లేకుండా చూడాలని, అందుకు ప్రతి ఏటా ఏర్పడే ఖాళీలను పరిగణలోకి తీసుకని డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ పదోన్నతులను ఒకేసారి ఆమోదించాలని వారు కోరారు. రానున్న రోజుల్లో మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు సదానందం గౌడ్, ఎ.వెంకట్, కటకం రమేష్, మధుసూదన్‌రెడ్డి, దేశీయ నాయక్, అబ్దుల్లా, తిరుపతి, ప్రొఫెసర్ సంగీ రమేష్, ఎం.బి.కృష్ణ యాదవ్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.


## మరణించిన వర్కర్స్ కుటుంబాలకు రూ.15 లక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జి.వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ కుటుంబాలకు భాతదేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు, సంబంధిత ప్లాట్‌ఫామ్‌ల నుంచి రూ.10 లక్షలు మొత్తం రూ.15 లక్షల చొప్పున మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదాల్లో మరణించిన ఐదుగురు గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ కుటుంబాలకు ఆదివారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) అధ్యక్షుడు షైక్ సలాఉద్దీన్ పాత్రను అభినందించారు. ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఓ), కార్మిక శాఖ అధికారులతో యూనియన్ నిరంతరం చేసిన ఫాలోఅప్ కారణంగానే ఈ చారిత్రాత్మక కార్యక్రమం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. షైక్ సలాఉద్దీన్ మాట్లాడుతూ ఇది భారతదేశ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ ఉద్యమ చరిత్రలో ఒక గొప్ప విజయమని, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్న కార్మికుల గౌరవం, సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని తెలిపారు.

## రైతు సమస్యలపై సిఎం రేవంత్ రెడ్డికి.. కేంద్రమంత్రి సంజయ్ బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతు సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ మేనిఫెస్టో హామీల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం మరోసారి బహిరంగ లేఖ రాశారు. తాను రాసిన లేఖకు సమాధానం ఇవ్వకుండా, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఎదురుదాడికి దిగడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఎంఎస్‌పి చట్టం తెస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, ఆ అవగాహన కూడా లేకుండా మంత్రి తుమ్మల మాట్లాడటం విడ్డూరంగా ఉందని కేంద్రమంత్రి విమర్శించారు. 45 లక్షల మందికి రుణమాఫీ చేస్తామని చెప్పి, కేవలం 25 లక్షల మందికే చేసి మిగిలిన 20 లక్షల మందిని గాలికొదిలేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణకు అయ్యే ప్రతి పైసా కేంద్రమే ఇస్తోందని, గత సీజన్‌లో 60 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కేంద్రమే సేకరించిందని గణాంకాలను వివరించారు. ప్రత్యామ్నాయ పంట బీమా పథకం తీసుకురాకుండా, ఫసల్ బీమాను అడ్డుకుంటూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. ఏటా కేంద్రం ఇచ్చే రూ.400 కోట్ల ఎస్‌డిఆర్‌ఎఫ్ నిధులు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. వ్యవసాయ మంత్రికి సొంత పార్టీ మేనిఫెస్టోపై, కేంద్రం అందిస్తున్న సహకారంపై అవగాహన కల్పించాలని సిఎంను కోరారు. రైతు సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు.

# రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు మంజూరు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ ఇటీవల ప్రాథమిక అనుమతుల మంజూరుకు అంగీకరించినట్లు సింగరేణి సంస్థ తెలిపింది. మరో పది రోజుల్లో అనుమతి పత్రా లు రానున్నాయి. ఈ మొత్తం ప్రాజెక్టుకు 4326.08 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన భూమి అవసరం. మొత్తం 5,403 మంది సింగరేణి ఉద్యోగులకుగాను, మరో 600 మంది కాంట్రాక్టు సిబ్బంది ఈ ప్రాజెక్ట్ నిమ్మితం పనిచేయనున్నారు. కాగా మొత్తంగా రూ 2,194.05 కోట్ల మూలపెట్టుబడితో ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనుమతులు మంజూరుకు అంగీకరించినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ,వాతావరణ మార్పుల శాఖ నుండి సింగరేణి యాజమాన్యానికి సందేశం అందింది. అనుమతుల కోసం సింగరేణి సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మార్గనిర్దేశంలో డైరెక్టర్లు, అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి.

సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా ఏడాదికి 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యంతో రూపొందించిన ఈ వినూత్న ప్రాజెక్టుకు ప్రాథమిక పర్యావరణ అనుమతులు లభించడం పట్ల సింగరేణి యాజమాన్యం హర్షం ప్రకటించింది. మూతపడుతున్న పాత గనుల ఉత్పత్తిని భర్తీ చేయడానికి, ఇప్పటికే కనీస అనుమతులు ఉన్న రెండు ఓపెన్ కాస్ట్ గనులు, మూడు భూగర్భ గనుల పరిధిలోని బొగ్గును ఇంకా తవ్వి తీయడానికి అనువుగా ఉన్న 314.98 మిలియన్ టన్నుల నిల్వలను ఉత్పత్తి చేయడానికి ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఇక్కడ ఉత్పత్తి చేసే బొగ్గు ప్రధానంగా సమీపంలోని ఎన్‌టిపిసి రామగుండం, ఇతర బొగ్గు ఆధారిత పరిశ్రమలకు ఇంధన సరఫరా ఒప్పందం ప్రకారం సరఫరా చేయనున్నారు.

### మరో 25ఏళ్ల జీవిత కాలం..


మూతపడుతున్న గనుల ఉత్పత్తిని భర్తీ చేసుకోవడంతో పాటు ఈ గని రామగుండం రీజియన్‌కు మరో 25 సంవత్సరాల జీవిత కాలాన్ని అందించనుంది. సాధారణంగా భూగర్భంలో బొగ్గు తవ్వకం అయిపోయిన తర్వాత కూడా కొంతమేర బొగ్గు గనిలో మిగిలిపోతుంది. ఈ బొగ్గును వదిలివేయకుండా సద్వినియోగం చేసుకోవడం కోసం సింగరేణి సంస్థ గతంలో మూతపడిన భూగర్భ గనుల ప్రదేశంలో ఓపెన్‌కాస్ట్ గనులను ప్రతిపాదించింది. దీనికి అనుమతులను కూడా సాధించి తవ్వకాలు చేపట్టింది. ఇందులో కొత్తగూడెంలోని గౌతమ్‌ఖని ఓపెన్ కాస్ట్ గని, మణుగూరులో మణుగూరు ఓపెన్ కాస్టు గని మరికొన్ని ఒసి గనులతో పాటు తాజాగా కొత్తగూడెంలోని వి కె. కోల్ మైన్ ఉన్నది.

అలాగే రామగుండం1 ఏరియాలో మూతపడిన జిడికె 10 ఇంక్లైన్ గనిలో మిగిలిన్న 56.79 మిలియన్ టన్నుల బొగ్గు, రామగుండం 2 ఏరియాలో త్వరలో మూతబడనున్న వకీల్‌పల్లి గనిలో మిగిలి ఉండే 28.99 మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీయడం కోసం అక్కడ ఓపెన్ కాస్ట్ తరహా మైనింగ్ జరపాలని సంస్థ యోచించింది. రామగుండం ఓపెన్ కాస్ట్ 1 విస్తరణ ప్రాజెక్టు ఫేజ్ 2కు మధ్య సరిహద్దు ప్రాంతంలో రక్షణ నిమిత్తం వదిలేసిన 25.98 మిలియన్ టన్నుల బొగ్గు, ఇంకా ఈ గనులకు పక్కన అటు ఇటుగా ఉన్న బొగ్గు నిల్వలు 3.90 మిలియన్ టన్నులను, రామగుండం ఓపెన్ కాస్ట్2 విస్తరణ ప్రాజెక్టు, అడ్రియాల షాఫ్ట్ అండర్ గ్రౌండ్ విస్తరణ గనుల సరిహద్దు తలాల వద్ద మిగిలి ఉన్న బొగ్గును కూడా ఈ ప్రాజెక్టు పరిధిలోనే తవ్వి తీయాలని సింగరేణి సంస్థ నిర్ణయించింది.

### ఈ ప్రాజెక్టును ఇలా ప్రారంభిస్తారు...

ముందుగా మూతపడిన జిడికె 10 ఇంక్లైన్ భూగర్భ గనిని ఓపెన్ కాస్ట్ గనిగా మారుస్తారు. దీనిని ఓపెన్ కాస్ట్ 1 గనిగా ముందుకు కొనసాగిస్తూ షావెల్‌డంపర్ పద్ధతిలో తవ్వుతారు. ఈ క్రమంలో వచ్చే ఓవర్ బర్డెన్ మట్టిని ప్రస్తుతం ఆర్.జి ఒసి 1 ఎక్స్‌టెన్షన్ ఫేజ్2లో బొగ్గు తవ్వగా ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో నింపుతారు. ఇలా జిడికె 10 ఇంక్లైన్ ప్రాంతంలోని బొగ్గు తవ్వకానికి 8 సంవత్సరాల సమయం పడుతుంది. ఆ తర్వాత వకీల్ పల్లి గనిని ఓపెన్ కాస్ట్ గనిగా మారుస్తారు. ఈ క్రమంలో వకీల్ పల్లి ఓపెన్ కాస్ట్ గని ప్రాంతం నుండి వచ్చే ఓవర్ బర్డెన్ మట్టిని అప్పటికే తవ్వకం పూర్తయిన జిడికె 10 ఇంక్లైన్ క్వారీలో ఏర్పడే ఖాళీ ప్రదేశంలో నింపుతారు. ఇలా రెండు భూగర్భ గనులను ఓపెన్ కాస్ట్ గనులుగా మార్చినప్పటికీ, ఆ క్వారీలలో అక్కడ ఉత్పత్తి జరిగే ఓవర్ బర్డెన్ మట్టితోనే నింపుతారు. వ్యాపారపరంగా కూడా సింగరేణికి ఇదొక అద్భుత అవకాశంగా అధికారులు చెబుతున్నారు.

## ఎమ్మెల్యే.. వివేకానంద భూములు ఆక్రమించుకున్నారు : టిఆర్ఎస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొంపల్లి, సుచిత్ర, బాచుపల్లి, జీడిమెట్ల, పావురంపేటలో కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను బిఆర్ఎస్ ఎంఎల్‌ఏ కె.పి.వివేకానంద ఆక్రమించుకున్నారని, అలాంటి వ్యక్తి కవితపైన వ్యాఖ్యలు చేసే అర్హత లేదని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) నాయకులు శ్రీకాంత్ గౌడ్ అన్నారు. కెటిఆర్, హరీశ్ రావులకు బినామీ కాదా? అని వివేకానందను ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివేకానంద ముందు ఎంత మంది పేద, మధ్య తరగతికి చెందిన భూములు కొల్లగొట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత విషం చిమ్మే రాజకీయాలు చేయబోదని, మరోసారి కవితపైన ఇష్టమొచ్చినట్టుగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. 'మీ నాయకుడు' ప్రజల్లోకి రారని, దీంతో ఇక బిఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు.

## కరెంట్ పోల్స్ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని కోనారెడ్డిపేట చెరువు కట్టపై నిర్వహించే మైసమ్మ తల్లి పండుగకు శాశ్వతంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని పట్టణ ప్రజలు చేసిన విజ్ఞప్తులకు వెంటనే స్పందించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి అవసరమైన అనుమతులు తీసుకుని నేడు చెరువు కట్టపై కరెంట్ పోల్స్ ఏర్పాటు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, ప్రజల సౌకర్యాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## రైతు వారోత్సవాలు

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు మండలంలో రైతు వారోత్సవాల నిర్వహణను ఈ నెల 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి మనోహిత్ విక్రమ రావ్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, సహకార, నీటి పారుదల, ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో రైతులకు ప్రత్యక్ష అవగాహన, శిక్షణ, క్షేత్ర ప్రదర్శనలు, సమస్యల పరిష్కార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతు వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## ములుగు కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్య పనులు

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోవడంతో లేదని బిసి జెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ములుగు మార్కెట్ పరిసరాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తుందన్నారు. రోజు వందలాది మంది ప్రజలు, వ్యాపారులు మార్కెట్‌ను సందర్శిస్తున్నప్పటికి కనీస శుభ్రత చర్యలు చేపట్టకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఈ పరిస్థితి వలన ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టి మార్కెట్‌ను శుభ్రపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ప్రజల ఆగ్రహం ఉధృతమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

## రైతు సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ నర్సంపేట :** మే 6న జరిగే రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని రైతు సదస్సు పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమకొండ హంటర్ రోడ్డులో మే 6న బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నా రైతుసదసుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని, కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ పెట్టి రైతులకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను మోసం చేసిందని, రైతు భరోసా, రైతు రుణమాఫీ, బోనస్, ధాన్యం కొనుగోలు ఇలా అనేకరకాలైన హామీలతో రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రైతులకు యూరియా కష్టాలు, కరెంటు కష్టాలు, సాగునీటి కష్టాలు, ధాన్యం కొనుగోలు కష్టాలు, అనేక రకాలుగా రైతులను కాంగ్రెస్ పార్టీ కష్టాలపాలు చేసిందన్నారు. ప్రతిపక్షాల సమావేశాలకు పోటీగా అధికార పార్టీ సమావేశాలు పెట్టి, బిఆర్ఎస్ పార్టీ గొంతునొక్కలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, ఓడి సిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మండల పార్టీ కన్వీనర్,మాజీ జెడ్పిటిసి మాజీ ఎంపిపి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి, రూరల్ పార్టీ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ బాధ్యులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ పార్టీ బాధ్యులు, సర్పంచ్, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలు , వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు...

## జిల్లా అధ్యక్షురాలిని కలిసిన రవియాదవ్ , సిద్ధారెడ్డి



**ప్రజాపక్షం/జనగామ:** జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా నిలయమితులైన ఉడుత రవియాదవ్, జిల్లెల సిద్దారెడ్డిలు ఆదివారం మర్యాద పూర్వకంగా జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మి నారాయణ నాయక్‌కు కలిశారు. తమ నియామకానికి కృషి చేసిన వారిని శాలువాతో సత్కరించి పూల బోకే అందజేశారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ శనివారం జనగామ జిల్లా పూర్తి స్థాయి కమిటీని నియమించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సీనియర్ నాయకులు ఉడుత రవియాదవ్, ప్రధాన కార్యదర్శిగా జిల్లెల సిద్దారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆదివారం జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, టిపిసిసి సభ్యుడు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉడుత రవి యాదవ్, జిల్లెల సిద్దారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోటే శ్రీనివాస్, పిట్టల సతీష్, ఆకుల లక్ష్మయ్య, గాలి కృష్ణా, మాజీ ఎంపిటిసి యండి మహబూబాబ్, కర్రె రాజశేఖర్, బోలికొండ నర్సింహులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుకు దిక్కేది?



**ప్రజాపక్షం/జనగామ:** మొక్కజొన్న రైతుకు దిక్కులేదు. మార్కెట్ ఫెడ్ అధికారులు కనీసం గన్నీ బ్యాగ్‌లు కూడా ఇవ్వడం లేదు. దీనితో ఒకే కేంద్రంలో 40వేల బస్తాల మొక్కజొన్నలు కళ్లంలోనే మూల్గుతున్నాయి. గోనే సంచులు రైతులు స్వయంగా కొని బస్తాలు నింపినా రవాణా సౌకర్యం లేదు. రవాణ సౌకర్యం ఏర్పాటు చేయాలంటే మీరే ట్రాక్టర్లలో తేవాలంటు అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. దీనితో రైతులకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేసినా అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప స్పందించడం లేదు.

జనగామ జిల్లాలో ఈ ఏడాది భారీగా మొక్కజొన్న సాగైంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా ఒక్క రఘునాథపల్లి మండలం కంచెనపల్లి గ్రామంలోనే 1500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మిగతా చుట్టుపక్కల గ్రామాల్లో మరో 500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రఘునాథపల్లి మండం కంచెనపల్లి సమీపంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కోఆపరేటీవ్ సహకార సంఘం కొనుగోలుకు సిద్ధం కాగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడయం శ్రీహరి గత నెల రోజుల క్రితమే ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు కొనుగోలు చేసింది కేవలం 5వేల బస్తాలు మాత్రమే.

**కళ్లంలోనే 35 వేల బస్తాల మొక్కజొన్న**

కంచెనపల్లి వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సుమారు 35వేల బస్తాల మొక్కజొన్నలు ఉన్నాయి. కంచెనపల్లి, గోవర్ధనగిరి, కోమళ్ల, నిడిగొండ, పాలకుర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులతో పాటు స్టేషన్‌ఘనపూర్ మండలంలోని ఇప్పగూడెం, రంగరాయిగూడెం, కోమటిగూడెం, సముద్రాల, రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి, నర్మెట మండలంలోని మచ్చుపహాడ్, హన్మంతాపూర్, తరిగొప్పులు ఇలా పలు గ్రామాలకు చెందిన 360 మంది రైతులు నూర్పిడి చేసిన మొక్కజొన్నను తీసుకొచ్చి కళ్లంలో పోశారు. నెల రోజుల నుండి మొక్కజొన్నలు కళ్లాలోనే ఉంటున్నాయి తప్ప కొనుగోలు చేయడం లేదు.

**గన్నీ బ్యాగ్‌లు, రవాణా చార్జీలు రైతులవే**

మార్క్‌ఫెడ్ అధికారులు ఐదు వేల బస్తాలు ఇవ్వగా రైతులు మొక్కజొన్నలు నింపి విక్రహంచారు. ఇక సంలు లేవని చెప్పడంతో రైతులు స్వయంగా లక్షా 50వేలు ( ఒక గన్నీ బ్యాగ్‌కు 30 రూపాయలు) ఖర్చు చేసి 5వేల గన్నీ బ్యాగ్‌లు కొనుగోలు చేసి మొక్కజొన్నలు నింపారు. మార్కెట్‌పెడ్ అధికారులు మళ్లీ కిరికిరి పెట్టారు. రవాణా కూడా లేదని చెప్పడం, మీరే ట్రాక్టర్లలో తీసుకురావాలని చెప్పడంతో రైతులపై మరింత భారం పడుతుంది. కొందరు రైతులు నెల రోజులైనా కొనుగోలు చేయకపోవడంతో ప్రైయివేట్ లో అమ్ముకుంటామని మళ్లీ ట్రాక్టర్లలో తీసుకెళ్తున్నారు. ఇలా మొక్కజొన్న రైతుల్ని మార్క్‌ఫెడ్ అధికారుల్ని ఇబ్బందులు పెడుతున్న పరిస్థితి ఉంది.

**వెంటనే జిల్లా కలెక్టర్, మార్క్‌ఫెడ్‌అధికారులు స్పందించాలి :సిహెచ్‌రాజారెడ్డి మాజీ ఎమ్మెల్యే, సిపిఐ**

జనగామ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లతో పాటు మొక్కజొన్న కొనుగోళ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఒక్క కంచనపల్లి కొనుగోలు కేంద్రం వద్దనే 40వేల బస్తాల మొక్కజొన్నలు కళ్లంలో మూల్గుతున్నాయి. గన్నీ సంచులు లేవని మార్క్‌ఫెడ్ అధికారులు బోర్డు పెట్టారు. రైతులు గన్నీ బ్యాగ్‌లు తెచ్చుకున్నా రవాణా సౌకర్యం ఇవ్వడం లేదు. రవాణా ఖర్చులు రైతులే బరించాలంటున్నారు. ఇలా అయితే రైతులపై భారం పడుతుంది. మొక్కజొన్న కోనుగోళ్లలో సమన్వయం లోపించింది. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలి. గోనే సంచులు ఇప్పించడంతో పాటు, ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పించాలి.

## ఐకెపి సెంటర్లో అన్నదాతల అష్టకష్టాలు



**ప్రజాపక్షం/కాజీపేట :** పంట పండించి ధాన్యం అమ్ముకోవడానికి అన్నదాతలకు అధికారులు పెడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ఒక రైతు తాను ఉప్పిడి ఉపాసంతో అప్పులు తెచ్చి పెట్టుబడులకు పెట్టి నిద్రాహారాలు లేకుండా పంట పొలాలకు నీళ్ల లేక తాను ఎన్నో కష్టాలు పడి పండించిన పంటకు ఫలితం లేకుండా పోతున్నది. తాను పండించిన పంటను అమ్ముకోవడానికి అగ్రి కల్చర్ ఆఫీసర్లు, ఐకెపి సెంటర్లు పెడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. మామూలు రైతుకు స్మార్ట్ ఫోన్లు ఎక్కడినుండి వస్తాయి. తాను పండించిన ధాన్యం అమ్ముకోవడానికి అగ్రికల్చర్ ఆఫీసర్ నుండి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి అక్కడికి వెళ్లి నిరీక్షణ పడి అక్కడ పేరు నమోదు పత్రం చేసుకొని తిరిగి మళ్లీ ఐకెపి సెంటర్‌కు వచ్చి అక్కడినుండి ట్రాక్షిట్ తీసుకొని అక్కడినుండి మళ్లీ రైస్ మిల్లులకు వెళ్లి నిద్రాహారం లేకుండా చేస్తున్నారు. రైతులు కొనుగోలు దారుకు తాను అన్న రేటుకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మామూలు రైతు ఇన్ని కష్టాలు పడడం కంటే ఉన్న భూములు అమ్ముకొని వలస పోవడం నయం అనే పరిస్థితిలో ఉన్నారు. కాబట్టి రైతులకు సరియైన సౌకర్యాలు ప్రభుత్వం అందించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. రైతులు ముప్పు తిప్పలు పడి పండించిన పంటను అమ్ముకోవడానికి దుర్భర పరిస్థితి ఏర్పడుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు చేరువగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని అంటున్నారు.

## ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు



**ప్రజాపక్షం/వరంగల్ :** రైతులు పండించిన పంటలను అమ్ముకునేందుకు తీసుకొస్తున్నారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అధికారులకు సూచించారు. వరంగల్ మున్సిపల్ కూడా సమావేశ మందిరంలో మొక్కజొన్న నిల్వలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాపత్ వాజ్పాయ్, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎప్పుడూ లేనంతగా మొక్కజొన్న పంట దిగుబడి అధికంగా రావడంతో, వాటి నిల్వ కోసం సరైన స్టోరేజ్ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని, అలాగే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని ఎనుమాముల మార్కెట్ యార్డ్‌లోని గల కవర్ షేడ్స్‌లో భద్రపరచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి , ఎడి అగ్రికల్చర్ అనురాధ, డిసిఓ నీరజ, వరంగల్ ఆర్‌డిఒలు సుమ, సంబంధిత మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు

## నిబంధనలు లేకుండా కుట్టు మిషన్ల రుణాలు

### సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కుమారస్వామి డిమాండ్

**ప్రజాపక్షం /నల్లబెల్లి :** బిసి సంక్షేమ శాఖ బిసి ,ముస్లిం నిరుపేద మహిళలకు స్వయం ఉపాధి పథకం కింద వంద శాతం నిబంధనలు లేకుండా సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి అన్నారు . ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్లో జరిగిన మహిళా కుట్టు మిషన్ చేతి వృత్తిదారుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఒసిలలోని పేద మహిళా టైలర్లందరికీ ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించాలనీ డిమాండ్ చేశారు . కుట్టు మిషన్ శిక్షణలో సర్టిఫికెట్ పొందిన మహిళలకు, వితంతువులు నిరుపేదలకు నియోజకవర్గానికి పూర్తి సబ్సిడీతో వంద ఆటోమెటిక్ కుట్టు మిషన్లు అందించనున్నట్టు ఎప్రిల్ 27 న ప్రభుత్వం నిర్ణయించినట్టు అందుకోసం త్వరలో అధికారికంగా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు కోరనున్నట్లు పత్రికల ద్వారా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ పథకాన్ని సిపిఐ ఆహ్వానిస్తున్నదనీ అదే క్రమంలో నియోజకవర్గానికి 1000మంది బిసిలకు మాత్రమే కాకుండా ఎస్‌సి, ఎస్‌టి,ఒసిలలోని నిరుపేద మహిళా కుట్టు మిషన్ వృత్తి దారులందరికీ సంఖ్యతో సంబంధం లేకుండా ఈ పథకాన్ని వర్తింపచేయాలనీ అన్నారు. సర్టిఫికెట్ లు ఉన్నా లేకున్నా, స్టిచ్చింగ్ చేస్తున్న మహిళలందరికీ ఈ పథకం వర్తింపచేయాలన్నారు. మహిళా టైలర్లందరికీ క్లాత్ ,స్టిచ్చింగ్ మెటేరియల్ కోసం ప్రభుత్వమే ష్యూరిటిగా బ్యాంకుల ద్వారా లక్ష రూపాయల వరకు సబ్సిడీ ఋణాలు అందించి మహిళా టైలర్ వృత్తిని బలోపేతం చేయాలన్నారు. మహిళా టైలర్ నాయకురాలు కత్తి రమా మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు కుట్టించే డ్రెస్ లకు ఇచ్చే రూ.70లతో మహిళలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. చిన్న పిల్లల డ్రెస్ లకు రూ.100.రూపాయలు లు పది సంవత్సరాల పైనున్న విద్యార్థులకు 200రూపాయలు చెల్లిస్తేనే ప్రభుత్వం చెప్పే స్వయం ఉపాధి పథకానికి అర్థం ఉంటుందన్నారు. భవిష్యత్ కార్యాచరణ కోసం ఏఐటీయూసీ అనుబంధ చేతివృత్తి దారుల సంఘం మండల కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షురాలుగా ఓదేల కవిత, అధ్యక్షులుగా దిండు మమత, ఉపాధ్యక్షులుగా కోడూరి కవిత, రావుల అనిత, ప్రధాన కార్యదర్శిగా కత్తి రమా, కార్యదర్శులుగా అనంతగిరి సునిత, మంద కళ్యాణి, కంపెల్లి భారతి, కోశాధికారిగా జంపాల లావణ్య, సభ్యులుగా కీసరి అనిత, యార రజిత, అడ్డగట్ల భవాని, వేముల నవ్య, కోడూరి సుప్రియ, తదితరులతో మండల కమిటీ వేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య, ,సిపిఐ రైతు సంఘం మండల కార్యదర్శి మామిండ్ల పెద్ద అయిలయ్య, మండల నాయకులు పరికి కోర్నేలు, ఓదెల రవి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/జనగామ:** జిల్లాలో నిర్వహించిన నీట్ పరీక్ష ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జరిగిందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఆదివారం జిల్లాలో నీట్‌పరీక్ష జరుగుతున్నఎబివి డిగ్రీ కాలేజ్, అలాగే పెంబర్తిలోని మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాల కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు పూర్తయ్యేంతవరకు విద్యార్థులకు ఎటువంటి అంతరాయం, సమస్యలు ఉత్పన్నం కలుగకుండా ఇన్విజిలేటర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిబంధనలకు విరుద్దంగా ఇతరులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు గోపిరాం, వెంకన్న, ఇతర పోలీస్ అధికారులు, నీట్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా తుమ్మల చెరువు ట్యాంక్‌బండ్ పునరుద్ధరణ

### అధికారులకు ఎమ్మెల్యే గండ్ర ఆదేశం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే తుమ్మల చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంబంధిత అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మల చెరువు పునరుద్ధరణ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుశంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తుమ్మల చెరువు అభివృద్ధి కోసం గ్రీనరీ, లైటింగ్, మత్తడి హై లెవెల్ వంతెన తదితర పలు పనులకు సుమారు రూ.4 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా భూపాలపల్లి పట్టణ ప్రజలందరికీ మెరుగైన వాతావరణం ఆహ్లాదాన్ని పరిచే విధంగా, విశ్రాంతి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. భూపాలపల్లి పట్టణ ప్రజలు బతుకమ్మ ఆడుకోవడానికి తుమ్మలచెరువు ఒకటే ఉందని దాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచే విధంగా చేయడం జరుగుతుందన్నారు. భూపాలపల్లి పారిశ్రామిక ప్రాంతంలో బొగ్గు గాని కార్మిక కుటుంబాలు అట్లాగే జెన్కో ఉద్యోగులు వారి ఆహ్లాదం కొరకు మినీ ట్యాంక్ బండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూపాలపల్లి మున్సిపల్ అభివృద్ధి కోసం 60 కోట్ల నిధులతో పాటు తుమ్మలచెరువు అభివృద్ధి కోసం కూడా సుమారు 5 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్,వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, పిసిసి సభ్యులు చల్లూరి మధు, స్థానిక కౌన్సిలర్లు అప్పం కిషన్, పుల్లూరి మంజుల మాధవరావు, 24 వ వార్డు కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్, మున్సిపల్ ఏఈ మానస, సంబంధిత శాఖ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సినీగేయ రచయిత చంద్రబోస్ సోదరుడు గుండెపోటుతో మృతి

### చల్లగరిగలో విషాదఛాయలు




**ప్రజాపక్షం/భూపాలపల్లి/చిట్యాల :** ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల చంద్రబోస్ సోదరుడు కనుకుంట్ల రాజేందర్(60) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చల్లగరిగ గ్రామానికి చెందిన కనుకుంట్ల నరసయ్య మధునమ్మ దంపతులకు రాజేందర్, కోటి, చంద్రబోస్ అను ముగ్గురు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు రాజేందర్ గతంలో కండక్టర్ గా పనిచేశారు. అదే విధంగా గత ప్రజారాజ్యం పార్టీలో కొద్ది రోజులు పని చేశారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉంటున్న రాజేందర్ బిజినెస్ పనులు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో రాజేందర్ మరణం ఆయన కుటుంబ సభ్యులను, సన్నిహితులను దిగ్భ్రాంతికి గురిచేసింది. అన్నమయ్య జిల్లా కలికిరి మండల కేంద్రంలో ఉన్న తన స్నేహితుడిని కలిసేందుకు రాజేందర్ శనివారం అక్కడికి చేరుకున్నారు. రాత్రి తన స్నేహితుడి ఇంట్లోనే బస చేసిన ఆయన, ఆదివారం ఉదయం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో స్నేహితులు తక్షణమే స్పందించి ఆయనను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న సమయంలోనే రాజేందర్ పరిస్థితి విషమించింది. వైద్యులు శ్రమించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న చంద్రబోస్ కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రాజేందర్ మృతి పట్ల సినీ ప్రముఖులు, చంద్రబోస్ అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. రాజేందర్ మృతితో స్వగ్రామమైన చల్లగరిగలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ప్రజాభివృద్ధే ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే నాయిని

**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజల జీవితాల్లో ప్రత్యక్షంగా మార్పు తీసుకురావడమే అసలైన రాజకీయమని, కనిపించే అభివృద్ధి మాత్రమే శాశ్వతమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయాలు తాత్కాలికమైతే, అభివృద్ధి శాశ్వతమని ఆయన స్పష్టం చేశారు.ఆదివారం రోజున వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, బల్దియా మేయర్ గుండు సుధారాణి గార్లతో కలిసి 60వ డివిజన్ పరిధిలో సుమారు రూ.3.50 కోట్ల పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శ్రీకారం చుట్టారు. ఈ పనుల్లో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం, ఆధునిక సిసి డ్రైనేజీ , వడ్డేపల్లి ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, తక్షణ పరిష్కారాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాలనీ ప్రజలు, కమిటీ సభ్యులతో కలిసి పనులకు శంకుస్థాపనలు చేశారు.ప్రజల అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, పార్టీలు, రాజకీయాలు పక్కన పెట్టి ప్రతి డివిజన్‌లో సమాన అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. కార్పొరేటర్ల పదవీకాలం ముగియబోతున్న సందర్భంలో కూడా వారు చూపిన సహకారం వల్లే గత రెండేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధ్యమైందని ఆయన అభినందించారు.రానున్న రోజుల్లో రహదారులు, పారిశుధ్యం, ఆరోగ్యం, విద్య రంగాల్లో మరిన్ని ప్రాజెక్టులు తీసుకువస్తామని హామీ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తోందని, అదే దిశగా నియోజకవర్గంలో కూడా వేగవంతమైన అభివృద్ధి కొనసాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### పబ్లిక్ గార్డెన్ అభివృద్ధికి కృషి చేస్తా



హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ అభివృద్ధికి శాయశక్తులా తన వంతు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం పబ్లిక్ గార్డెన్ లో జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరై నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పబ్లిక్ గార్డెన్‌లో వాకర్స్‌కు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. వాకర్స్‌కు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు అక్కినపల్లి రవి గుప్తా కార్యదర్శి గాడిపల్లి రాజిరెడ్డి, కోశాధికారి సుంకరి రవి కుమార్, కార్యవర్గ సభ్యులు వీసం రమణారెడ్డి, పులి హరిక్రిష్ణ తదితరులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గౌరు రాజిరెడ్డి మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని సహకారంతో వాకర్స్ అందరి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే పాత కమిటీ సలహాలు, సూచనలతో ముందుకు సాగుతామని రాజిరెడ్డి తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీలోని పెద్దతండా 33/11కెవి ఫీడర్ మరమ్మతులో భాగంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, ఎఇ జిల్లా ప్రభాకర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌నగర్, ఆదిత్యనగర్ 1,2, నాయుడుపేట సర్కిల్, చిన్నతండా, సూర్యానగర్ ప్రాంతాలు ప్రభావితమవుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటటి గంట వరకు అంతరాయం కలుగనుంది. కావున గృహ, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## మహిళలు చైతన్యంతో పోరాడాలి



**ప్రజాపక్షం/చింతకాని :** మహిళలు ఎర్కొంటున్న తమ సమస్యల పరిష్కారం కోసం చైతన్యంతో ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి , జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి పిలుపునిచ్చారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో కన్నెపోగు రాధమ్మ అధ్యక్షతన జరిగిన మహిళా సమాఖ్య శాఖ మహాసభలో వారు మాట్లాడుతూ పాలకులు మహిళల పట్ల సవతి ప్రేమ చూపిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కి హామీలు విస్మరించారన్నారు. మహిళల సమస్యలు పరిష్కారం కోసం మే 16న వైరా కమ్మవారి కల్యాణమండపంలో తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా 22వ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలకు చింతకాని మండలం నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. అనంతరం ప్రొద్దుటూరు మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తుడుం బారతమ్మ, కన్నెపోగు రాధమ్మ మరో తొమ్మిది మంది కమిటీ సభ్యులుగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు దొండపాటి రమేష్, పావులూరి మల్లిఖార్జునరావు, మహిళా సమాఖ్య నాయకులు తుడుం భారతమ్మ, సావిత్రమ్మ, తిరుపమ్మ, కన్నెపోగు రమణ, కనకపుడి తిరుపమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్‌లో 'బ్రిలియంట్'విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాకకు చెందిన బ్రిలియంట్ విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుతూ ఘన విజయాన్ని సాధించారు. ప్రతిష్టాత్మక ఫేజ్ 2 మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అగ్ర ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఈ విజయోత్సవాన్ని గుర్తిస్తూ హైదరాబాద్ హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించబడింది. శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులు అందుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ(సీతక్క), కొండా సురేఖ, అలాగే ఎన్ఐటి రాయ్‌పూర్ డైరెక్టర్ డా ఎన్‌వి రామారావు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డా. బిఎన్ఆర్ మాట్లాడుతూ ఒలంపియాడ్ విజయాలు కేవలం అవార్డులు మాత్రమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటివి. ఇటువంటి పోటీలు పిల్లల్లో విశ్లేషణాశక్తి, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయని, ఇవే రేపటి రోజున ఐఐటి, ఎన్ఐటి, ఐఏఎస్, ఐపిఎస్ వంటి ప్రతిష్టాత్మక లక్ష్యాలను సాధించేందుకు దోహదపడతాయని తెలిపారు. బ్రిలియంట్ విద్యాసంస్థల ద్వారా ఇప్పటికే అనేక మంది డాక్టర్లు, ఇంజనీర్లు, డీఎస్పీలు, ఎస్ఐలు తయారయ్యారని, ఈ విజయాలతో సంస్థ గర్వపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనం సక్సెస్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ నందు హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమం విజయవంతం అయింది. ఈ కార్యక్రమంలో భాగంగా హిందూ బంధువులు అంతా స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఆర్కే ఫంక్షన్ హాల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శివ నాగరాజ స్వామీజీ పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మార్పు అనేది మన ఇంటి నుండే మొదలవ్వాలని సూచించారు. మన పిల్లలకు కట్టు, బొట్టు, మానవతా విలువలను, మనమే నేర్పించాలని, అన్యాయాన్ని, అధర్మాన్ని ప్రశ్నించే తత్వాన్ని బోధించాలని అన్నారు. తిప్పర్తి శివమూర్తి ప్లాస్టిక్ వాడకం వలన మానవాళికి కలిగే అనారోగ్య సమస్యలు, పర్యావరణానికి కలిగే నష్టం గురించి కార్యక్రమంలో వివరించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని వ్యతిరేకించాలని కోరారు. హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాళ్లూరి వెంకటేశ్వరరావు, శ్రీరాములు, చేపూరి రామచంద్రరావు, లట్టి జగన్మోహన్, జ్యోతిర్మయి, రామిశెట్టి నాగేశ్వరరావు, చొప్పకట్ల చంద్రశేఖర్ శర్మ తోపాటు, హిందూ బంధువులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బోనగిరి సోమలింగం మృతి

**ప్రజాపక్షం/కారేపల్లి:** రేలకాయపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోనగిరి సోమలింగం(72)అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంజుల మాట్లాడుతూ సోమలింగం పార్టీ పట్ల ఎంతో విధేయత కలిగిన నాయకులు, ఆయన మరణం మనందరికీ, ముఖ్యంగా రేలకాయపల్లి కాంగ్రెస్ కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. ఈకార్యక్రమంలో రేలకాయపల్లి సర్పంచ్ శిరీష రమేష్, గేట్ రేలకాయపల్లి సర్పంచ్ మంగ బన్సీ, వైరా ఆత్మ కమిటీ డైరెక్టర్ నరసింహారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు తేజావత్ బాలు, గిద్దెవారిగూడెం సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మోహన్, నరేష్, శోభన్, నాగులు, హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హతే కొలమానం..రాజకీయాలకు తావులేదు

### త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
### కూసుమంచి 'ప్రజాదర్బార్'లో మంత్రి పొంగులేటి భరోసా





**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల నుండి నేరుగా వినతులు స్వీకరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పారదర్శక పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సాదా బైనామా, నిషేధిత జాబితా, భూమి రికార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా సంక్షేమ పథకాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యతని, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేశారు. ప్రజా దర్బార్లలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసమే దరఖాస్తులు వస్తున్నాయని, గత ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని, మే నెలాఖరు నాటికి రెండో దశ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 25లక్షల మందికి రుణమాఫీ చేశామని, రైతు భరోసాను ఎకరానికి రూ.12వేలకు పెంచడంతో పాటు సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నామని గుర్తు చేశారు. మే 5 నుండి 7 వరకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ హరినాథ్‌బాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్

### కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్



**ప్రజాపక్షం/పాల్వంచ :** చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని చదువులో రాణించాలని కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ఆకాంక్షించారు. పాల్వంచ 8వ డివిజన్ పరిధి శ్రీనివాసకాలనీలో 20 మంది 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యం సాధించటానికి ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి చదువులో మెరుగైన ప్రతిభ చూపి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. వారికి విద్యాపరంగా ఏ అవసరం వచ్చినా సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్పాంజ్ ఐరన్ గేట్ ఎదురుగా గల దేవాలయంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, 40వ డివిజన్ కార్పొరేటర్ అడుసుమిల్లి సాయిబాబ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, 44, 31,6 వ, డివిజన్ కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, దినేష్, బిఎస్ రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు కనగాల అనంతరాములు, బిఆర్ఎస్ నాయకుడు కాంపెల్లి కనకేష్, సిపిఐ నాయకులు గొర్లె నరేష్, అన్నారపు వెంకటేశ్వర్లు, రామాచారి, ఆలపాటి ప్రసాద్, కాకటి రవీంద్ర, దుర్గా భవాని, లాల్‌పాషా, విద్యార్థులు, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడా, సాంస్కృతిక రంగాలపై దృష్టి పెట్టాలి: ఎస్.కె.సాబీర్ పాషా




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** యువత, క్రీడా సాంస్కృతిక రంగాలపై దృష్టి సారించాలని. అప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని ప్రగతి మైదానంలో ఆదివారం స్టాలిన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి ప్రీమియర్ లీగ్ సెషన్ 2 క్రికెట్ టోర్నమెంట్‌ను మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల ఉంటేనే యువత జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. మైదానంలో స్నేహపూర్వక వాతావరణంలో ప్రతిభను ప్రదర్శించాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా ఐక్యతను పెంచేందుకు దోహదపడతాయని ఈ సందర్భంగా పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, నిర్వాహక కమిటీ సభ్యులు స్టాలిన్, జేమ్స్, అజయ్, చక్రధర్, బిట్టు, సాయి, అజయ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## 'నేడు' ఖమ్మంలో మెగా జాబ్ మేళా

### యువత సద్వినియోగం చేసుకోవాలి
### కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో మే 4న ఉదయం 9 గంటల నుండి ఎస్ఆర్ గార్డెన్స్, ఖమ్మంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో సుమారు 93 కంపెనీలు పాల్గొంటున్నాయని, 4000కు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఐటీ, ఫార్మా, తయారీ, మార్కెటింగ్, టెలికమ్యూనికేషన్, కస్టమర్ కేర్, లాజిస్టిక్స్ తదితర విభిన్న రంగాల్లో ఈ అవకాశాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని యువతకు నేరుగా ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి నైపుణ్యాలను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించడం ఈ జాబ్ మేళా ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పీజీ తదితర అర్హతలు కలిగిన ప్రతి యువకుడు, యువతి ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్ సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. యువత ఉపాధి పొందడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు జిల్లా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ దిశగా జిల్లా పరిపాలన యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# సిసి, గ్రావెల్ రోడ్ల పనులకు శ్రీకారం

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి కీలక అడుగు పడింది. పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో సిసి రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. లక్ష్మీపురం గ్రామ పంచాయితీ, ముసలిమడుగు గ్రామ పంచాయితీ పరిధిలోని ముసలిమడుగు, సందేళ్లరామాపురం, చెరువు సింగారం గ్రామాల్లో ఈ పనులు చేపట్టడం జరిగింది. ఈ రహదారి పనులు పూర్తయ్యాక గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, జిల్లా నాయకులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ నాయకుల చేరిక..**

**ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో ఆళ్లపల్లి మండలం దొంగతోగు గ్రామ పంచాయితీకి చెందిన బిఆర్ఎస్ సర్పంచ్ బచ్చల పాపారావు, నాయకుడు కొమరం రమేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులైన కాంగ్రెస్‌లో చేరినట్లు నాయకులు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం కలిసి పని చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, రామంజగూడెం సర్పంచ్ మోకాళ్ల చంద్రశేఖర్, సుతారి కృష్ణ, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వారంలోపు డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె

### వాసిరెడ్డి సీతారామయ్య పిలుపు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం వారు ప్రకటన విడుదల చేశారు. మే 2వ వారంలో సమ్మె నోటీసు యాజమాన్యానికి ఇవ్వనున్నట్లు తెలిపారు. సమ్మెపై ఇతర కార్మిక సంఘాలతో కూడా చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. గత ఏడు నెలలుగా కార్మిక సమస్యలను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాత పలువురు అధికారులు మారడం వల్ల సమస్యల పరిష్కారం ఆలసయ్యమవుతోందని విమర్శించారు. స్ట్రక్చర్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదని, ముఖ్యంగా మెడికల్ బోర్డు నిర్వహణ లేక కార్మికులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మారుపేర్లు, విజిలెన్స్ కేసుల డిపెండెంట్లకు ఉద్యోగాల విషయంలో కూడా యాజమాన్యం జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఏడాది గడిచినా లీగల్ అభిప్రాయం పేరుతో పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.51 వేల కోట్లు వెంటనే చెల్లించాలి, డిస్మిస్ కార్మికులకు మరో అవకాశం ఇవ్వాలి తదితర అన్ని డిమాండ్లపై మొదటి వారంలోగా చర్చించి పరిష్కారం చూపాలని, లేకపోతే రెండో వారంలో సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె తేదీ ప్రకటిస్తామని నాయకులు హెచ్చరించారు.

## ఎఐయుకెఎస్ మహాసభలను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** 11వ తేదీ నుండి 13 వరకు ఇల్లందులో జరిగే ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ సభ అఖిల భారత ప్రథమ మహా సభలను విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు కల్లూరి కిషోర్ పిలుపునిచ్చారు. ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం కిషోర్ మాట్లాడుతూ దేశంలో కోట్లాది మంది అన్నదాతలు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. పాలకుల రైతు వ్యతిరేక విధానాలతో దీనితో రోజు 40 మంది రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక అసమానతలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయని వాపోయారు. ఉపాధి హామీ పథకంలో పేరు మార్చి గ్రామీణ పేదలకు ఉపాధి లేకుండా చేయటానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఇల్లందులో జరిగే కిసాన్ సభకు అన్ని వర్గాల ప్రజలు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయబారపు వెంకటేశ్వర్లు, గోనెల రమేష్, కుంజా భాస్కర్, క్రిష్ణ, జి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో నిలిచిన ధాన్యం

### లారీలు ఎప్పుడొస్తాయో తెలియక రైతుల అయోమయం
### మసక మబ్బులతో ఆందోళనలో రైతన్నలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు కొనుగోలు కేంద్రాలలో లారీలు రాక మరియు గన్ని సంచులు కొరతతో కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం నిలిచి ఉన్నవి. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడివి అక్కడే నిలిచి ఉన్నవి. వాతావరణంలో మార్పులు మసక మబ్బులు వ్యత్యాసాలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు, పెద్ద కోరుకొండి, తెల్లగవరం, మర్లపాడు, వెన్నవల్లి, చిన్న కోరుకొండి, తాళ్లూరు వెంకటాపురం తదితర గ్రామాలలో ఏర్పాటుచేసిన ఐకెపి, సొసైటీ ,డిసిఎంఎస్, ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలకు గత వారం రోజులుగా, లారీలు రాక, గన్నీ సంచులు లేక, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట వేసి వారం రోజులు గడిచిన లారీలు రాకపోవటంతో కల్లాలలోనే రైతులు కన్నీరు పెడుతున్నారు. మరోవైపు గన్నీ సంచులు లేకపోవడంతో కూడా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం లోడు చేసిన లారీలు మిల్లుల్లోనే రోజుల తరబడి నిలిచి ఉంటున్నాయి. అకాల వర్షాల సమయంలో రైతులు ప్రతిరోజు ధాన్యంపై పరదాలను కప్పుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు స్పీడ్ పెంచి రైతులకు గన్నీ సంచులు, లారీల కొరత తీర్చి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## విద్యుదాఘాతంతో మొక్కజొన్న దగ్ధం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట కాలిపోయిన ఘటన మండల పరిధిలోని చిన్నమునగాలలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వడగాల్పులకు మంటలు ఎగిసిపడటంతో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాపగంటి నాగభూషణంకు చెందిన ఫాలిహౌస్ పాక్షికంగా కాలిపోయి నష్టం వాటిల్లింది. స్థానిక సర్పంచ్ పూనాటి బాబు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది, జెసిబి, స్థానికుల సహకారంతో రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.

## సబ్ స్టేషన్ సమస్యపై ఎమ్మెల్యే జోక్యం



**ప్రజాపక్షం/కారేపల్లి:** భాగ్యనగర్ తండా సబ్ స్టేషన్ సమస్య పరిష్కారానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జోక్యం చేసుకున్నారు. సబ్ స్టేషన్ కోసం స్థలం ఇచ్చిన లకావత్ లక్ష్మికి గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఆమె నిరసనగా విద్యుత్ సరఫరా నిలిపివేసింది. విషయం తెలిసిన ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ కార్యాలయానికి చేరుకుని సంబంధిత అధికారులతో పాటు బాధితురాలితో చర్చించారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇస్తూ, ఇప్పటి వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అవసరమైతే తాత్కాలిక ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు బానోత్ హీరాలాల్, మేదరి టోనీ, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, బానోత్ రామ్మూర్తి నాయక్, దుగ్గినేని శ్రీనివాస్, గుగులోత్ భీముడు నాయక్, ఐలయ్య, షఫీ పాల్గొన్నారు.

## పారుపల్లి గ్రామ అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు సానుకూలత



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుని హైదరాబాద్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఇందిరమ్మ ఇండ్లు గ్రామంలోని నిరుపేద కుటుంబాల కోసం 60 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.మండలంలోని పేద విద్యార్థుల కోసం ఒక గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామంలో వందలాది ఎకరాల్లో వరి సాగు చేస్తున్న నేపథ్యంలో, రైతుల సౌకర్యార్థం ధాన్యం నిల్వ చేసుకునేందుకు ఒక గోదాం నిర్మించాలని కోరారు.త్రాగునీటి సమస్య పరిష్కారం, సిసి రోడ్ల నిర్మాణం,పునర్నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనం కోసం నిధులు కేటాయించాలని కోరారు. గ్రామంలోని చెరువుల్లో పూడిక తీయడం వంటి పనులను చేపట్టాలని వివరించారు.సర్పంచ్ విన్నపాలపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు పారుపల్లి గ్రామ అభివృద్ధికి తమ పూర్తి సహకారం ఉంటుందని, అవసరమైన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పారుపల్లి,ముత్తారం మండల ప్రజల తరపున సర్పంచ్ సంపత్ మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మనస్తాపానికి గురై యువతి ఆత్మహత్య



ప్రజాపక్షం /మల్లాపూర్ : తనను పెళ్లి చేసుకునే వ్యక్తి గల్ఫ్ దేశం బెహరాన్ లో ఆత్మహత్య చేసుకోగా మనస్థాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుని మరణించిన సంఘటన మల్లాపూర్ మండలంలోని సిరిపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిరిపూర్ కు చెందిన ఓల్లెపు శృతి (19)కి దామరాజు పల్లి గ్రామానికి చెందిన మక్కల సాయికుమార్ తో గత ఏడు నెలల క్రితం వివాహం నిశ్చయమైందని, గల్ఫ్ దేశమైన బెహరాన్ లో ఉంటున్న సాయికుమార్ గత రెండు రోజుల క్రితం ఉరివేసుకొని చనిపోగా, విషయం తెలిసిన మృతురాలు శృతి తనకు వివాహం నిశ్చయమై పెళ్లి చేసుకోబోయే ఇష్టమైన వ్యక్తి మరణించాడని వేదనతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లోనే వంట రూమ్ లో సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని మరణించినది తెలిపారు. మృతురాలి తల్లి ఓల్లెపు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరాలను వెల్లడించారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/జమ్మికుంట: హుజూరాబాద్ శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి తో కలిసి జమ్మికుంట పట్టణ పరిధిలో ఆదివారం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులు అందించి వివాహ శుభకార్యాలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్స్ పొనగంటి రాము, ఫిరోజ్ మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, పాలక్న గంటి సంపత్, పతకాల రమేష్, పూర్ణచందర్, దుర్గప్రసాద్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి డివిజన్ స్థాయి ప్రజావాణి

ప్రజాపక్షం/కరీంనగర్: ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4 నుండి ప్రతి సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో ప్రజావాణి కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇకనుండి జిల్లా స్థాయి ప్రజావాణితో పాటు రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగే జిల్లా స్థాయి ప్రజావాణికి, డివిజన్ స్థాయి అధికారులు రెవెన్యూ డివిజన్ స్థాయిలో జరిగే ప్రజావాణికి తప్పనిసరిగా హాజరై, ప్రజల వినతులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి తీసుకున్న చర్యల నివేదికలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలి: బాలకిషన్



ప్రజాపక్షం/బెజ్జంకి: పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారాన్ని అందజేసి ఆర్థిక పరంగా ఆదుకోవాలని మాజీ ఎంఎల్ఏ రసమయి బాలకిషన్ అన్నారు.అదివారం మండల పరిధిలోని కల్లెపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదావశాత్తు దగ్ధమైన మొక్కజొన్న పంటను బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి భాధిత రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి మంటల్లో కాలిపోవడం భాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షనమే నష్ట పోయిన పంటకు అంచన వేసి రైతులకు నష్ట పరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు.వీరి వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రశాంతంగా నీట్ పరీక్ష

### పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్



ప్రజాపక్షం/కరీంనగర్: వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ పరీక్ష (నీట్) ఆదివారం కరీంనగర్ లో ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ లోని మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ఆర్ కళాశాల, కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా కరీంనగర్లో నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్లతో వసతులు అభ్యర్థుల హాజరు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్లో ఏడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని, మొత్తం 2928 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారనీ. అందులో 2865 మంది హాజరు కాగా 63 మంది గైర్హాజరయ్యారనీ తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాలలో 725 మంది అభ్యర్థులు, ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కాలేజీలో 704 మంది కేంద్రీయ విద్యాలయంలో 376 మంది మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో 305 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలో 283 మంది టీజీఎస్ డబ్ల్యుఆర్ చింతకుంట బాలికల కళాశాలలో 239 మంది సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో 233 మంది అభ్యర్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. అభ్యర్థులను సునిశిత పరిశీలన తర్వాతనే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పోలీసులు పకడ్బందీగా తనిఖీలు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్ష జరిగినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న మొత్తం అభ్యర్థుల్లో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై పరీక్ష రాశారనీ, హాజరు శాతం సంతృప్తికరంగా నమోదయిందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నియమించిన నోడల్ తహసీల్దార్లు పరీక్ష నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారనీ తెలిపారు. అదేవిధంగా విద్యాశాఖ, ట్రాఫిక్, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్ష సజావుగా జరిగేలా సహకరించారనీ కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్ హాజరు నమోదు 100 శాతం పూర్తైందన్నారు. భౌతిక హాజరు బయోమెట్రిక్ హాజరు వివరాలు పూర్తిగా సరిపోలాయనీ, మొత్తం ప్రక్రియను ఎన్‌టీఏ (ఎన్‌టిఏ) బృందంతో సమన్వయం చేస్తూ జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో పరీక్ష విజయవంతంగా పూర్తయ్యిందనీ పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, పరిశుభ్రత వంటి అంశాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పరీక్ష ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## దగ్ధమైన మొక్కజొన్న పంట రైతులను పరామర్శించిన ఎఎంసి చైర్మన్



ప్రజాపక్షం/బెజ్జంకి: మండల పరిధిలోని కల్లెపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదావశాత్తు మొక్కజొన్న పంట దగ్దమైన సంధర్భంగా ఆదివారం ఏఎంసీ చైర్మెన్ పులి కృష్ణ భాధిత రైతులను పరామర్శించి సంఘటనకు గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి పంట నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. వీరి వెంట రవి, ఐలయ్య, ప్రభాకర్, సంతోష్ తదితరులున్నారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు




ప్రజాపక్షం/రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామంలో మంథని పెద్దపల్లి ప్రధాన రహదారి పై ఆదివారం ఎస్సై తాడవేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాల తనిఖీలో భాగంగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా, ఓవర్ లోడ్‌తో తరలి వెళ్తున్న వాహనాలు ఆపి తనిఖీలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, అట్లా వాహనాలు నడిపే వారి పట్ల కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. పలు వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడంతో జరిమానా విధించారు. చలానాలు పెండింగ్ ఉన్న వాహనదారులతో ఆన్‌లైన్ ద్వారా బకాయిలు చెల్లించేలా చూశారు.ఈ వాహనాల తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిద్దిపేటలో 'నీట్'కు 21 మంది గైర్హాజరు

### కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలో నీట్ 2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ హైమావతి వెల్లడించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మధ్యాహ్నం 2 గంట నుండి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లాలో రెండు కేంద్రాల్లో 937 పరీక్షలు రాయగా 916 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 21 మంది గైర్హాజరు అయ్యారు. జిల్లా కలెక్టర్ హైమావతి పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ పర్యావేక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళిక తో నీట్ పరీక్షకు జిల్లాలో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల్లో సిద్దిపేట ఆర్డీఓ నేతృత్వంలో ఆర్డీఓ నేతృత్వంలో పకడ్బందీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగుకుండ పరీక్ష విజయవంతంగా ముగిసిందన్నారు. పరీక్ష నిర్వహణలో పాలుపంచుకున్న అందరికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలం గుర్తింపునకు చర్యలు

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో ఆదివారం 20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామానికి చెందిన సఫాయి కార్మికుడు లక్ష్మ ణ్ కు మేడే వేడుకలలో ఉత్తమ కార్మికునిగా ప్రశంసాపత్రం రాగా జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ సత్కరించారు. ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ జీఎస్‌టి వసూళ్లలో రెండవ స్థానంలో తెలంగాణ ఉండగా రాష్టానికి నిధుల మంజూరులో కేంద్రం చిన్నచూపు చూపిస్తుందని కేంద్ర రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు. గ్రామ పంచాయతీల నిర్మాణంతో ప్రజలకు పరిపాలన సౌలభ్యం, గ్రామ పంచాయతీలు గ్రామాలకు సచివాలయాలు అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఎఫ్.సి.ఐ ధాన్యం తరలించడంలో జాప్యం కారణంగా నేడు రైతులకు కష్టాలని, రైస్ మిల్లుల గోదాంల నుండి వరి ధాన్యం తరలించే విధంగా కేంద్రం చర్యలు చేపట్టాలని అలాగే కన్నాపూర్ లో వడ్ల కొనుగోలు కేంద్రం కోసం స్థలం గుర్తింపునకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. అర్హులు అందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.డి.సి అధ్యక్షులు గాజంగి నందయ్య, డీఈ మిలింద్, ఎమ్మార్వో హకీమ్, రవిబాబు, ఎఈ రాజమల్లయ్య, ఆర్.ఐ భూమయ్య, ఎఎంసి చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ ఎఎంసి చైర్మెన్ కొలుగురి దామోదర్ రావు, నాయకులు మీస వేణు,శివ, నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

**సొంత ఇంటి కల నెరవేర్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత మరువలేనిది**

జగిత్యాల అర్బన్ మండలం ధరుర్ గ్రామానికి చెందిన షరీఫ్ హప్సా దంపతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకంలో భాగంగా మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తయి గృహ ప్రవేశ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి చీర కానుకగా అందజేసి జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, ఉప సర్పంచ్ బాలే శ్రీను, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో

### రైతులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట: ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ సిద్దిపేట రాజీవ్‌రహదారిపై రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. చిన్నకోడురు మండలం మల్లారం ధాన్యం కొనుగోలు చేయటం లేదని రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి రాజీవ్‌రహదారి స్టేజీపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ట్రాపిక్ పూర్తిగా స్థంబించిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అటుగా వెళ్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు అన్నదాతలకు ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. వారితో కలసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. రాజీవ్ రహదారిపై కరీంనగర్ సిద్దిపేట రూట్లో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పోలీసు అధికారులు వచ్చి వారిని సముదాయించి ఆందోళన విరమించాలని కోరారు. ఆనంతరం మాజీ మంత్రి హరీష్‌రావు రైతుల నుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వడ్ల కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మల్లారం స్టేజీ వద్ద రైతులు 28 రోజులు క్రితం వడ్లు పోశామని. ఇప్పటివరకు ఒక్క గింజ కొనలేదని కన్నీరు,మున్నీరుగా విలపిస్తున్నారన్నారు. ఎఫ్ ఎక్యూ, బి గ్రేడ్ వద్దని తాలు ఉందని కోతలు పేరిట బస్తాకు 2కిలోల ఎక్కువ తూకం వేయాలని అధికారులు కొర్రీలు పెట్టి రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో గత నాలుగు రోజులుగా గన్ని బ్యాగులు లేవన్నారు. రైతులు సొంతంగా సంచులు కొనుక్కోని రావాలని అధికారులు చెపుతున్నారన్నారు. ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాలో మొక్కజొన్న రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారన్నారు. ఈయాసంగిలో 90లక్షల టన్నుల వడ్లు కొంటామని చెప్పి, కనీసం 9లక్షల టన్నులకు 10శాతం వడ్లు కొనలేదన్నారు. మద్దతు ధర రాక రైతులు క్వింటాల్‌కు రూ.400 నుండి 500 రూపాయల తక్కువకు బయట అమ్ముకుంటున్నారున్నారు. బోనస్ మాట ఎత్తటంలేదని, పోయిన యాసంగి బోనస్ ఎగ్గోట్టారన్నారు. రైతుబంధు ఇవ్వటం లేదని, పండిన వడ్లయిన కొంటున్నారని అంటే అదిలేదన్నారు. మొక్కజొన్న రైతులను వెంటనే గన్నీ బ్యాగులు ఇవ్వాలని, నిలిపివేసిన సన్‌ప్లవర్ జోన్నలు, శనగల కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

### బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు




ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. ఆదివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట 12వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి సూర దేవరాజు నిర్మల ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇరు కుటుంబాల దంపతులకు నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా సూర దేవరాజు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రూ.500 లకే వంట గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టిసి బస్సులో ప్రయాణం, మహిళా సంఘాలకు పావలా వడ్డీకి రుణాలు, రైతుకలు రుణమాఫీ, పండించిన పంటలకు మద్దతు ధరతో పాటు 500 బోనస్ తదితర పథకాలతో దేశంలోనే అగ్రగామిగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు నూనె త్రివేణి, గుడిసెట్టి బాలరాజు, కత్తెరపాక ఎల్లయ్య, వార్డు అధ్యక్షులు నూనె శ్రీనివాస్, సద్దుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## సీడ్ పొలంలో తప్పిన అగ్నిప్రమాదం




ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బీర్కా సారయ్యకు చెందిన సీడ్ పొలంలో అకస్మాత్తుగా నిప్పు అంటుకోవడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. పొలం నుండి మంటలు, పొగలు రావడాన్ని గమనించిన గ్రామస్తులు సమయస్ఫూర్తితో వ్యవహరించారు. వెంటనే అక్కడికి చేరుకుని శ్రమించి మంటలను ఆర్పివేయడంతో భారీ నష్టం తప్పింది. గ్రామస్తుల అప్రమత్తత వల్ల మంటలు పక్కనే ఉన్న ఇతర పొలాలకు వ్యాపించకుండా ఆగిపోవడంతో అటు రైతు సారయ్యతో పాటు చుట్టు పక్కల రైతులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ సర్క్యూట్ షాక్ తో జరిగిందా.. లేక ఎవరైనా నిప్పుపెట్టారా విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం



ప్రజాపక్షం/ మల్లాపూర్ : మండలంలో సొంత ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈమేరకు చిట్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి గృహప్రవేశం కుటుంబాలను కృష్ణారావు అభినందించి నూతన వస్త్రాలను అందజేశారు.ఏ ఒక్క కుటుంబం ఇల్లు లేకుండా ఉండాకూడదనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు.ఈయన వెంట ఉమ్మడి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి రాజుజి సదానంద చారి, నాయకులు కొత్తపల్లి రాజారెడ్డి, గడ్డం లింగారెడ్డి,చింతామణి రాజేందర్,తదితరులు ఉన్నారు.

## మెట్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి పూర్తి సహకారం: జువ్వాడి



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి నూతన మున్సిపల్ కమిషనర్‌గా శనివారం రోజున బాధ్యతలు స్వీకరించిన డి. శ్రీనివాస్ గౌడ్ ఆదివారం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రిని కలిసి అభినందనలు తెలిపారు.అనంతరం మెట్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరపున సహకారం అందించాలని కమిషనర్ కోరగా,జువ్వాడి నర్సింగరావు స్పందిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందించడంతో పాటు అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి మెట్‌పల్లి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అజీమ్,నరేష్,శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్,టీఎంసీ సోమిడి శివకుమార్,తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ స్టార్టప్ మిషన్ 'దృష్టి'

- కాలిఫోర్నియా నుండి స్పేస్ ఎక్స్ ఫాల్కన్ – 9 రాకెట్ ద్వారా ప్రయోగం
- మిషన్ దృష్టి ప్రపంచంలోనే మొట్టమొదటి ఆప్టోసార్ ఉపగ్రహమని కంపెనీ వెల్లడి



**న్యూఢిల్లీ:** బెంగళూరుకు చెందిన అంతరిక్ష స్టార్టప్ గెలాక్స్ఐ సంబంధించిన 'మిషన్ దృష్టి' ఉపగ్రహాన్ని ఆదివారం కాలిఫోర్నియా నుంచి స్పేస్ ఎక్స్ ఫాల్కన్–9 రాకెట్ ద్వారా ప్రయోగించారు. కంపెనీ ప్రకారం...మిషన్ దృష్టి ప్రపంచంలోనే మొట్టమొదటి ఆప్టోసార్ ఉపగ్రహం. ఇది ఎలక్ట్రో ఆప్టికల్ (ఈఓ), సింథటిక్ అపెర్చర్ రాడార్ (ఎస్ఏఆర్) సెన్సార్లను ఒకే ఆపరేషనల్ ప్లాట్‌ఫామ్‌లో ఏకీకృతం చేస్తుంది. ఈఓ సెన్సార్లు సూర్యకాంతి, నిర్మలమైన ఆకాశం ఉన్నప్పుడు అధిక రిజల్యూషన్ చిత్రాలను తీయగా, ఎస్ఏఆర్ సెన్సార్లు రాడార్ వల్నలను ఉపయోగించి అన్ని వాతావరణ పరిస్థితులలో, అన్ని సమయాలలో చిత్రాలను అందిస్తాయి. గెలాక్స్ఐ వ్యవస్థాపకుడు, సీఈఓ సుయష్ సింగ్ ఒక ప్రకటనలో ఇలా తెలిపారు. ఉపగ్రహం (మిషన్ దృష్టి) ఇప్పుడు విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించడంతో మా తక్షణ దృష్టి దాని కమిషనింగ్‌ను పూర్తిచేయడంపై ఉంది. మేము ఈ దశలో ముందుకు ప్రపంచవ్యాప్తంగా బలమైన ఆసక్తిని మేము ఇప్పటికే చూస్తున్నాం. సాంప్రదాయ వ్యవస్థలలోని దీర్ఘకాలిక పరిమితులను అధిగమించడంతోపాటు, విభిన్న పర్యావరణ పరిస్థితులలో మరింత విశ్వసనీయమైన స్థిరమైన డేటా సేకరణను ఈ ఉపగ్రహం సాధ్యం చేస్తుందని కంపెనీ తెలిపింది. ద్వంద్వ ప్రయోజన భూపరిశీలన ఉపగ్రహంగా ఈ మిషన్ రక్షణ, వ్యవసాయం, విపత్తు నిర్వహణ, సముద్ర పర్యవేక్షణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక వంటి వివిధ రంగాలలో ఉపయోగపడుతుంది. ఇస్రో తన ఇటీవలి వార్షిక నివేదికలో పేర్కొన్న 29 ప్రైవేట్ భూ పరిశీలన ఉపగ్రహాలతో పాటు భారతదేశం చేపట్టిన విస్తృత కార్యక్రమాలకు ఈ ఉపగ్రహం తోడ్పాటును అందిస్తుందని కూడా భావిస్తున్నారు. గెలాక్స్ఐ '2030నాటికి మిషన్ దృష్టిని 10 ఉపగ్రహాల సమూహంగా విస్తరించి భారతదేశం కోసం ఒక పటిష్టమైన, సార్వభౌమ భూ పరిశీలన మౌలిక సదుపాయాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

### వాణిజ్య గ్యాస్ ధర పెంపుపై

# తమిళనాడులో సిపిఐ నిరసన

ఈ చర్య చిన్న వ్యాపారాలను, రోడ్డు పక్కన ఉండే తినుబండారాల దుకాణాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఆగ్రహం



**చెన్నై :** ఇటీవల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరల పెంపును నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పెంచిన ధరలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేస్తూ తమిళనాడులో సిపిఐ ఆదివారం నిరసన చేపట్టింది. ఈ చర్య చిన్న వ్యాపారాలను, రోడ్డు పక్కన ఉండే తినుబండారాల దుకాణాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఆరోపించింది. సిపిఐ దక్షిణ చెన్నై జిల్లా కార్యదర్శి ఎస్.కె. శివ నేతృత్వంలో, పార్టీ కార్యకర్తలు సైదాపేటలోని పనగల్ భవనం సమీపంలో గుమిగూడి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనకారులను ఉద్దేశించి శివ మాట్లాడుతూ వాణిజ్య గ్యాస్ ధరల పెంపు కారణంగా అనేక చిన్న తరహా రెస్టారెంట్లు, వీధి పక్కన ఉండే తినుబండారాల దుకాణాలు మూతపడవలసి వచ్చిందని, ఇది వేలాది మంది కార్మికుల జీవనోపాధిని నేరుగా ప్రభావితం చేస్తోందని పేర్కొన్నారు. ఈ ధరల పెరుగుదల వల్ల హాస్టళ్లలో ఉంటూ, తమ రోజువారీ భోజనం కోసం ఈ చవకైన తినుబండారాల దుకాణాలపై ఆధారపడే విద్యార్థులు, ఐటి ఉద్యోగులు, రోజువారీ కూలీలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన తెలిపారు. ధరల పెంపునకు కారణంగా ఇజ్రాయెల్, ఇరాన్‌లతో సహా పలు అంతర్జాతీయ సంఘర్షణలను కేంద్ర ప్రభుత్వం ఉదహరిస్తోందని సిపిఐ నాయకుడు విమర్శించారు. దేశీయ ఆర్థిక వ్యవస్థను పరిరక్షించడం కంటే ప్రభుత్వం అమెరికా ప్రయోజనాలకే వత్తాసు పలుకుతోందని ఆయన ఆరోపించారు. సామాన్యుడిపై భారాన్ని తగ్గించడానికి కేంద్రం పన్నులు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన తర్వాతే వ్యూహాత్మకంగా ధరల పెంపును అమలు చేశారని, తమ ప్రచార సమయంలోనే పార్టీ ఈ విషయాన్ని ముందే ఊహించిందని శివ ఆరోపించారు. పెరుగుతున్న జీవన వ్యయంపై చర్చించేందుకు సంయుక్త పార్లమెంటరీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోకపోతే మరిన్ని నిరసనలు చేపడతామని హెచ్చరించింది. పశ్చిమ ఆసియా సంఘర్షణతో ముడిపడి ఉన్న ప్రపంచ ఇంధన ధరల పెరుగుదల కారణంగా, వాణిజ్య ఎల్‌పిజి ధరను శుక్రవారం 19 కిలోల సిలిండర్‌కు రూ.993 మేర పెంచారు. ఇది వరుసగా మూడో నెల పెంపు.

### గ్రేట్ నికోబార్ ప్రాజెక్టు ఆందోళనలపై

# పార్లమెంట్‌లో చర్చ జరగాలి

రాహుల్ పర్యటనతో ప్రభుత్వం కలవరపడింది: కాంగ్రెస్




**న్యూఢిల్లీ :** అండమాన్ నికోబార్ దీవుల్లో గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణం, గిరిజన హక్కులు, పారదర్శకత, భద్రతకు సంబంధించిన ఆందోళనలను కాంగ్రెస్ ఆదివారం వివరంగా ప్రస్తావించింది. ఈ అంశాలపై పార్లమెంటరీ వేదికపై చర్చ జరగాలని ఉద్ఘాటించింది. గత వారం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గ్రేట్ నికోబార్‌లో పర్యటించిన తర్వాత మోదీ ప్రభుత్వం కలవరపడిందని, నష్ట నివారణ చర్యలు చేపడుతోందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. 'గత నెల 28న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గ్రేట్ నికోబార్‌లో జరిపిన అత్యంత ప్రభావవంతమైన పర్యటన తర్వాత, మోదీ ప్రభుత్వం స్పష్టంగా నష్ట నివారణ చర్యలు చేపట్టి, మూడు రోజుల తర్వాత గ్రేట్ నికోబార్ ద్వీప అభివృద్ధి ప్రాజెక్టుపై ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రభావిత వర్గాలు, పర్యావరణవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పౌర సమాజ నిపుణులు, ఇతర వృత్తి నిపుణులు లేవనెత్తిన తీవ్రమైన ఆందోళనలలో దేనినీ ఈ పత్రికా ప్రకటన పరిష్కరించలేదని రమేష్ అన్నారు. ఈ ఆందోళనలను తాను సెప్టెంబర్ 10, 2024న, ఆ తర్వాత అదే నెల 27న కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రికి వివరంగా తెలియజేశానన్నారు. గత వారం గ్రేట్ నికోబార్ పర్యటన సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ అండమాన్ నికోబార్ దీవులలోని క్యాంప్‌బెల్ బే వద్ద ఉన్న గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్ 'దేశ సహజ, గిరిజన వారసత్వానికి వ్యతిరేకంగా జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటి, అత్యంత ఘోరమైన నేరం' అని ఆరోపించారు. ప్రభుత్వం మే 1న తరచుగా అడిగే ప్రశ్నలకు సమాధానాలతో కూడిన వివరణాత్మక ప్రకటనను విడుదల చేసింది. కాగా, నాలుగు పేజీల వివరణాత్మక ప్రకటనలో జైరామ్ రమేష్ గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు సంబంధించిన కీలక ఆందోళనలను స్పష్టంగా తెలియజేశారు. పర్యావరణపరమైన ఆందోళనలను ప్రస్తావిస్తూ, గ్రేట్ నికోబార్ ప్రత్యేకమైనదని, అండమాన్, నికోబార్ దీవుల సమూహంలోని మిగతా అన్ని దీవుల కంటే ఇది స్పష్టంగా భిన్నమైనదని రమేష్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం ద్వీప సమూహంలోని మొత్తం భూభాగంలో కేవలం 1.82% మాత్రమే వినియోగిస్తున్నామన్న ప్రభుత్వ వాదన అసంబద్ధమైనది, తప్పుదోవ పట్టించేదని మండిపడ్డారు. ఇది గ్రేట్ నికోబార్ పర్యావరణ వ్యవస్థ జీవ, జీవ వైభవాన్ని విస్మరిస్తుంది, ఇది ఈ ద్వీప సమూహంలోనే కాకుండా ప్రపంచంలోనే ప్రత్యేకమైనది అని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతి, సంబంధిత ప్రక్రియలో కీలక పాత్ర పోషించేలా వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఐఐ), జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ) వంటి సంస్థలపై అక్షరాలా ఒత్తిడి తెచ్చారని రమేష్ ఆరోపించారు. ఇవే సంస్థలకు ఇప్పుడు గ్రేట్ నికోబార్‌లో జీవవైవిధ్య పరిశోధన, పర్యవేక్షణ ప్రాజెక్టులను అప్పగించారు. ఇక్కడ స్పష్టమైన ప్రయోజన వైరుధ్యం ఉంది అని రమేష్ పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టును తీవ్రంగా విమర్శించిన కొన్ని ప్రతిష్టాత్మక, స్వతంత్ర భావాలు గల సంస్థలను మోదీ ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్ చేసిందని ఆయన అన్నారు. ప్రాజెక్టుకు మంజూరు చేసిన పర్యావరణ అనుమతిని సవాలు చేసే విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌పిసి) విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉందని ఆయన చెప్పారు.

# స్వతంత్ర జర్నలిజానికి శిక్ష

- విధేయతకు పట్టం • పత్రికా స్వేచ్ఛ విషయంలో బిజెపి-ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపాటు



**న్యూఢిల్లీ :** పత్రికా స్వేచ్ఛ విషయంలో బిజెపి–ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. స్వతంత్ర జర్నలిజాన్ని శిక్షించడం, లొంగిన వారికి కానుకలు వంటి వారి సందేశం స్పష్టంగా ఉందని మండిపడ్డారు. మీడియాలోని కొన్ని వర్గాలు అధికార వర్గానికి వంత పాడే స్థాయికి దిగజారాయని, అదే సమయంలో ప్రశ్నలు అడగడానికి పట్టుబట్టిన వారిని నిరంతరం లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా ఎక్స్‌లో పెట్టిన ఒక పోస్టులో 2014 నుంచి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారతదేశ స్థానం క్రమంగా క్షీణించిందని ఖర్గే పేర్కొన్నారు. న్యూస్‌రూమ్‌ల గొంతు నొక్కడానికి సంఘ్ పరివార్ చట్టపరమైన వ్యవస్థలను ఆయుధాలుగా వాడుకుంటోందని ఆయన ఆరోపించారు. 2014 నుంచి బిజెపి పాలనలో ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారతదేశ స్థానం క్రమంగా క్షీణించి 157వ స్థానానికి పడిపోయిందనే కఠోర, కాదనలేని వాస్తవాన్ని దేశం ఎదుర్కోవాలని ఖర్గే అన్నారు. 'నిజమైన అర్థంలో స్వేచ్ఛా పత్రికారంగం అనేది ప్రభుత్వ కథనాన్ని విస్తృతం చేయడానికి లేదా దాని వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఉనికిలో ఉండదు. అది అధికారాన్ని ప్రశ్నించడానికి, శక్తిని నిశితంగా పరిశీలించడానికి, పదవిలో ఉన్నవారిని జవాబుదారీగా ఉంచడానికి ఉనికిలో ఉంటుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్స్‌లో పేర్కొన్నారు. అధికారానికి, ప్రజలకు మధ్య ప్రజాస్వామ్య సమతుల్యతను మీడియా కాపాడుతుందని ఖర్గే అన్నారు. పాత్రికేయులు ప్రజా సత్యానికి సంరక్షకులని పండిట్ నెహ్రూ చెప్పినట్లుగా 'పత్రికా స్వేచ్ఛ కేవలం ఒక నినాదం కాదు, అది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక ముఖ్యమైన లక్షణం', ప్రస్తుత పాలనలో ఆ ముఖ్యమైన లక్షణం తీవ్రంగా దెబ్బతిన్నదని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. వార్తా సంస్థలను అణచివేయడానికి సంఘ్ పరివార్ చట్టపరమైన వ్యవస్థలను ఆయుధాలుగా వాడుకుంటోందని, పరువు నష్టం చట్టాలు, జాతీయ భద్రతా నిబంధనలు, విస్తృతమైన క్రిమినల్ చట్టాలను న్యాయ సాధనాలుగా కాకుండా, బెదిరింపు సాధనాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. 2014 నుండి 2020 మధ్యకాలంలో 135 మందికి పైగా జర్నలిస్టులను అరెస్టు చేయడం, నిర్బంధించడం లేదా విచారించడం జరిగిందని, అలాగే 2014 నుండి 2023 మధ్య 36 మంది జర్నలిస్టులు జైలు పాలయ్యారని ఆయన ఆరోపించారు. యుఎపిఎ వంటి కఠిన చట్టాల కింద పలువురు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడంతో వేధింపుల స్థాయి తీవ్రంగా పెరిగిందని ఆయన అన్నారు. అదే సమయంలో, హింస, శిక్ష నుండి తప్పించుకునే ధోరణి వంటి మరింత ఆందోళనకరమైన విషయం వెలుగులోకి వచ్చిందని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో తమ పని చేస్తున్నందుకు జర్నలిస్టులు హత్యకు గురవుతున్నారన్నారు. 'ఉత్తరప్రదేశ్‌లో రాఘవేంద్ర బాజ్‌పాయ్, ఛత్తీస్‌గఢ్‌లో ముఖేష్ చంద్రకర్, ఉత్తరాఖండ్‌లో రాజీవ్ ప్రతాప్ సింగ్, హర్యానాలో ధర్మేంద్ర సింగ్ చౌహాన్ వీరంతా అవినీతి, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై వార్తలు రాసేవారు. అధికారానికి నిజం చెప్పి న్యాయం చేస్తే చెల్లించాల్సిన మూల్యానికి ఈనాడు వారు భయంకరమైన నిదర్శనాలుగా నిలుస్తున్నారు' అని ఆయన అన్నారు. ఇప్పటికే ఉన్న తన నియంత్రణతో సంతృప్తి చెందని బిజెపి–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం, సంపూర్ణ ఆధిపత్యం కోసం ఇప్పుడు సోషల్ మీడియాను అణచివేసే ప్రయత్నంలో దానిపై తన పట్టును మరింత బిగించాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. మనం ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ తరుణంలో, సంబంధిత వర్గాలన్నీ లోతైన ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఖర్గే అన్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా, అధికారంలో ఉన్నవారు ఎల్లప్పుడూ ప్రజాస్వామ్యం సుదీర్ఘకాలంగా స్థిరపడిన నియమాలను నిలబెట్టాలని ఆయన అన్నారు.

# మేమే గెలుస్తాం

ఫలితాల తరువాత యుడిఎఫ్ తప్పుడు కథనం కుప్పకూలుతోంది ఎల్‌డిఎఫ్ కన్వీనర్ రామకృష్ణన్



**కోజికోడ్ :** అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష కూటమి (ఎల్‌డిఎఫ్) ఓటమి దిశగా పయనిస్తోందంటూ యుడిఎఫ్ ప్రచారం చేస్తున్న 'తప్పుడు కథనం'... ఫలితాలు వెలువడిన వెంటనే కుప్పకూలుతుందని ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టి.పి. రామకృష్ణన్ పేర్కొన్నారు. కేరళలో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 9న జరిగాయి. ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఆదివారం రామకృష్ణన్ కోజికోడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 2021 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా ప్రతిపక్షాలు ఇదే తరహా ప్రచారాన్ని చేశాయని గుర్తుచేశారు. అప్పట్లో పలువురు ఎల్‌డిఎఫ్ నాయకులు ఓడిపోతారని యుడిఎఫ్ గట్టిగా చెప్పినప్పటికీ, ఫలితాలు మాత్రం దానికి భిన్నంగా వచ్చాయని ఆయన పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో అనేక సందర్భాల్లో ఎగ్జిట్ పోల్ అంచనాలు తప్పాయని ఆయన తెలిపారు. 'ఎల్‌డిఎఫ్ నిర్ణయాత్మక విజయాన్ని సాధిస్తుంది. కాంగ్రెస్, యుడిఎఫ్ చేస్తున్న వాదనలన్నీ సోమవారం ఫలితాలు వెలువడగానే ముగిసిపోతాయి. సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంటుందనే పూర్తి నమ్మకం మాకు ఉంది' అని ఆయన అన్నారు. ఎన్నికల తర్వాత పార్టీల అంతర్గతంగా గెలుపు ఓటములపై చర్చించుకోవడం సహజమే అయినప్పటికీ, యుడిఎఫ్ మాత్రం ఆ పరిధిని దాటి, ఫలితాలు రాకముందే తమ ముఖ్యమంత్రి అభ్యర్థిపై బహిరంగంగా చర్చలు జరుపుతోందని రామకృష్ణన్ ఆరోపించారు. సాధారణ చర్చలకు మించి యుడిఎఫ్ నాయకులు ఇప్పుడు ముఖ్యమంత్రి పదవిపై బహిరంగంగా చర్చించుకుంటున్నారన్నారు. అదే సమయంలో, కాంగ్రెస్ ఏ నిర్ణయం తీసుకున్నా తాము దానికి కట్టుబడి ఉంటామని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) ప్రకటించింది. కేరళ రాజకీయాల్లో ఇంతకుముందెన్నడూ ఇటువంటి పరిస్థితి తలెత్తలేదని ఆయన వ్యాఖ్యానించారు. తమకు తప్పక ఎదురుకాబోయే ఓటమిని తలచుకుని కలిగిన ఆందోళనతోనే యుడిఎఫ్ తాము గెలుస్తున్నామనే ఒక కృత్రిమ కథనాన్ని ప్రచారంలోకి తెచ్చిందని ఆయన ఆరోపించారు. ఫలితాలు వెలువడినప్పుడు అసలు వాస్తవం ఏమిటనేది స్పష్టమవుతుందని అన్నారు.

## పడవ ప్రమాదంలో 13కు చేరిన మృతులు

**జబల్పూర్:** మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్ జిల్లా బార్గి డ్యామ్‌లో చోటుచేసుకున్న పడవ ప్రమాదం చివరకు విషాదాంతమైంది. ఆదివారం ఉదయం గాలింపు చర్యల సందర్భంగా ఐదేళ్ల బాలుడు మయూరామ్, అతని మామ కామరాజ్ (50) మృతదేహాలు లభ్యం కావడంతో ఈ ప్రమాదంలో మొత్తం మరణించిన వారి సంఖ్య 13కు చేరుకుంది. గురువారం సాయంత్రం భారీ గాలివాన సంభవించిన సమయంలో రాష్ట్ర పర్యాటక శాఖకు చెందిన దాదాపు 20 ఏళ్ల పాత క్రూయిజ్ పడవ బోల్తా పడిన సంగతి తెలిసిందే. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించగా, అందులో 28 మందిని రెస్క్యూ టీమ్స్ సురక్షితంగా రక్షించాయి.

### యువత, వయోజనుల ఆధార్ జారీకి కఠిన మార్గదర్శకాలు

# 'పిల్'పై నేడు 'సుప్రీం' విచారణ




**న్యూఢిల్లీ :** భారత పౌరులుగా నటిస్తున్న చొరబాటుదారులను అరికట్టడానికి ఆరేళ్ల లోపు పౌరులకు మాత్రమే ఆధార్ కార్డులు జారీచేయాలని, అలాగే కౌమార, వయోజనులకు కార్డుల జారీపై కఠినమైన మార్గదర్శకాలను రూపొందించాలని, భారత ప్రత్యేక గుర్తింపు అథారిటీ (యుఐడిఏఐ)ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. మే 4వ తేదీనాటి సుప్రీంకోర్టు కాజ్‌లిస్ట్ ప్రకారం ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి ధర్మాసనం ముందు ఈ పిటిషన్ విచారణకు రానుంది.న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిఐఎల్)లో 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేవలం గుర్తింపు రుజువు మాత్రమేనని, పౌరసత్వం , చిరునామా లేదా పుట్టిన తేదీకి రుజువు కాదని పేర్కొంటూ కామన్ సర్వీస్ సెంటర్లలో డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు ఆధార్ జారీ చేసే అధికార సంస్థ అయిన యుఐడిఏఐ, కేంద్ర హోం, న్యాయ, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలను కూడా ఈ పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. న్యాయవాది అశ్విని దూబే ద్వారా దాఖలు చేసిన పిటిషన్‌లో వాస్తవానికి గుర్తింపు పత్రంగా ఉద్దేశించిన ఆధార్ కార్డులు, నివాస ధృవీకరణ పత్రాలు, ఓటరు గుర్తింపు కార్డుల వంటి ఇతర గుర్తింపు పత్రాలను పొందడానికి వ్యక్తులకు వీలు కల్పించే ఒక 'ప్రాథమిక పత్రం'గా మారిందని పేర్కొన్నారు.'యుఐడిఏఐ 144కోట్ల ఆధార్‌లను జారీచేసింది. 99శాతం మంది భారతీయులు నమోదు చేసుకున్నారు. అందువల్ల చొరబాటుదారులు ఆధార్‌లను పొంది భారత పౌరులుగా నటిస్తూ మోసాలకు పాల్పడకుండా నిరోధించేందుకు, కేవలం పిల్లలకు మాత్రమే కొత్త ఆధార్ జారీచేయాలని, అలాగే కౌమారదశలో ఉన్నవారు, పెద్దల కోసం కొత్త కఠినమైన మార్గదర్శకాలను రూపొందించాలని యుఐడిఏఐని ఆదేశించాలని కోరుతూ పిటిషనర్ ఆర్టికల్ 32 కింద ఈ రిట్ పిటిషన్‌ను ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంగా దాఖలు చేస్తున్నారు' అని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. చొరబాటుదారులు ఆధార్‌ను ఏవిధంగా పొందగలుగుతున్నారో పిటిషనర్ తెలుసుకోగలిగినప్పుడు ఈ పిటిషన్‌ను దాఖలు చేయాల్సిన అవసరం ఏర్పడిందని పిటిషన్ పేర్కొంది. 'విదేశీయులు 'విదేశీ' కేటగిరీ కింద ఆధార్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఈ చొరబాటు దారులు భారత పౌరుడు కేటగిరీ కింద ఆధార్ కోసం దరఖాస్తు చేసుకుని సులభంగాగుర్తింపు పొందుతారు. ఆ తర్వాత, వారు రేషన్ కార్డు, జనన, నివాస ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ మొదలైనవి పొంది, ప్రాథమికంగా భారత పౌరుల నుండి వేరుగా గుర్తించలేని విధంగా కలిసిపోతారు' అని పిటిషన్ పేర్కొంది. ఆధార్ వినియోగం లక్షిత సంక్షేమ పంపిణీని దెబ్బతీస్తుందని, ప్రజా వనరుల మళ్లింపునకు దారితీస్తుందని కూడా పిటిషన్ పేర్కొంది.

# నేడు బుల్ఢానాలో కాంగ్రెస్ పాదయాత్ర

12 ఏళ్ల బిజెపి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని విమర్శ



**ముంబయి :** బిజెపి ప్రభుత్వ 'రైతు వ్యతిరేక' విధానాలకు వ్యతిరేకంగా మహారాష్ట్రలోని బుల్ఢానా జిల్లాలో నేడు కాంగ్రెస్ పాదయాత్రను ప్రారంభించనుంది. ఈ పాదయాత్రకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ నాయకత్వం వహించనున్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొంటారని పార్టీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్రంలో, మహారాష్ట్రలో గత 12 ఏళ్ల బిజెపి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని కాంగ్రెస్ ఆరోపించింది.'రైతులకు వారి పంటలకు సరైన ధరలు లభించడం లేదు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం వ్యవసాయాన్ని చాలా కష్టతరం చేసింది' అని పార్టీ పేర్కొంది. భారతదేశంలోనే అత్యధిక రైతు ఆత్మహత్యలు మహారాష్ట్రలోనే నమోదయ్యాయని కూడా తెలిపింది. రైతులకు పూర్తి రుణ మాఫీ, భూ రికార్డుల (7/12 సారాంశాలు) పునరుద్ధరణ, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) హామీ ఇచ్చే చట్టం, సోయాబీన్, శనగలకు రూ.8,000, పత్తికి రూ.12,000, కందికి రూ.10,000 స్థిర ధరలు నిర్ణయించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. షరతులు లేకుండా పంట రుణాలు అందించడం, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.40,000 పంట రుణాలు ఇవ్వడం, వ్యవసాయ ఉత్పాదకాలపై జిఎస్‌టిని తొలగించడం, వ్యవసాయ ఉత్పత్తుల కోసం ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయడం, గిరిజన వర్గాలకు కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడం, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడం వంటివి ఇతర డిమాండ్లలో ఉన్నాయని ఆ ప్రకటన తెలిపింది.

# సామాన్యుడికి అందని హజ్‌యాత్ర

రూ. 10 వేల పెంపు సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** ఒక్కో యాత్రికుడికి హజ్ విమాన ఛార్జీని రూ.10,000 పెంచుతూ హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఆదివారం డిమాండ్ చేసింది. మోదీ ప్రభుత్వ హయాంలో హజ్ యాత్ర ఖర్చులు పెరిగిపోవడంతో, ఈ యాత్ర సామాన్య భారతీయ కుటుంబాలకు అందుబాటులో లేకుండా పోయిందని ఆరోపించింది. ప్రపంచవ్యాప్తంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) ధరలు విపరీతంగా పెరగడంతో, ఈ ఏడాది హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఒక్కో యాత్రికుడికి హజ్ విమాన ఛార్జీని రూ.10,000 పెంచిన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ ఈ డిమాండ్ చేసింది. అయితే, కఠినమైన చర్చల ద్వారా ఈ పెంపును నియంత్రించగలిగామని కేంద్రం స్పష్టం చేసింది. హజ్ విమాన ఛార్జీల పెంపు అన్యాయం అని ప్రతిపక్ష నాయకులు విమర్శించారు. భారత హజ్ కమిటీ జారీ చేసిన ఒక సర్క్యులర్‌లో, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా తలెత్తిన అసాధారణ పరిస్థితుల దృష్ట్యా, 2026 హజ్ యాత్రకు సంబంధించిన విమాన ఛార్జీలలో ఒకేసారి సవరణకు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని పేర్కొంది. 'సవరించిన ఈ విమాన ఛార్జీల ప్రకారం, యాత్ర ప్రారంభించే ప్రదేశంతో సంబంధం లేకుండా, ప్రతి యాత్రికుడికి అదనంగా 100 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని యాత్రికులే భరించాలి. మధ్యప్రాచ్యంలో నెల కొన్న పరిస్థితుల కారణంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు విపరీతంగా పెరగడంతో, బేస్ ఫేర్‌ను 400 డాలర్లకు పైగా సవరించాలని విమానయాన సంస్థల నుండి వచ్చిన తీవ్రమైన అభ్యర్థనలను దృష్టిలో ఉంచుకుని, వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత వర్గాలతో సంప్రదించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు' ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీని ప్రకారం, ఈ సంవత్సరం హజ్ యాత్రికులందరూ అదనంగా చెల్లించిన విమాన ఛార్జీల కింద రూ. 10,000ను మే 15వ తేదీలోగా జమ చేయాల్సి ఉంటుందని కూడా అందులో తెలిపారు. అయితే కాంగ్రెస్ ఎంపి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ నసీర్ హుస్సేన్ మాట్లాడుతూ, ఏప్రిల్ 28న, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతి హజ్ యాత్రికుడి నుండి మే 15లోగా చెల్లించవలసిన అదనపు మొత్తాన్ని డిమాండ్ చేస్తూ ఒక సర్క్యులర్ జారీ చేసిందన్నారు. ఈ డిమాండ్‌ను ముందస్తు నోటీసు లేకుండా, సంప్రదింపులు జరపకుండా, దాని సమయానికి తగిన సమర్థన లేకుండా చేశారని ఆయన ఆరోపించారు. చాలా మంది హజ్ చేయడానికి ఇప్పటికే సౌదీ అరేబియాలో ఉన్నారు. వారు ఎదుర్కొంటున్న కష్టాలు కేవలం ఆర్థికపరమైనవి మాత్రమే కాదు. ఇది దుర్వినియోగానికి ప్రత్యక్ష పర్యవసానం. ప్రాథమిక రక్షణ, గౌరవానికి అర్హులైన పౌరులుగా కాకుండా, కేవలం ఆదాయ వనరుగా పరిగణించబడటమే వారు ఎదుర్కొంటున్న అనుభవం' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఏప్రిల్ 28 నాటి సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, దాని కింద వసూలు చేసిన మొత్తాన్ని పూర్తిగా వాపసు ఇవ్వాలని, 2027 సీజన్ ప్రారంభానికి ముందే తప్పనిసరి పోటీ టెండరింగ్, హజ్ ధరల స్థిరత్వ ఫ్రేమ్‌వర్క్‌తో సహా నిర్మాణాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇదిలా ఉండగా, హజ్ యాత్రలో ఉన్న సౌదీ అరేబియా ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను యాత్రికులు ప్రశంసిస్తున్న వీడియోలను ట్యాగ్ చేస్తూ, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. యాత్ర పొడవునా ప్రతి యాత్రికుడికి సకాలంలో సంరక్షణ, మద్దతు, గౌరవం అందేలా చూస్తున్నాయని ఆ ప్రకటనలో పేర్కొంది.

## పుణే ఘటనపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం

**న్యూఢిల్లీ:**మహారాష్ట్ర పుణేలో నాలుగేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం, హత్యను జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ రహత్కర్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమైనదని, మానవత్వానికే మాయని మచ్చ అని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం పుణేలోని భోర్ తహసీల్ పరిధిలో 65 ఏళ్ల వ్యక్తి బాలికపై లైంగికదాడి చేసి హత్య చేశాడు. నిందితుడు చాక్లెట్ల ఆశ చూపి, పశువుల కొట్టంలోకి తీసుకెళ్లి లైంగికదాడి చేసి అనంతరం రాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పోలీసులు అరెస్టుచేశారు. పుణేలో జరిగిన ఘటన అత్యంత హృదయ విదారకమని, తీవ్రంగా కలిచివేసిందని శనివారం రహత్కర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ద్రపవార్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

# వాళ్ళు..'సముద్ర దొంగలే'

ట్రంప్ ఒప్పుకున్నాడు
పొరపాటున అనలేదు,
నిజమే చెప్పాడు
అంతర్జాతీయ సమాజం నిలదీయాలి
ప్రపంచ దేశాలకు ఇరాన్ ప్రతినిధి
ఇస్మాయిల్ బఖాయీ విజ్ఞప్తి

**టెహ్రాన్:** అమెరికా ఒక సముద్ర దొంగేనని ఈ విషయాన్ని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బాహాటంగా అంగీకరించాడని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ అన్నారు. ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ రాస్తూ, తాము సముద్ర దొంగల్లా ప్రవర్తించామని బాహాటంగా ఒప్పుకున్నాడని, ఇరాన్ నౌకలను సముద్ర దొంగలా అడ్డగించినట్లు అంగీకరించాడన్నారు. ట్రంప్ పొరపాటుగా నోరు జారలేదని, ఆయన నిజమే చెప్పాడని పేర్కొన్నారు. "అంతర్జాతీయంగా వారు చేస్తున్న నేరపూరిత చర్యల్లో ఇది వారి స్వభావాన్ని చాటి చెప్పింది,ఇది ప్రత్యక్షంగా, బాహాటంగా ఆయన ప్రకటించిన విషయమే, ఇది తీవ్ర అంగీకారమే, ఈ చర్యలను అంతర్జాతీయ సమాజం, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి సహా సభ్యదేశాలూ, అన్ని అంతర్జాతీయ వ్యవస్థలూ తీవ్రంగా ఖండించాలి, నిలదీయాలి, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడాన్ని ట్రంప్ ఒక సాధారణ విషయంగా మార్చేస్తున్నాడు, చట్టాల ఉల్లంఘనకు అర్థం మార్చేసి దానిని ఒప్పుగా చిత్రీకరించడాన్ని అంతర్జాతీయ సమాజం ఖండించాలి" అని బఖాయీ విజ్ఞప్తి చేశారు. ప్రపంచవాణిజ్యానికి, ప్రపంచ అవసరాలకు కీలకమైన వాణిజ్యమార్గంగా ఉన్న హోర్ముజ్ జలసంధిలో దిగ్బంధనం, నౌకాయాన స్తంభన, ఉద్రిక్తత నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారాన్ని కోరుతూ ఇరాన్ చేపట్టిన దౌత్య చర్యల్లో భాగంగా ట్రంప్ ప్రకటనలపై బఖాయీ తీవ్రంగా స్పందించారు. శుక్రవారం కూడా మరో సందర్భంగా ఇస్మాయిల్ బఖాయీ ఎక్స్‌వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, ఇరాన్‌పై అమెరికా దాడిని ఒక దురాక్రమణ చర్యగా పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడిని ట్రంప్ ఆత్మరక్షణ చర్యగా పేర్కొనడాన్ని బఖాయీ తీవ్రంగా వ్యతిరేకించారు. "ఆత్మరక్షణ దేనికి వ్యతిరేకంగా? ఇరాన్ దేశం అమెరికా మీద సాయుధ దాడులు చేసిందా? ఖచ్చితంగా చేయలేదు, అందరికీ తెలుసు, ఇది దురాక్రమణ తప్ప ఆత్మరక్షణ కాదు, 40 రోజులుగా చేసిన దాడుల్లో ఇరాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది, దానికి పరిహారం చెల్లించాలి" అన్నారు.



"తాము ఒక రకంగా సముద్ర దొంగల (పైరేట్స్) లాంటివాళ్ళమే, అదొక లాభసాటి వ్యాపారం, కానీ ఎవ్వరితో మేం ఆటలు ఆడటంలేదు" అని ఫ్లోరిడాలో శనివారం తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ట్రంప్ చెప్పడం అంతర్జాతీయ స్థాయిలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. గల్ఫ్‌లో ఒక నౌకను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ఆ నౌకలోంచి చమురు, ఇతర సరుకులను తీసుకున్నామని, అదొక లాభసాటి వ్యాపారమని అన్నారు. ఇరాన్ నౌకా, వైమానిక వ్యవస్థలను, రాడార్ వ్యవస్థలను సమూలంగా నాశనం చేశామని, వారి నాయకత్వాన్ని మట్టుపెట్టామని, మాకు అనుకూలమైన ఒక ఒప్పందాన్ని కోరుకుంటూ దానికోసం ఎదురుచూస్తున్నామని ట్రంప్ తన ప్రసంగంలో చెప్పారు. దీనిపై ఇస్మాయిల్ బఖాయీ స్పందిస్తూ, "అమెరికా అధ్యక్షుడు ఇరాన్ నౌకలను స్వాధీనం చేసుకోవడాన్ని బాహాటంగా ఒప్పుకున్నాడు, మేం సముద్ర దొంగల్లా ప్రవర్తిస్తాం అని బరిదెగించి గొప్పలు చెప్పుకున్నాడు" అని విమర్శించారు.

# జర్మనీ నుండి గణనీయంగా సైన్యం ఉపసంహరణ: ట్రంప్

డెమోక్రాట్ల వ్యతిరేకత,
రిపబ్లికన్లలో ఆందోళన

**వెస్ట్‌పామ్ బీచ్:** జర్మనీ నుండి మరిన్ని అమెరికా దళాలను ఉపసంహరిస్తామని డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. జర్మనీలో దశాబ్దాలుగా కొనసాగుతున్న అమెరికా సైనిక బలగాలను గణనీయస్థాయిలో వెనక్కు మళ్ళిస్తామన్నారు. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ యుద్ధంలో ఇరాన్‌కు అనుకూల ప్రకటన చేయడాన్ని ట్రంప్ జీర్ణించుకోలేకపోవడంతో జర్మనీలో తమ దళాలు ఉండాల్సిన అవసరం లేదని ప్రకటించారు. అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ ఉత్తర్వుల మేరకు 5,000 మంది సైనికులను ఉపసంహరిస్తున్నట్లు పెంటగాన్ వర్గాలు శనివారం ప్రకటించాయి. రాబోయే ఆరు నుండి పన్నెండు నెలల వ్యవధిలో ఈ బలగాలను అక్కడి నుండి ఉపసంహరిస్తామని పేర్కొంది. దీని కొనసాగింపుగా ట్రంప్ ఫ్లోరిడాలో ఆదివారం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇంకా గణనీయంగా సైన్యాన్ని ఉపసంహరిస్తామని చెప్పారు. 36,000 మంది అమెరికా సైనికులు అనేక దశాబ్దాలుగా జర్మనీలో ఉన్నారు. యూరప్‌లో సర్వసాధారణంగా 80,000 నుండి 1,00,000 మంది అమెరికా సైనికులు యూరప్ దేశాలలోనే ఉంటారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌లో పుతిన్ పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన తర్వాత యూరప్‌లో అమెరికా సైన్యం ఉనికి మరింత పెరిగింది. ఈ విషయంపై జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ స్పందిస్తూ, అనేక సంవత్సరాలుగా ట్రంప్ ఈ విధంగా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. ఇది తమకు కొత్త విషయం కాదనీ, ఊహించిన విషయమేనని అన్నారు. ఇకమీదట యూరప్ దేశాలు తమ తమ సొంత సైనిక బలగాలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుందని, తమ రక్షణ బాధ్యతలను తామే చూసుకోవాల్సి ఉంటుందని అన్నారు. "యూరప్‌లో అమెరికా సైనికులు ఉండటం అనేది ముఖ్యంగా తమ ఆసక్తి కారణంగానే, దాంతోపాటు అమెరికా ప్రయోజనాలు కూడా ఉన్నాయి" అన్నారు. ఐతే అమెరికా నిర్ణయంపై విభిన్న స్పందనలు వస్తున్నాయి. స్వదేశంలో ట్రంప్ నిర్ణయాన్ని ప్రతిపక్ష డెమోక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సొంత పార్టీ రిపబ్లికన్లలో కూడా ఆందోళన నెలకుంది. ఈ ఉపసంహరణ వల్ల రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు తప్పుడు సంకేతాలు వెళతాయని రిపబ్లికన్లు అందోళన చెందుతున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా చేస్తున్న యుద్ధంలో ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధంలో చేరేందుకు యూరప్ దేశాలు అయిష్టత వ్యక్తం చేశాయి. కష్ట సమయంలో ఉన్నప్పుడు మిత్రదేశాలు కలిసి రావడం లేదని ట్రంప్ అప్పటినుండి పలుసార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అదే విధంగా స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్, బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ తదితరులపై ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. అమెరికా వాణిజ్య ఒప్పందానికి యూరప్ కట్టుబడి లేదని కూడా విమర్శించారు. వచ్చేవారం యూరప్ కార్లు, లారీలపై 25 శాతం మేరకు సుంకాలు పెంచే యోచన ఉందని కూడా అన్నారు.

గత వారారంభంలో మెర్జ్ ఒక జర్మనీ యూనివర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పశ్చిమాసియాలో అమెరికాకు ఒక యుద్ధ వ్యూహం లేదని, వారు ఈ యుద్ధం నుండి బయటపడే వ్యూహాత్మక నిష్క్రమణ మార్గం ఏమిటో తనకు అర్థం కావడం లేదని విమర్శించారు. మరోవైపు ఇరానియన్ ప్రతినిధులు కూడా చర్చలు జరపడంలో, చర్చలు జరపకుండా ఉండటంలో చాలా నైపుణ్యంగలవారని దీనివల్ల యావత్ అమెరికా అవమానాలకు గురవుతోదని అన్నారు. దీనిపై ట్రంప్ ఆగ్రహిస్తూ, ఇరాన్ అణ్వాయుధాన్ని మెర్జ్ సమర్థిస్తున్నారని విమర్శించారు.

# ఇరాన్–పాలస్తీనా, క్యూబాలకు చిలీలో కార్మికుల సంఘీభావ ప్రదర్శన



**శాంటియాగో:** ఇరాన్, పాలస్తీనా, క్యూబా ప్రజలకు చిలీ కార్మికులు సంఘీభావం ప్రకటించారు. చిలీ ప్రధాన నగరం శాంటియాగోలో కార్మికులు తమ దేశీయ కార్మిక సమస్యల పరిష్కారం కోసం మే డే కార్మికుల దినోత్సవం నాడు, ఆ మరునాడు భారీ ప్రదర్శన నిర్వహించారు. దీంతోపాటు పాలస్తీనా, ఇరాన్ ప్రజలకు కూడా సంఘీభావం ప్రకటించారు. జాతీయ సార్వభౌమాధికారం, సామ్రాజ్యవాద నిరంకుశత్వ నిర్మూలన ప్రపంచ కార్మికుల ప్రధాన డిమాండ్లలో ఉన్నాయని చిలీ కార్మికులు నినాదాలు చేశారు. జాతీయ సార్వభౌమాధికారాలపై అక్రమ దాడులను వారు ఖండించారు. యెమెన్‌లో పరిస్థితులను కూడా వారు ప్రముఖంగా ప్రస్తావించారు. క్యూబా దేశాన్ని ఆక్రమించేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను వారు వ్యతిరేకించారు. క్యూబా, ఇరాన్, పాలస్తీనా జెండాలను కార్మికులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనల తర్వాత వక్తలు మాట్లాడుతూ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి విధానాలను ప్రతిఘటించేందుకు ప్రపంచ వ్యాప్తంగా కార్మికులమధ్య ఒక ఏకీకృత, అంతర్జాతీయ విధానం ఉండాలని వారు ఉద్ఘాటించారు. విదేశీ ప్రభావానికి వ్యతిరేకంగా లాటిన్ అమెరికా చేసిన పోరాట చారిత్రక నేపథ్యాన్ని కూడా వక్తలు తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు. క్యూబన్ విప్లవం సామ్రాజ్యవాద వ్యతిరేకతను చాలా బలంగా నొక్కిచెప్పిందని వారు పేర్కొన్నారు. ఇరాన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ అమానుష యుద్ధం ద్వారా అపారనష్టం సృష్టించి పాలకులు, ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టిందని, ఈ అమానుష చర్యలు కట్టిపెట్టాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పాలస్తినాలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న దుర్మార్గపూరితమైన ముట్టడి, ప్రజలకు కనీస అవసరాలు కూడా లేకుండా చేయడాన్ని కార్మికులు వ్యతిరేకించారు. ఈ రెండు దేశాల ప్రజలకు సంఘీభావం ప్రకటించారు. ఇరాన్, లెబనీస్ రెసిస్టెన్స్ మూమెంట్ హెజ్బొల్లా, యెమెన్ దళాల రక్షణాత్మక చర్యలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గణనీయమైన సామర్థ్యాన్ని ప్రదర్శించాయని, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం కొనసాగించడానికి ప్రపంచ కార్మిక లోకానికి ఇవి ఆశారేఖలుగా ఉన్నాయని ఒక కార్మికుడు వ్యాఖ్యానించారు. చిలీలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు అనుచరుడుగా ఉన్న జోష్ ఆంటోనియో కాస్ట్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మొదటిసారి కార్మికులు ఈ ఏడాది మేడే వేడుకల్లో ఈ డిమాండ్లు ముందుకు తెచ్చారు.

# హోర్ముజ్ నిర్వహణ కూడా ఇరాన్ ఇండస్ట్రీ జాతీయీకరణ లాంటిదే

డిప్యూటీ స్పీకర్ అలీ నిక్జాద్



**బందర్ అబ్బాస్:** పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ కొత్తగా చేపట్టిన హోర్ముజ్ జలసంధి నిర్వహణ కార్యక్రమాన్ని కూడా తమ దేశ చమురు పరిశ్రమ జాతీయీకరణ చర్య తరహాలోనే పరిగణించాలని ఆ దేశ పార్లమెంటు డిప్యూటీ స్పీకర్ అలీ నిక్జాద్ అన్నారు. ఇరాన్ పార్లమెంటు కమిటీ సభ్యులతో కలిసి దక్షిణ నగరమైన బందర్ అబ్బాస్‌లో ఉన్న షాహిద్ రాజాయీ ఓడరేవును నిక్జాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధి నిర్వహణ ఖచ్చితత్వంతో ఉంటుందని, ఇరాన్ చేపట్టిన ఈ కొత్త విషయాన్ని కూడా దేశీయ చమురు పరిశ్రమ జాతీయీకరణ తరహాలోనే ఎంతో ముఖ్యమైన అంశంగా పరిగణించి అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. హోర్ముజ్ జలసంధి ఇప్పుడు దేశీయంగానూ, అంతర్జాతీయస్థాయిలోనూ ఇరాన్‌కు చెందిన ఒక కీలకమైన అంశంగా గుర్తింపు పొందిందని, ఇప్పుడు ఇదొక సార్వత్రిక విషయమని అన్నారు. గల్ఫ్ ఆఫ్ పర్షియన్‌లో ఇరాన్‌కు చెందిన 2000 కిలోమీటర్లకు పైగా ఉన్న సముద్రతీర ప్రాంతంపై తన పట్టును, సాధికారతను బలంగా విస్తరించుకునేందుకు ఐఆర్‌జిసితోపాటు ఇరాన్ ప్రభుత్వం కూడా ఈ యుద్ధ నేపథ్యంలో చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. ఈ సందర్భంలో నిక్జాద్ మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధి ఇరాన్‌కు చెందిన అతిముఖ్యమైన ఆయుధంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, దీనిని జాతీయీకరణతో సమానంగా పరిగణించాలని అన్నారు. ఈ జలసంధి నిర్వహణకు సంబంధించిన నిబంధనలను 12 సూత్రాల రూపంలో రూపొందించామని, వాటిని నిర్దిష్ట మార్గాల ద్వారా అమలు చేస్తున్నామని చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై సుంకాలు విధించి అమలు చేసేందుకు ఇరాన్ పార్లమెంటులో ఒక బిల్లును కూడా ప్రతిపాదించారు. ఇది అపరిష్కృతంగా ఉంది. ఐతే ప్రపంచదేశాలు మాత్రం హోర్ముజ్‌లో నౌకావాణిజ్య రవాణా ఉచితంగా ఉండాలని, అప్పుడే అంతర్జాతీయ వాణిజ్యానికి భద్రత ఉంటుందని అంటున్నాయి. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైన తర్వాత తొలినాళ్ళలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తన అధీనంలోకి తెచ్చుకుంది. ఇరాన్‌పై దురాక్రమణ చేసిన అమెరికా,ఇజ్రాయెల్ నౌకలకు హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రవేశం లేదని స్పష్టం చేసింది. ఈ జలసంధిలో నౌకావాణిజ్యాన్ని నిషేధించింది. యుద్ధం ముగిసేవరకూ అందుకు తావు లేదని స్పష్టం చేసింది.

# క్షీణిస్తోంది!

(మొదటి పేజీ తరువాయి)

ధర లభిస్తుండడంతో పాటు వరి పండించడం సులభతరం రావడంతో పూర్తిగా వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు వ్యవసాయం చేసే రైతుల సంఖ్య తగ్గుతుండడం, కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగి వారు కూడా వరి సాగు పెరగడానికి మరో కారణం అవుతోంది. గతంలో అంతగా సాగు నీరు అందుబాటులో లేని కాలంలో వర్ష ఆధారంగా పప్పు దినుసులు సాగు చేసిన రైతులు ఆ తర్వాత కొంత కాలం అంతర్ పంటగా సాగు చేశారు. ఇప్పుడు పప్పు దినుసులు అంతర్ పంటకు కూడా నోచుకోకపోతుండడంతో క్రమంగా పప్పు దినుసులు, నూనె గింజలు, మిల్లెట్లు, కూరగాయాల సాగు తగ్గుముఖం పట్టగా, వరి సాగు మాత్రం అంతకంతకూ పెరిగిపోతోంది. అధికారిక లెక్కల ప్రకారమే 2013 నుంచి 2026 వరకు వరి సాగు 131.7 శాతానికి పెరగగా, పప్పు ధాన్యాల సాగు ఏకంగా 39 శాతానికి పడిపోవడం గమన్హారం. కూరగాయాల సాగు పరిస్థితి అయితే మరింత దారుణంగా ఉంది.

**2013 నుంచి పప్పు ధాన్యాల సాగు తగ్గుముఖం**

ప్రధాన పంట అయిన కందుల సాగు 2013లో 6.46 లక్షల ఎకరాలలో ఉండగా 2020లో ఏకంగా 10.56 లక్షల ఎకరాల గరిష్ట స్థాయి పెరిగి, ఆ తర్వాత 2024 నాటకి ఏకంగా 5.21 లక్షల ఎకరాలకు (19.4 శాతం) పడిపోయింది. పెసర్లు, మినుముల పంట సాగు సైతం గణనీయంగా తగ్గింది. పెసర్లు 2013లో 2.74 లక్షల కరాలు ఉండగా, 2024లో 68 వేల ఎకరాల (75.2 శాతం)కు పడిపోయింది. మినుములకు సంబంధించి 2013లో 79,294 ఎకరాలు ఉండగా 2024 నాటికి 22,573 వేల ఎకరాల (71.5 ) కు క్షీణించింది. అలసందలు 2013లో 5,330 ఎకరాలు సాగులో ఉండగా 2024 నాటికి 1,470 (72.4శాతం) ఎకరాలకు పడిపోయింది. ఉలవలు 855 ఎకరాల నుంచి 524 ఎకరాలకు (71.6 శాతం, శెనగలు 133 ఎకరాల నుంచి 42 ఎకరాల (68.5 శాతం)కు పడిపోయింది.

**89.9 శాతానికి తగ్గిన చిరుధాన్యాల సాగు**

రాష్ట్రంలో చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగు విస్తీర్ణం 89.9 శాతానికి తగ్గిపోయింది. 2013లో 15,733 ఎకరాలుగా ఉన్న మొత్తం సాగు విస్తీర్ణం, 2024 నాటికి కేవలం 1,591 ఎకరాలకు ( 89.9 శాతం) క్షీణించింది. కొర్ర సాగు 2015లో 3,079 ఎకరాల గరిష్ట స్థాయి నుంచి 2024లో 675 ఎకరాలకు తగ్గి 68.6 శాతం పడిపోగా, సజ్జల పంట సాగు సైతంభారీగా తగ్గింది. 2013లో 10,578 ఎకరాల నుంచి 2024లో 529 ఎకరాలకు పడిపోవడంతో 95 శాతం తగ్గింది. 2013లో 2975 ఎకరాలు ఉన్న రాగుల సాగు 2019లో 3,677 ఎకరాల గరిష్ట స్థాయికి చేరగా, తరువాత కాలంలో తగ్గుతూ 2024లో 388 ఎకరాలకు (87 శాతం) తగ్గింది. సామల సాగు 2013లో 30 ఎకరాల్లో ఉండగా 2024 నాటికి పూర్తిగా కనుమరుగైంది.

**42 వేల ఎకరాలకు పడిపోయిన కూరగాయల సాగు**

రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణం గత కొన్నేళ్లుగా గణనీయంగా తగ్గిపోయింది. 2013లో 1.18 లక్షల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2016లో 1.58 లక్షల ఎకరాలకు గరిష్ట స్థాయికి పెరిగింది. ఆ తర్వాత క్రమంగా క్షీణిస్తూ 2020లో 90 వేల ఎకరాలు, 2021లో 73 వేల ఎకరాలు, 2022లో 58 వేల ఎకరాలు, 2023లో 52 వేల ఎకరాలకు తగ్గింది. 2024లో ఏకంగా 42 వేల ఎకరాలు పడిపోయి కనిష్ట స్థాయికి చేరింది.

**రాష్ట్రంలో 52 శాతం తగ్గిన నూనె గింజల సాగు**

2013లో 8.65 లక్షల ఎకరాలు ఉన్న నూనె గింజల సాగు 2024 వరకు ఏకంగా 4.10,582 ఎకరాలకు (52.5శాతం) పడిపోయింది. ఇందులో 2013లో సోయా బీన్ 5,99 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, 2016లో 6.83 లక్షలకు పెరిగింది. ఆ తర్వాత 2017లో ఒక్కసారిగా 3.76 లక్షలకు పడిపోయిన సాగు విస్తీర్ణం 2018లో 3.65 లక్షలు, 2019లో 4.25 లక్షలు, 2020లో 4 లక్షలు, 2021లో3.77 లక్షలు, 2022లో 4.96 లక్షలకు పెరిగింది. ఆ తర్వాత 2023లో 4.48 లక్షలు, 2024లో 3.80లక్షల ఎకరాలు (36.4 శాతానికి ) పడిపోయింది. వేరుశెనగ సాగు విస్తీర్ణం 2013లో 52.785 ఎకరాలు ఉండగా 2024 నాటికి 25,891 ఎకరాలకు (51.4శాతం) క్షీణించింది. ఆవాలు 2013లో 1.99 లక్షల ఎకరాలు ఉండగా 2024 నాటికి 2,926 ఎకరాలు (98.5) శాతం, నువ్వులు, 2013లో 13,679 ఎకరాల నుంచి 702 ఎకరాలు (94.9 శాతం), సన్‌ఫ్లవర్ 2013 లో 5041 ఎకరాల నుంచి 2024 నాటికి ఏకంగా 77 (98.5 శాతం) పడిపోయింది.

# కరీంనగర్‌లో కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

కనికరం లేకుండా కాల్పులు జరపడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. షోరూమ్‌లోని బంగారు, వజ్రాభరణాలను బ్యాగుల్లో నింపుకుని బైకులపై అక్కడి నుంచి పరారయ్యారు. పట్టపగలు, రద్దీ ప్రాంతంలో తుపాకులతో కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడటం నగర ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సహా ఉన్నతాధికారులు భారీ బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ సహాయంతో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. షోరూమ్‌లోని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని నిందితుల కదలికలపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. దుండగులు మాట్లాడిన భాష, వచ్చిన మార్గం వంటి అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. దోచుకెళ్లిన ఆభరణాల విలువ కోట్లలో ఉండవచ్చని ప్రాథమిక అంచనా వేస్తున్నప్పటికీ పూర్తి వివరాలు యాజమాన్యం నిర్ధారించాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో నగరంలో హై అలర్ట్ ప్రకటించిన పోలీసులు అన్ని ప్రధాన మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. నిందితుల సంబంధించిన ఫోటోలను విడుదల చేశారు. నిందితులు పొరుగు రాష్ట్రాలకు చెందిన ముఠా సభ్యులై ఉండవచ్చనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కరీంనగర్‌లోని జ్యోతినగర్ పీఎంజే జ్యువెలరీ షాపు సిబ్బందిపై దుండగుల కాల్పుల ఘటన సమాచారం తెలిసిన వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్




కుమార్ తదితరులతో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. జ్యువెలరీ షాపులోని సీసీ పుటేజీని పరిశీలించారు. కాల్పుల ఘటనపై షాపు సిబ్బంది వద్ద ఆరా తీశారు.

**క్రైమ్ సీన్‌ను పరిశీలించి, బాధితులను పరామర్శించిన ఐజిపి**

మల్టీజోన్1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి చోరీ ఘటన జరిగిన ప్రాంతంలో పర్యటించారు. ముందుగా ఆయన క్రైమ్ సీన్‌ను (ఘటనా స్థలాన్ని) క్షుణ్ణంగా పరిశీలించి, దర్యాప్తు పురోగతిపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.అనంతరం, ఐజీపీ స్థానిక ఆసుపత్రిని సందర్శించి, ఈ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

**కాల్పుల ఘటనలో గాయపడ్డ బాధితులకు అండగా ఉంటాం..**

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు కరీంనగర్ లోని పీఎంజే జ్యువెలరీ లో చొరబడి కాల్పులు జరిపి దొంగతనానికి పాల్పడిన దుండగులను పోలీసులు పట్టుకొని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. పిఎంజె జువెలర్స్ లో దుండగులు జరిపిన కాల్పుల్లో పలువురు గాయపడ్డారని వారికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందేలా చూస్తామని చెప్పారు. బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారు.

# హోర్ముజ్ సమీపంలో భారీ నౌకపై దాడి

సిబ్బంది సురక్షితం: ఎంటిఒసి

**దుబాయ్:** హోర్ముజ్ సమీపంలో ఒక భారీ నౌకపై చిన్న చిన్న నౌకల దండు దాడి చేసినట్లు బ్రిటన్ సైన్యానికి చెందిన సముద్రాంతర వాణిజ్య కార్యకలాపాల కేంద్రం (ఎంటిఓసి) ఆదివారం రాత్రి ప్రకటించింది. ఈ దాడికి తామే బాధ్యులమని ఎవరూ ప్రకటించలేదు. ఇరాన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత హోర్ముజ్ జలసంధిలో, ఆ చుట్టుపక్కల జలాలలో దాదాపు రెండు డజన్లకుపైగా నౌకలపై దాడులు జరిగాయి.

ఇరాన్‌లోని సిరిక్ సమీపంలో ఈ దాడి జరిగింది. ఐతే భారీస్థాయిలో చమురు లేదా ఇతర సామాగ్రి తీసుకువెళుతున్న ఈ పెద్ద నౌక ఏ దేశానికి చెందినదీ, ఎవరి సరుకు అనే విషయాలు వెంటనే తెలియరాలేదు. నౌకలో ఉన్న సిబ్బంది మొత్తం క్షేమంగా ఉన్నారని ఎంటిఓసి తెలియజేసింది. ఐతే హోర్ముజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని, అమెరికా,ఇజ్రాయెల్‌కు చెందిన నౌకలు కాకుండా ఏ ఇతర దేశాలకు చెందిన నౌకలైనాగానీ తమకు సుంకం చెల్లించి స్వేచ్ఛగా,సురక్షితంగా జలసంధిని దాటి తమ తమ గమ్యాలకు చేరుకోవచ్చునని ఇరాన్ ప్రకటించింది. అమెరికా–ఇరాన్ మధ్య ఎంతమాత్రం విశ్వాసం లేని పరిస్థితులమధ్య మధ్యవర్తుల ద్వారా కుదిరిన కాల్పుల విరమణ తాత్కాలిక సంధి అమలులో ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, తాజా పరిణామాలు మాత్రం ఏ క్షణంలోనైనా ఒప్పంద ఉల్లంఘన జరగవచ్చుననే ఆందోళన,భయాలను వ్యాప్తి చేస్తున్నాయి. మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా అమెరికాకు ఇరాన్ 14 అంశాలతో మరో కొత్త ప్రతిపాదన చేసినప్పటికీ, ఇరు దేశాల నాయకుల నుండీ యుద్ధ హెచ్చరికలు కొనసాగుతూనే ఉన్నాయి.

# అటకెక్కింది!

(మొదటి పేజీ తరువాయి)

విత్తన చట్టం దేశానికే దిక్సూచిగా వుండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్ధేశం చేయడంతో రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి నేతృత్వంలో విత్తన చట్టం ముసాయిదా రూపకల్పన కమిటీ కన్వీనర్‌గా వ్యవసాయశాఖ డైరెక్టర్ బి.గోపి, సభ్యులుగా విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్, రైతు కమిషన్, సలహాదారునిగా దొంతి నర్సింహ్మారెడ్డి ఉన్నారు. విత్తన చట్టం మూసాయిదాను కమిటీ పకడ్బందిగా రూపొందించింది. ఇప్పటికే విత్తన చట్టాలకు సంబంధించి రాష్ట్రంలో 1951 యాక్ట్, దేశ వ్యాప్తంగా కేంద్రం 1961లో తీసుకువచ్చిన 54 యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ వాటిలోని లోపాలను అడ్డం పెట్టుకుని కార్పొరేట్‌తో పాటు ఇతర విత్తన కంపెనీలు యాధేచ్ఛగా ప్రతి ఏటా రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతూ సొమ్ము కుంటున్నాయి. వీటన్నింటిని అధిగమించేందుకు విత్తన చట్టంలో వుండాల్సిన అంశాలపై రైతులు, రైతు సంఘాల నేతలు, విత్తన డీలర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన కంపెనీల ప్రతినిధుల నుండి అభిప్రాయాలను సేకరించింది. అంతేకాకుండా పలు ఇతర రాష్ట్రంలో అమల్లో ఉన్న విత్తన చట్టం లోపాలను గుర్తించి తెలంగాణలో పటిష్టమైన, సమగ్రమైన విత్తన చట్టం ఉండే విధంగా ఈ నివేదికను రూపకల్పన చేశారు. ఈ నివేదికను ప్రభుత్వానికి సమర్పించి 8 నెలలు గడుస్తున్నప్పటికీ కనీసం చర్చకు నోచుకోకుండా ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

**ఈ మంత్రివర్గ సమావేశంలోనైనా చర్చకు వచ్చేనా?**

మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన జరుగును న్నమంత్రి వర్గ సమావేశంలోనైనా విత్తన చట్టం రూపకల్పనకు సంబంధించిన నివేదిక చర్చకు వస్తుందా లేదా అన్న అంశం అసక్తిగా మారింది. ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టాలని, ఇందుకు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలను విక్రయించే కంపెనీల పనిపట్టేందుకు ఇప్పటికే సిద్ధంగా ఉన్న విత్తన చట్టం రూపకల్పన నివేదిక ఈ మంత్రివర్గ సమావేశంలో చర్చించి దానిని అమల్లోకి తేస్తే రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని రైతులు, రైతు సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

# ఫలితాలు నేడే?

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత బంగాల్‌లో 92.47 శాతం ఓటింగ్ జరగడం ఇదే తొలిసారి. 2.5లక్షల మంది కేంద్ర పారా మిలిటరీ బలగాలు, రాష్ట్ర పోలీసుల భారీ బందోబస్తు మధ్య చెదురుమదురు ఘటనలు మినహా రెండు విడతల్లో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

**అందరి దృష్టి 'భవానీపుర్' నియోజకవర్గంపైనే**

మొత్తం 77 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది. కోల్‌కతాలోని 11 నియోజకవర్గాలకుగానూ 5 ప్రాంతాల్లో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇవిఎంలు ట్యాంపరింగ్ అయ్యే అవకాశం ఉందన్న టిఎంసి ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి టీవీలతో పాటు మూడంచెల భద్రత, 165మంది అదనపు కౌంటింగ్ అబ్జర్వర్లు, 77మంది పోలీస్ అబ్జర్వర్లను రంగంలోకి దించామని అధికారులు తెలిపారు. క్యూఆర్ కోడ్ పాస్ ఉన్న వారినే కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. మొబైల్ ఫోన్లను పూర్తిగా నిషేధించారు. ఇప్పుడు అందరి దృష్టి భవానీపుర్ నియోజకవర్గం పైనే నెలకొంది. సిఎం మమతా బెనర్జీ, బిజెపి సీనియర్ నేత సువేందు అధికారి ఇక్కడ బరిలో ఉన్నారు. దీనికి సంబంధించిన కౌంటింగ్ సఖావత్ మెమోరియల్ కేంద్రంలో జరగనుంది.

**తమిళనాట మళ్లీ డిఎంకెకు పట్టంకట్టనున్నారా?**

యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడికి సమయం ఆసన్నమైంది. సోమవారం ఓట్ల లెక్కింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి ఎన్నికల్లో అధికార డిఎంకె, ప్రతిపక్ష అన్నాడిఎంకెతో పాటు ప్రముఖ నటుడు విజయ్ పార్టీ 'టివికె' రంగంలోకి దిగడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. డిఎంకెకు ప్రజలు మళ్లీ పట్టంకట్టనున్నారా? లేక ప్రతిపక్ష అన్నాడిఎంకె మళ్లీ పుంజుకుంటుందా? లేదా విజయ్ సరికొత్త చరిత్ర లిఖించనున్నారా? ఈ ప్రశ్నలకు సోమవారమే జవాబు దొరకనుంది. ఏప్రిల్ 23న తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ ముగిసింది. 4 వేల 23 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఇవిఎంలలో ఓటర్లు నిక్షిప్తం చేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో కౌంటింగ్ ప్రారంభమవుతుంది. సరిగ్గా 8 గంటల 30 నిమిషాలకు ఇవిఎంల లెక్కింపు మొదలవుతుంది. ఇవిఎంల కోసం ప్రత్యేకంగా 234 కౌంటింగ్ హాళ్లను సిద్ధంచేశారు. పోస్టల్ బ్యాలెట్లు, ఇటిపిబిఎశ్ ఓట్లను లెక్కించేందుకు మరో 240 హాళ్లు కేటాయించారు. మొత్తం 3వేల 324 కౌంటింగ్ టేంటింగ్ ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. ప్రతి నియోజకవర్గానికి ఒకరు చొప్పున మొత్తం 234 మంది కౌంటింగ్ అబ్జర్వర్లను ఇసి నియమించింది. 4వేల 624 మంది మైక్రోఅబ్జర్వర్లు, 10వేల 545 మంది కౌంటింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు.

**లక్షా 25వేల మందితో మూడంచెల భద్రత ఏర్పాటు**

కౌంటింగ్ రోజు అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏకంగా లక్షా 25వేల మందితో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. మొదటి అంచెలో కౌంటింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో పోలీసులు, రెండో అంచెలో కౌంటింగ్ కేంద్రం ద్వారాల వద్ద స్టేట్ ఆర్మ్‌డ్ పోలీసులు ఉంటారు. మూడో అంచెలో కౌంటింగ్ హాళ్ల లోపల, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సెంట్రల్ ఆర్మ్‌డ పోలీస్ ఫోర్సెస్ పహారా ఉంటుంది. 65 సిఎపిఎఫ్ కంపెనీలను ఇసి రంగంలోకి దించింది. చరిత్రలో తొలిసారిగా అనధికారిక వ్యక్తులు కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించకుండా అడ్డుకోవడానికి ఈసీ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇసిఐనెట్ ద్వారా జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫోటో ఐడెంటిటీ కార్డులను తప్పనిసరి చేసింది.

**కేరళలో ఎగిరేది ఏ జెండా?**

దక్షిణాదిలో ఎర్రకోటగా పేరొందిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జాతీయ స్థాయిలో అందరి దృష్టి నెలకొంది. వరుసగా మూడోసారి అధికారం చేపట్టి రికార్డ్ సృష్టించాలని ఎల్‌డిఎఫ్ భావిస్తుండగా 2024 లోక్‌సభ ఎన్నికలు, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో ఆత్మవిశ్వాసంతో ఉన్న యుడిఎఫ్ సిఎం పీఠంపై గురి పెట్టింది. మరోవైపు కామ్రేడ్ల కోటలో ఉనికి చాటుకోవాలని ఎన్‌డిఎ ఉవ్విళ్లూరుతోంది. 3 కూటములకు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన ఈ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ సారథ్యంలోని యుడిఎఫ్ అధికారం చేపడుతుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల మధ్య కేరళ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. 140 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న పోలింగ్ జరిగింది. మొత్తం 2కోట్ల 71లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా 79.70శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 883 మంది అభ్యర్థుల భవితవ్యం సోమవారం ఉదయం 8గంటలకు మొదలయ్యే ఓట్ల లెక్కింపుతో తేలనుంది. ఎన్నికల సంఘం 43 ప్రాంతాల్లో 140 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. 140 మంది రిటర్నింగ్ అధికారులు, 1,340 అదనపు రిటర్నింగ్ అధికారులు, 4వేలకు పైగా మైక్రో అబ్జర్వర్లతో సహా 15,464 మంది సిబ్బంది కౌంటింగ్ విధుల్లో పాల్గొంటారు. ఎన్నికల అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచి ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. కేరళలోని మొత్తం ఓట్లలో అవి 1.36 శాతంగా ఉన్నాయి. అనంతరం ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఒక్కో రౌండ్‌లో గరిష్టంగా 14 పోలింగ్ కేంద్రాల ఓట్లను లెక్కిస్తారు. మధ్యాహ్నానికల్లా ఫలితాలపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# మళ్లీ చిత్తయిన ముంబై!




ఐపిఎల్ అభిమానులు ఆసక్తి కనబరిచే ఎల్ క్లాసికో పోరులో మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్‌దే పైచేయి. వాంఖడేలో ముంబై ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించిన చెన్నై.. ఈసారి సొంతగడ్డపై పంజా విసిరింది. అన్షుల్ కంబోజ్(3–32) బంతితో విజృంభిచగా.. రుతురాజ్ గైక్వాడ్(67 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(54 నాటౌట్)తో అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పి ముంబైని ముంచాడు. ఈ సీజన్‌లో నాలుగో విజయంతో సీఎస్కే ఖాతాలో ఎనిమిది పాయింట్లు చేరాయి. ఐపిఎల్19లో చెన్నై సూపర్ కింగ్స్ నాలుగో విజయంతో మురిసింది. చెపాక్ స్టేడియంలో ముంబై ఇండియన్స్‌ను 159కే కట్టడి చేసిన చెన్నై స్వల్ప లక్ష్యాన్ని ఊదిపడేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(67 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(54 నాటౌట్)లు ముంబై బౌలింగ్ దళాన్ని సమర్థంగా ఎదుర్కొని గెలుపు పునాది వేశారు. బౌండరీకి తరలించగా 8 వికెట్ల తేడాతో గెలుపొందింది సీఎస్కే.మొస్తరు ఛేదనలో బుమ్రా తన మొదటి ఓవర్లోనే డేంజరస్ సంజూ శాంసన్(11)ను బౌల్డ్ చేసి తొలి వికెట్ అందించాడు. అనంతరం కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ67 నాటౌట్) జతగా ఉర్విల్ పటేల్(26) చెలరేగాడు. 5వ ఓవర్లో 6, 4, 6తో 18 రన్స్ రాబట్టిన ఉర్విల్.. గజన్‌ఫర్ ఓవర్లో పెద్ద షాట్ ఆడబోగా బంతి ఎడ్జ్ తీసుకొని వికెట్లకు తాకింది. పవర్ ప్లేలో 2 వికెట్ల నష్టానికి 62 పరుగులు చేసిన చెన్నైని గెలిపించే బాధ్యత తీసుకున్నారు గైక్వాడ ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(54 నాటౌట్). పాండ్యా ఓవర్లో మిడ్ వికెట్ దిశగా కొట్టిన సిక్సర్‌తో చెన్నై స్కోర్ వంద దాటింది. ముంబై బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా అర్ధ శతక భాగస్వామ్యంతో గెలుపు దిశగా నడిపారు. గజన్‌ఫర్ వేసిన ఓవర్లో కార్తిక్ 4, 6, 4తో 14 రన్స్ పిండుకున్నాడు. అదే ఊపులో బౌండరీతో చెన్నైకి ఎనిమిది వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు. తొమ్మిది మ్యాచుల్లో రెండింట మాత్రమే గెలిచిన ముంబై ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించే పరిస్థితి తెచ్చుకుంది. గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదారబాద్‌పై 243 పరుగులు చేసిన ముంబై ఇండియన్స్ చెపాక్‌లో తడబడింది. సొంత మైదానంలో సీఎస్కే పేసర్ అన్షుల్ కంబోజ్(3–32) విజృంభణకు ముంబై స్టార్లు తేలిపోగా.. నమన్ ధిర్(57) సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ రికెల్టన్(37)తో.. ఆపై సూర్యకుమార్ యాదవ్(21)తో కీలక పరగుఉల జోడించి అర్ధ శతకంతో ముంబైని ఆదుకున్నాడు. ఆఖర్లో దంచేస్తాడనుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యా(18) పెద్ద షాట్లు ఆడలేకపోయాడు. బోల్ట్ సిక్సర్‌తో ముంబై నిర్ణీత ఓవరల్లో 159 పరుగులే చేసింది.

# సన్‌రైజర్స్ జోరుకు కోల్‌కతా బ్రేక్




అదిరే ఆటతో వరస విజయాలతో దూసుకెళ్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ కల చెదిరింది. డబుల్ హ్యాట్రిక్‌తో టాపర్ అవ్వాలనుకున్న కమిన్స్ సేనకు కోల్‌కతా నైట్ రైడర్స్ బిగ్ షాకిచ్చింది. మిస్టరీ స్పిన్నర్లు తిప్పేయడంతో హిట్టర్లతో నిండిన హైదరాబాద్‌ను 165 పరుగుల వద్దే ఆపిన కోల్‌కతా రఘువంశీ(59), సారథి అజింక్యా రహానే(43)ల విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. వైస్ కెప్టెన్ రింకూ సింగ్(18 నాటౌట్) లాంఛనం ముగించడంతో కోల్‌కతా మూడో విజయంతో మురిసింది. పంతొమ్మిదో సీజన్‌లో చెలరేపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరుకు కోల్‌కతా నైట్ రైడర్స్ బ్రేకులు వేసింది. ఉప్పల్ స్టేడియంలో బ్యాటర్లు తేలిపోవడంతో తక్కువ స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను బౌలర్లు కాపాడలేకపోయారు. స్వల్ప లక్ష్యాన్ని కోల్‌కతా ఆడుతూ పాడు తూ ఛేదించింది. ఆరెంజ్ ఆర్మీని 165కే కట్టడి చేసిన కెకెఆర్‌కు ఓపెనర్లు శుభారంభిమిచ్చారు. ఫిన్ అలెన్(29), అజింక్యా రహానే(43)లు ఎడాపెడా దంచేశారు. నాలుగో ఓవర్‌లో అలెన్ ఊచకోతకు బలైన కమిన్స్ 27 పరుగులిచ్చుకున్నాడు. కానీ, చివరి బంతికి అతడి వికెట్ తీసి ఊపిరి పీల్చుకున్నాడు. అనంతరం వచ్చిన రఘువంశీ(59) కెప్టెన్‌తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. అర్ధ శతకం భాగస్వామ్యంతో జట్టు విజయానికి బాటలు వేశారిద్దరు. కోల్‌కతాను గెలుపు దిశగా నడిపించిన ఈ జోడీని విడదీసేందుకు సన్‌రైజర్స్ సారథి కమిన్స్ బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. జట్టు విజయానికి 33 రన్స్ అవసరమైన వేళ షకీబ్ ఓవరర్లో రహానే ఔటయ్యాడు. కాసేపటికే రఘువంశీని శివాంగ్ వెనక్కి పంపాడు. అప్పటికే లక్ష్యం కరిగిపోగా.. వైస్ కెప్టెన్ రింకూ సింగ్(18 నాటౌట్), గ్రీన్(3 నాటౌట్) లాంఛనం ముగించారు. దాంతో, వరసగా ఆరో విజయంతో టాప్‌లోకి దూసుకెళ్లాలనుకున్న హైదరాబాద్ ఆశలు ఆడియాశలయ్యాయి.

**హెడ్. ఇషాన్ దంచినా..** సొంతగడ్డపై భారీ స్కోర్‌తో కోల్‌కతాను భయపెట్టాలనుకున్న సన్‌రైజర్స్ ఓపెనర్ ట్రావిస్ హెడ్61) మెరుపు అర్ధ శతకంతో భారీ స్కోర్‌కు పునాది వేసినా.. మిడిలాడ్డర్ బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. ఇషాన్ కిషన్(42) నిలబడినా అతడికి సహకరించేవాళ్లు కరువయ్యారు. మిస్టరీ స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి(3–36), సునీల్ నరైన్(2–31)లు వికెట్ల వేటతో సన్‌రైజర్స్ హిట్లర్లకు కళ్లెం వేశారు. ఇంకేముంది.. 48 పరుగుల వ్యవధిలో 8 వికెట్లు కోల్పోయిన హైదరాబాద్ 165కే ఆలౌటయ్యింది.

# ఆరోగ్యం

## పిల్లల్లో ఏడుపు మంచిదా?

'బాలానాం రోదనం బలం' అనే సామెత ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తృత ప్రచారంలో ఉంది. కానీ, ఆధునిక శాస్త్ర విజ్ఞాన అధ్యయనాలు దీనిని ఖండిస్తున్నాయి. నిజానికి శిశువు ఏడుపు అనేది ఒక ప్రవర్తన కాదు... జీవశాస్త్రీయ సంకేత వ్యవస్థ. పుట్టిన తర్వాత తొలి నెలల్లో శిశువు మెదడు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందదు. ఆకలి, అసౌకర్యం, భయం లేదా ఒంటరితనం వంటి పరిస్థితులను నియంత్రించడానికి అతనికి స్వీయ నియంత్రణ సామర్థ్యం ఉండదు. అందుకే ఏడుపు ద్వారా సంరక్షకుడిని పిలుస్తాడు. ఆ సమయంలో శిశువు శరీరంలో ప్రధాన ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ విడుదల అవుతుంది. సాధారణంగా తల్లిదండ్రులు స్పందించి ఓదార్చినప్పుడు, స్పర్శ, స్వరం, కంటి సంబంధం వంటి సంకేతాలు శిశువు నాడీవ్యవస్థను శాంతింపజేస్తాయి. దీనిని నాడీశాస్త్రంలో 'కొరెగ్యులేషన్' అంటారు. అంటే పెద్దవారి సహాయంతో శిశువు భావోద్వేగ స్థిరత్వాన్ని పొందడం. తాజా అధ్యయనాలను అనుసరించి, శిశువును దీర్ఘకాలం ఓదార్పు లేకుండా ఏడవనిస్తే కార్టిసాల్ స్థాయిలు ఎక్కువసేపు కొనసాగవచ్చు. అభివృద్ధి దశలో ఉన్న మెదడులో, ముఖ్యంగా భావోద్వేగ నియంత్రణకు సంబంధించిన అమిగ్డాలా, ప్రీఫ్రాంటల్ కార్టెక్స్ వంటి భాగాలు ఒత్తిడికి ఎక్కువగా స్పందించే విధంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. దీని వల్ల భవిష్యత్తులో, అధిక ఆందోళన స్పందనలు ఏర్పడవచ్చు. భావోద్వేగ నియంత్రణ కష్టమవుతుంది. అభద్రతా భావం పెరుగుతుంది. పిల్లలు ఏడవడం అవసరమని, తద్వారా వారి జీర్ణక్రియ మెరుగుపడుతుందని, అవయవాల పెరుగుదల సరిగ్గా ఉంటుందని చాలాకాలంగా ఒక అభిప్రయం ప్రజల్లో ఉంది. కానీ, ఇది సరికాదని తాజా అధ్యయనాలు పేర్కొంటున్నారు. పైగా వారికి ఓదార్పు కావాలని స్పష్టం చేస్తున్నాయి. ఓదార్పు అనేది కేవలం భావోద్వేగ చర్యగా పేర్కోవడానికి వీల్లేదు. అది జీవశాస్త్రీయ సంకేతం. మెల్లని స్పర్శ, ఆలింగనం, తల్లి స్వరం వంటివి శిశువు శరీరంలో ఆక్సిటోసిన్ విడుదలను




పెంచి ఒత్తిడిని తగ్గిస్తాయి. దీని ద్వారా మెదడు ప్రపంచం భద్రమైనది అనే ప్రాథమిక అనుభవాన్ని నిర్మిస్తుంది. అభివృద్ధి మనోవిజ్ఞానంలో దీనినే సెక్యూర్ ఎమోషనల్ బేస్ అంటారు. అయితే ప్రతి ఏడుపుకీ వెంటనే స్పందించాల్సిందే అనే అర్థం కాదు. శిశువు ఏడుపు స్వభావాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఆకలి ఏడుపు, అలసట ఏడుపు, లేదా స్వల్ప అసౌకర్యం. లక్ష్యం ఏడుపును పూర్తిగా ఆపడం కాదు... శిశువు ఒంటరిగా ఒత్తిడిని ఎదుర్కోవాల్సిన పరిస్థితి రాకుండా చూడడం..

## కాలేయానికి మేలుచేసే నల్లజీలకర్ర



మనిషి శరీరంలో ప్రతి అవయమూ కీలకమే. అయితే, అయితే, మెదడు, గుండె, కాలేయం వంటి భాగాలకు కొంత ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఇటీవల కాలంలో కాలేయ వ్యాధులు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తున్న విషయం. ముఖ్యంగా ఆల్కహాల్ తీసుకోకపోయినప్పటికీ కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోయే పరిస్థితి కేసులు విపరీతంగా మెరుగుతున్నాయి. ఇది ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న మెటబాలిక్ వ్యాధుల్లో ఒకటి. అధిక బరువు, ఇన్సులిన్ రెసిస్టెన్స్, టైప్2 డయాబెటిస్, అధిక కార్బోహైడ్రేట్ ఆహారం, వ్యాయామ లేమి వంటివి ఇందుకు కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. ప్రారంభ దశలో లక్షణాలు తక్కువగా కనిపించినా, కాలక్రమంలో ఇది కాలేయ వాపు, ఫైబ్రోసిస్ లేదా సిరోసిస్‌కు దారితీయవచ్చు. కాగా, ఇలాంటి సమస్యల నివారణకు నల్లజీలకర్ర (బ్లాక్ క్యుమిన్ సీడ్స్) ఎంతో ఉపయోగపడుతుందని తాజా అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఇందులో థైమోక్వినోన్ సమ్మేళనం ఉంటుంది. ఇది కాలేయ కణాల్లో జరిగే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తుంది. దీనినే యాంటీఆక్సిడెంట్ ప్రభావంగా పేర్కొంటారు. అదే విధంగా వాపు తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిని యాంటీఇన్‌ఫ్లమేటరీ ప్రభావం అంటారు. చిన్నస్థాయి క్లినికల్ ట్రయల్స్‌లో రోజుకు సుమారు 1–2 గ్రాముల నల్లజీలకర్ర పొడి లేదా నియంత్రిత మోతాదులో నూనె తీసుకున్న వ్యక్తుల్లో ఎఎల్‌టి, ఎఎస్‌టి వంటి కాలేయ ఎంజైమ్‌లు తగ్గడం, కాలేయంలో కొవ్వు నిల్వలు కొంత తగ్గడం, ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుదల, లిపిడ్ ప్రొఫైల్‌లో స్వల్ప మెరుగుదలను గమనించారు. అయితే, నల్లజీలకర్ర అనేది సహాయక చికిత్సగా ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు. అంతేగాక, కేవలం ఆహారపు అలవాట్లు మార్చుకోవడం వల్ల అద్భుతాలు జరగవని, నియమిత వ్యాయామం కూడా అత్యవసరమని స్పష్టం చేస్తున్నారు

## నిరుత్సాహానికి కారణం?



చాలా కాలంగా నిరుత్సాహానికి, నిరాశకు మెదడులో రసాయన అసమతుల్యత, ముఖ్యంగా సెరోటోనిన్ లోపమే కారణమనే అభిప్రాయం బలంగా ఉంది. అయితే తాజా అధ్యయనాలు ఈఅభిప్రాయం తప్పని అంటున్నాయి. ఎఫ్ఎంఆర్ఐ, పిఇటి స్కాన్ వంటి బ్రెయిన్ ఇమేజ్ మ్యాపింగ్ విధానాలను ఉపయోగించి, నిరుత్సాహం ఒకే రసాయన సమస్య కాదని, అది మెదడు న్యూరల్ సర్క్యూట్‌ల పనితీరు మార్పులతో సంబంధం కలిగిన పరిస్థితి అని నిర్ధారించారు. భావోద్వేగ నియంత్రణ, నిర్ణయాలు తీసుకోవడం, స్వీయ అవగాహన వంటి పనులకు బాధ్యత వహించే ప్రీఫ్రాంటల్ కార్టెక్స్, అమిగ్డాలా, హిప్పోకాంపస్ మధ్య ఉన్న కనెక్టివిటీ అనేది నిరుత్సాహంగా ఉన్న వ్యక్తుల్లో భిన్నంగా పనిచేస్తున్నట్లు కనిపించింది. కొన్నిప్రాంతాలు అధికంగా స్పందిస్తే, మరికొన్ని ప్రాంతాలు తక్కువ క్రియాశీలంగా ఉంటాయి. దీనివల్ల ప్రతికూల ఆలోచనలు ఎక్కువ కాలం కొనసాగడం, భావోద్వేగ నియంత్రణ కష్టం కావడం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితి చికిత్సా విధానాలపై కూడా ప్రభావం చూపుతోంది. యాంటీడిప్రెసెంట్ మందులు కొందరికి ప్రయోజనం కలిగించినప్పటికీ, అందరికీ సమానంగా పనిచేయకపోవడానికి ఇదే కారణంగా భావిస్తున్నారు. అందుకే, ఇప్పుడు పరిశోధకులు మెదడు నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకున్న చికిత్సలను పరిశీలిస్తున్నారు. అందువల్ల ఆధునికశాస్త్రం ఇప్పుడు నిరుత్సాహాన్ని మెదడులో రసాయనాల అసమతుల్యత అనే ఒకే సిద్ధాంతం ద్వారా కాకుండా, మెదడు నెట్‌వర్క్‌ల సమతుల్యతలో వచ్చే మార్పులుగా చూడడం ప్రారంభమైంది. ఈదృక్పథం వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన, సమగ్ర, ప్రభావవంతమైన మానసిక ఆరోగ్య చికిత్సలకు మార్గం చూపుతోంది.

## పెండింగ్ సమస్యల పరిష్కారానికి సమ్మెకు సిద్ధం

సీతారామయ్య, రాజ్‌కుమార్ పిలుపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ సమ్మెపై ఇతర కార్మిక సంఘాలతో కూడా చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఏడు నెలలుగా కార్మిక సమస్యలను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. స్ట్రక్చర్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదని, మెడికల్ బోర్డు నిర్వహణ లేక కార్మికులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మారుపేర్లు, విజిలెన్స్ కేసుల డిపెండెంట్లకు ఉద్యోగాల విషయంలో యాజమ్యాం జాప్యం చేస్తోందని ఆరోపించారు. సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ టాక్స్ యాజమాన్యం భరించాలి, కొత్త గనులు ప్రారంభించాలి, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలి, డిస్మిస్ కార్మికులకు మరో అవకాశం ఇవ్వాలి తదితర అన్ని డిమాండ్లపై మొదటి వారంలోగా చర్చించి పరిష్కారం చూపాలని, లేకపోతే రెండో వారంలో సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె తేదీ ప్రకటిస్తామని నాయకులు హెచ్చరించారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ , కోశాధికారి ఎస్.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## హామీలు విస్మరిస్తే తిరుగుబాటు తప్పదు

మహిళా సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి లతాదేవి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తే పాలకులపై తిరుగుబాటు తప్పదని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొణిజర్ల మహిళా గ్రామశాఖ మహాసభ మార్కపూడి రమాదేవి అధ్యక్షతన కొణిజర్లలో ఆదివారం జరిగింది. ఈ సభలో లతాదేవి మాట్లాడుతూ అర్హులైన మహిళలకు పెన్షన్లు రాక, ఇందిరమ్మ ఇండ్లు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిరుపేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న వైరా పట్టణంలో మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా 22వ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా గ్రామశాఖ అధ్యక్షురాలిగా మరియమ్మ, ప్రధాన కార్యదర్శిగా మార్కపూడి రమాదేవితోపాటు 17 మంది కమిటీని ఎన్నుకుంది. మహాసభలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాళ్లు చల్లా నాగమణి, సువార్త, పద్మ, కొణిజర్ల మాజీ ఉపసర్పంచ్ గొడ్డుగొర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యం, ఉపాధి కోసం పోరాటాలు

ఎఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పన కోసం ఎఐవైఎఫ్ నిరంతరంగా పోరాటాలకు సిద్ధం కావాలని, పాలక పక్షాలు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టి ఉద్యమించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సిపిఐ బద్దం ఎల్లారెడ్డి భవన్ ముందు ఏర్పాటు చేసిన ఎఐవైఎఫ్ పతాకాన్ని పంజాల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ యువజన వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎఐవైఎఫ్ కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఎఐవైఎఫ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పైడిపల్లి రాజు, ఎఐఎస్‌ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఎఐవైఎఫ్ నగర ఉపాధ్యక్షుడు పినమల్ల భాస్కర్, బి రమేష్ హేమంత్, శ్రీనివాస్ నాయక్, బీర్ల పద్మ కటిక రెడ్డి బుచ్చన్న, లక్ష్మి, శ్రావణి, స్వాతి, అఖిల, బోయిన విష్ణు, తిరుమల్, సందీప్, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

**భూపాలపల్లి :**నిరుద్యోగ సమస్యలపై యువత ఉద్యమించాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి పల్లి కృష్ణ,మాజీ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి క్యాతరాజు సతీష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మెర రమేష్ చారి, జిల్లా నాయకులు మురహరి శ్రీనివాస్, జుబేర్, సమీర్, అనిల్, అశోక్, అరుణ్, యాకుబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్‌లో...

**ఖమ్మం అర్బన్ :** ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను జిల్లా ఇంచార్జి కొండపర్తి గోవిందరావు ఆవిష్కరించి మాట్లాడుతూ ఉపాధి, విద్య, ఆరోగ్యం హక్కులు సాధించే వరకు యువత పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానాబాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మల్లెబోయిన ఉపేందర్, చింతల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్, ఉపాధ్యక్షులు ఉపేందర్, కిరణ్, ఉపేందర్ పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** ఉపాధి, విద్య,ఆరోగ్యం హక్కులు సాధించే వరకు ఎఐవైఎఫ్ పోరాటం చేస్తుందని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆరెపల్లి మానస్ కుమార్ తెలిపారు. ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి మాచర్ల అంజి, చంద్రగిరి ప్రశాంత్, సునీల్, అస్లాం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** శాస్త్రీయ విద్య, ఉపాధి గ్యారెంటీ కోసం యువత నిరంతరం పోరాడాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. ఫహీమ్ అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫహీమ్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఎఐవైఎఫ్‌పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయకార్యదర్శి ఖయ్యూమ్, రౌతో సురేష్, రణధీర్, కొంచెర్ల రాకేష్ నాదీమ్, కమల్, కొయ్యడ రవి, నాగరాజు, వినయ్, వంశీ, సంజయ్, శ్రీకాంత్, సన్నీ, అశ్రఫ్, చిన్ను, దుర్గ, శివ, హుజఫా అన్వేష్, సెల్వార్ స్టార్ తదితరులు పాల్గొన్నారు.

**మోటకొండూర్ :** భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎఐవైఎఫ్ మోటకొండూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోట్టిపాముల సునిల్, బీరకాయల మధు అన్నారు. మోటకొండూరు మండల కేంద్రంలో ఎఐవైఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎఐవైఎఫ్ జండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి ఆలేటి బాలరాజు, జివికెలపల్లి పాండు, ఎఐవైఎఫ్ నాయకులు ఆడేపు నరేష్, నరసింహ, గణేష్, ఆలేటిసాయి, గడ్డం శీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జంకి :**ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాలని ఎఐవైఎఫ్ జిల్లా మాజీఅధ్యక్షులు బోనగిరి రూపేష్ నిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలను మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి కట్కూరి బాలమల్లు, నాయకులు రొడ్డ చరణ్, దుగ్యని తిరుపతి, రవి, కొమురయ్య, నవీన్, రాజు, సురేష్ తిరుపతి పాల్గొన్నారు.

**మునుగోడు:** ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో యువజన సంఘం జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, నాయకులు చాపల శ్రీనివాస్, చాపల విప్లవ కుమార్, బద్దుల శశి, అందుగుల మహేష్, మందుల పాండు తదితరులు పాల్గొన్నారు.


పెద్దపల్లిలో...


యాదాద్రి..మోటకొండూరులో...



భూపాలపల్లిలో...


భద్రాద్రిలో...


సిద్దిపేట..బెజ్జంకిలో...


ఖమ్మంలో...


నల్లగొండ..మునుగోడులో...




## హక్కుల కోసం సంఘటిత పోరాటం

నిరుద్యోగ సంక్షోభంపై సమగ్ర విధాన మార్పులు రావాలి

ఎఐవైఎఫ్ మాజీ నేత బొమ్మగాని శ్రీనివాస్ పిలుపు

**ప్రజాపక్షం/సూర్యాపేట** : దేశ యువత హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని,ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఏఐవైఎఫ్ మాజీ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ధర్మబిక్షం భవన్ వద్ద జెండా ఆవిష్కరణఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పోరాట దినంగా పరిగణిస్తూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్మబిక్షం భవన్ వద్ద ఏర్పాటు చేసిన యువజన సంఘ జెండాను మాజీ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్ ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు బూర సైదులు,ఎడెల్లి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ నిరుద్యోగ సంక్షోభంపై సమగ్ర విధాన మార్పులు రావాలన్నారు.సామ్యవాద ఆలోచనల వ్యాప్తి,యువతను సామాజిక మార్పు దిశగా నడిపించడం ఏఐవైఎఫ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.దేశ యువత తీవ్ర నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందని,ప్రభుత్వ నియామకాలు తగ్గడం,ప్రైవేటీకరణ,కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరగడం యువతను అస్థిరతలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు,ప్రభుత్వ ఖాళీల భర్తీ, ఉచిత నాణ్యమైన ఉన్నత విద్య,ఫీజుల నియంత్రణ,నిరుద్యోగ భృతి,మెంటల్ హెల్త్ సపోర్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ నాయకులు బూర వెంకటేశ్వర్లు,చామల అశోక్ కుమార్,నీలా శ్రీనివాస్,పట్టణ గౌరవ అధ్యక్షులు కుక్కడపు శౌరి,కప్పల రాము,బీసు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు ఎస్‌పి పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేట** : నీట్ పరీక్షల సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని పరీక్షా కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఐపీఎస్ ఆదివారం పరిశీలించారు.పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా కళాశాలల్లో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ ఏజెన్సీ నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రత కల్పించామని,పరీక్ష సామాగ్రి, పత్రాల తరలింపులో అధికారులతో సమన్వయం చేసుకుని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని,ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకుని సిబ్బందిని నియమించామని చెప్పారు.ఆయన వెంట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య,పరీక్ష నిర్వహణ అధికారులు ఉన్నారు.

## 1985 మంది హాజరు

నీట్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్,ఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తనిఖీ చేశారు.రామగిరిలోని మహిళా డిగ్రీ కళాశాల కేంద్రాన్ని కలెక్టర్, ఎస్‌పి సంయుక్తంగా తనిఖీ చేయగా,మహాత్మా గాంధీ యూనివర్సిటీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.పరీక్ష ఏర్పాట్లు, హాజరు వివరాలను చీఫ్ సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకుని,పరీక్ష సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షకు మొత్తం 2038 అభ్యర్థులకు 1985 హాజరుకగా 53 మంది అభ్యర్థులు గైర్హాజరైరు.


## తాటి చెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడి మృతి

మోకు చిలుకట్టు ఊడిపోవడంతో ప్రమాదం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మండలంలోని కాసరాబాద్ గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు పోలగాని శ్రీనివాస్ (47) తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు.ఆదివారం ఉదయం రోజూలాగే కల్లు గీసేందుకు కాసరాబాద్ నుంచి వెదురవారిగూడెం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కొల్లు శివయ్య పొలంలోని తాటిచెట్టు ఎక్కాడు.కల్లు గీస్తుండగా ఉదయం 6:30 గంటలకు మోకు చిలుకట్టు ఊడిపోవడంతో చెట్టు మొదట్లో కిందపడ్డాడు. ప్రమాదంలో ముఖం,చేతులు,కడుపులో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.మృతునికి భార్య వసంత,ఒక కుమారుడు,ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య పోలగాని వసంత ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఎల్.పాండు నాయక్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం ధ్వంసం



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** మండల పరిధిలోని తోటిపేట తండాలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు,ఉరుములు, మెరుపులతో కూడిన అకాల చిరుజల్లులు కురిశాయి.అనుకోకుండా వచ్చిన ఈదురు గాలులకు ఐకేపీ సెంటర్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు టార్పాలిన్లు,పట్టాలతో పరుగులు తీశారు.బలమైన గాలుల ధాటికి గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం ధ్వంసమైంది.సుమారు అరగంటపాటు వీచిన ఈదురు గాలులు,ఉరుముల తర్వాత వాతావరణం శాంతించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

# కల్లాల్లో ధాన్యం.. రైతు కళ్లల్లో నీళ్లు



నకిరేకల్ మండలంలో రాలిన మామిడి,నిమ్మ కాయలు..కూలిన కరెంటు స్తంభాలు... విరిగిన చెట్లు...ఊడిపోయిన షాపుల బోర్డులు

నిడమనూరులో విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

పలు కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దైన ధాన్యం... రైతుల ఆవేదన

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి


ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల



**ప్రజాపక్షం/నకిరేకల్** : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షం,వడగండ్ల వానతో జనజీవనం అస్తవ్యస్తమైంది.పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచింది. చెట్లు విరిగిపడ్డాయి.మామిడికాయలు నిమ్మకాయలు రాలిపోయాయి.దుకాణాల బోర్డులు ఊడిపడ్డాయి. కరెంటు స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకుని ఊరట పొందుదామనుకున్న రైతులకు మరోసారి కష్టాలే మిగిలాయి. వారాలుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాపలా కాస్తున్నా తూకం ఆలస్యం,లారీలు లేక ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఒకపక్క తరుగు,నిలువ,తేమ పేరుతో కోతలు.. మరోపక్క లారీ డ్రైవర్ల కమిషన్లు.. ఇప్పుడు అకాల వర్షంతో ధాన్యం తడవడంతో నష్టాలు మరింత పెరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు.ఆదివారం మండలంలోని చందుపట్ల గ్రామంలోని ఐకేపీ సెంటర్‌లో నిల్వ ఉంచిన ధాన్యం అకాల వర్షం కారణంగా తడవడంతో ఆయన పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధా న్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులతో మాట్లాడారు.ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, రైతులకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,చందుపట్ల సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి.నాయకులు నకరేకంటి ఏసు పాదం, లింగాల వెంకన్న,పొన్నాల రాఘవరెడ్డి యాసరాపు వెంకన్న, రంగారెడ్డి,ముఖ్య కార్యదర్శి శీలం నాగరాజు,శ్రీను రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



**ఈదురు గాలులకు నష్టం.. బాధితులకు పరామర్శ**

పట్టణంలోని చీమలగడ్డ ప్రాంతంలో ఈదురు గాలుల కారణంగా ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరి పోవడంతో నష్టం వాటిల్లిన కుటుంబాలను ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం పరామర్శించారు. బాధితులకు తక్షణ సాయం అందజేసి,సహాయ చర్యలు చేపట్టాలని అధి కారు లను ఆదేశించారు. ప్రభుత్వం తరఫున అవసర మైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

**తుంగతుర్తి:**తుంగతుర్తి మండలంలో సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో అకస్మాత్తుగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంటపాటు కురిసిన వానకు ప్రజ లు ఇబ్బంది పడ్డారు. మండలంలోని పలు ఐకేపీ సెంటర్లలో ఆరబోసిన రైతుల ధాన్యం మొ త్తం తడిసిముద్దయింది. ధాన్యం మొలకెత్తి పూర్తిగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిడమనూరు**: వడగండ్లు ఈదురు గాలుల తో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం కాసేపు అతలాకుతలం చేసింది, ఈదురుగాలుల బీభత్సానికి పలు చోట్ల విద్యుత్ స్తంభాలు భారీ వృక్షాలు విరిగిపడ్డాయి,పలుచోట్ల పూరి గుడిసెలు కూలి పోయి గృహస్తులు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో రాశులు పోసిన ధాన్యం గాలికి పట్టాలు ఎగిరిపోవడంతో వర్షానికి తడిసి ముద్దయ్యాయి. దాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగార్జునసాగర్ నల్లగొండ ప్రధాన రహదారిపై పలుచోట్ల రహదారిపై చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోగాలకు తీవ్ర అంతరాయం కలిగింది. మండల పరిధి మారుపాక వద్ద విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం ఎంతో పాటు రాశులు పోసి కప్పిన పట్టాలు కప్పినప్పటికిని ఈదురుగాలులకు పట్టాలు ఎగిరిపోవడంతో ధాన్యం తడిసి ముద్దాడడంతో రైతులు కంటతడి పెట్టుకున్నారు. నిడమనూర్ మార్కెట్ యార్డ్ ఆవరణలో భారీ చెట్లు విరిగిపడడంతో ధాన్యం అరబోసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.







## మనిషికి గొప్ప సంపద ఆరోగ్యమే

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి :ఎస్‌పి

నల్లగొండలో ఘనంగా 2కె,5కె,10కె రన్

వెయ్యి మందికి పైగా పాల్గొన్న ప్రజలు




**ప్రజాపక్షం/నల్లగొండ**: మనిషికి ఆరోగ్యమే గొప్ప సంపద అని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.శారీరక, మానసిక దృఢత్వం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం,ఆరోగ్యం పట్ల ప్రజలలో అవగాహన కల్పించే నిమిత్తం సొసైటీ ఫర్ తెలంగాణ రన్ ఆధ్వర్యంలో అవంతిక కన్స్ట్రక్షన్స్,ఆరోగ్య హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానం నుంచి ఏర్పాటు చేసిన 2కె,5కె,10కె రన్‌లను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి రన్‌లు నిర్వహించడం సంతోషమని అన్నారు.త్వరలోనే అంతర్జాతీయ యోగా దినోత్సవం రానుందని,ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని,అప్పుడే మన పనులు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్వర్తించుకోగలుగుతామని చెప్పారు.సమాజంలోని ప్రజలందరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా ఉండటమే ముఖ్య ఉద్దేశమని, అలాంటి భావనను ప్రజల్లో తీసుకొచ్చేందుకు ఇలాంటి రన్‌లు ఉపయోగపడతాయని అన్నారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ఆరోగ్యం విషయమై రన్ లాంటి కార్యక్రమాలు జిల్లాలో మరిన్ని నిర్వహించాలని కోరారు.ప్రతి మనిషి జీవితంలో శారీరక, మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండాలని,రోజువారీ కార్యక్రమంలో దీన్ని అలవాటు చేసుకోవాలని,రాష్ట్ర,జాతీయ స్థాయిలో ఇలాంటి కార్యక్రమాల ద్వారా నల్లగొండ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.సొసైటీ ఫర్ తెలంగాణ ప్రతినిధి మగ్గారి శ్రీనివాసరావు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి బండారు ప్రకాష్, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ రమేష్, అనితారాణి,డిఎస్‌పి కె.శివరామిరెడ్డి,ఇతర అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.



## పల్లెపహాడ్‌లో అగ్ని ప్రమాదం బాధితులను ఆదుకోవాలి

సిపిఐ నాయకుల డిమాండ్

నష్టం వాటిల్లిన పామాయిల్ తోట పరిశీలన

**ప్రజాపక్షం/నల్లగొండ (నార్కట్‌పల్లి ):** పల్లెపహాడ్‌లో గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చెలరేగిన అగ్నిప్రమాదం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఒక్కసారిగా వ్యాపించిన మంటలకు ఏళ్ల తరబడి సాగుచేస్తున్న పామాయిల్ తోటలు బూడిదపాలయ్యాయి. పొలాలకు నీరందించే విద్యుత్ మోటర్లు, పశువులకు నిల్వ ఉంచిన గడ్డివాములు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లోడంగి శ్రవణ్ కుమార్ ఆదివారం సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్,నాయకులు సంగిశెట్టి శ్రీనివాస్, ఆలకుంట్ల నరసింహ,శీలోజు వెంకటయ్య,మంటిపల్లి మల్లయ్యతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.కాలిపోయిన పామాయిల్ చెట్లు, మోటర్లు, గడ్డివాములను చూసి బాధిత రైతులను పరామర్శించారు.ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఒక్కొక్క రైతు 5 నుంచి 8 ఏళ్లుగా పామాయిల్ తోటను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.ఇప్పుడు చెట్టుకు కాస్త ఫలితం వచ్చే సమయంలో మొత్తం కాలిపోయింది. ఒక్కో ఎకరాకు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారు.మోటర్లు కాలిపోవడంతో తక్షణం నీరు పెట్టే పరిస్థితి లేదు.గడ్డివాములు కాలిపోవడంతో పశువులకు మేత కరువైంది. మొత్తంగా ఒక్కో రైతు రూ.3 నుంచి 5 లక్షల వరకు నష్టపోయారు అని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరిపి బాధితులకు తక్షణ నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.పంట నష్టం,మోటర్ల నష్టాన్ని పూర్తిగా అంచనా వేసి ఎకరాకు నష్టపరిహారం చెల్లించాలని, కాలిపోయిన మోటర్ల స్థానంలో కొత్త మోటర్లు మంజూరు చేయాలని కోరారు. వేసవిలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో అగ్నిమాపక అవగాహన కల్పించాలని, ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.రెవెన్యూ,వ్యవసాయ,ఉద్యాన శాఖల అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక సిద్ధం చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతామని శ్రవణ్ కుమార్ హెచ్చరించారు.

## తక్షణమే ప్రజా నాట్యమండలి కళాకారులకు గుర్తింపు కార్డులు

తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్ డిమాండ్




**ప్రజాపక్షం/భువనగిరి** : ప్రజా నాట్యమండలి కళాకారులకు గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ప్రజానాట్య మండలి యాదాద్రి భువనగిరి జిల్లా సమితి సమావేశం భువనగిరిలోని సిపిఐ కార్యాలయంలో బుష్పాక నరసింహ అధ్యక్షత నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ కళాకారుల హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళాకారుల గుర్తింపు కార్డుల కోసం మీ సేవ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి సంబంధిత అధికారుల సంతకాలతో గుర్తింపు కార్డులు త్వరితగతిన జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మే 20న ఆలేరు పట్టణంలో తెలంగాణ ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా మూడో మహాసభ నిర్వహించబడనున్నదని తెలిపారు. ఆ మహాసభలో అన్ని మండలాల నుండి కళాకారులు, మండల కమిటీ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మే 25, 26 తేదీలలో హైదరాబాద్లో నిర్వహించబడనున్న తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలను కూడా విజయవంతం చేయాలని కోరారు. అలాగే సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి కళ కళ కోసం కాదు, ప్రజల కోసం అనే నినాదంతో పనిచేస్తున్న కళాకారులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అన్నారు. కళాకారులకు పెన్షన్, ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, విద్యావైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ మాట్లాడుతూ సమావేశ ఎజెండా అంశాలను వివరించి, రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా కళాకారుల సమస్యలపై ఉద్యమాలను చేపట్టి, వారిని ఐక్యంగా ఒక వేదికపైకి తీసుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పిట్టల శంకర్, కట్ల యాదగిరి, సోమనరసయ్య, చౌదరి, హేమలత, నర్సింలు పాల్గొన్నారు.

## హరీష్ రావుది దొంగ ధర్నా

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధ్వజం

**ప్రజాపక్షం/యాదాద్రి:** సిద్దిపేట రాజీవ్ రహదారిపై మాజీ మంత్రి హరీష్ రావు చేపట్టిన నిరసనపై ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హరీష్ రావు చేస్తున్నవి కేవలం 'దొంగ ధర్నాలు' అని, అధికారం కోల్పోయిన అక్కసుతో రైతులను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హరీష్ రావుకు మెదడు మోకాల్లోకి వచ్చిందని, అందుకే పదేళ్ల కాలంలో తాము చేసిన పాపాలను మర్చిపోయి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో నెలల తరబడి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కల్లాల్లోనే వడ్లు మొలకెత్తిన విషయాన్ని రైతులు ఇంకా మర్చిపోలేదని, ఆనాడు రైతులు పడ్డ గోసకు ఫలితంగానే బీఆర్ఎస్ నేతలకు ప్రజలు బుద్ధి చెప్పి ఇంట్లో కూర్చోబెట్టారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతన్నలకు పెద్దపీట వేస్తోందని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 8 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి గింజనూ సేకరిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తూ ఇప్పటి వరకు రూ.3,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని, రూ.2 లక్షల రుణమాఫీతో రైతులకు అండగా నిలిచామని వివరించారు. కేసీఆర్ ఫామ్ హౌస్ లో కూర్చుని రైతులను రెచ్చగొడుతుంటే, హరీష్ రావు రోడ్లపైకి వచ్చి నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ఈ దొంగ ధర్నాలకు పాల్పడుతున్నారని, హరీష్



రావుకు సిగ్గు, శరం ఉంటే తక్షణమే ఇలాంటి రెచ్చగొట్టే చర్యలు ఆపాలని బీర్ల అయిలయ్య హితవు పలికారు.

## డివిజన్ స్థాయిలో 'ప్రజావాణి'

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు ఆదివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నుండి నిర్మల్ ఆర్‌డిఓ కార్యాలయం, భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రజావాణితో పాటు, ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్‌పేర్కొన్నారు. డివిజన్ స్థాయి అధికారులు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. భూ భారతి, భూ వివాదాలు, విద్యా, వైద్యం, పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇతర పౌర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. అందిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

## నేటి నుండి రైతు వారోత్సవాలు

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండలంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో సోమవారం నుండి రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రతువేదికల్లో రైతుసభలు మే 49 వరకు నిర్వహించబడుతుతుండన్నారు.ఈ సభలకు శాస్త్రవేత్తలు వివిధ శాఖల అధికారులు వచ్చి రాబోయే వానకాలం సీజన్‌పై సలహాలు, నేల ఆరోగ్య పరిరక్షణ, సమతూల్య ఎరువుల యాజమాన్యం ప్రకృతి వ్యవసాయంపై వినియోగదారులు కోరుకునే సన్న, వరి రకాల సాగుపై అవగాహన కలిపస్తారన్నారు. రైతులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నిరుద్యోగ సంక్షోభం..

## విధానాలపై మార్పులు అవసరం




ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్: నిరుద్యోగ సంక్షోభంపై సమగ్ర విధాన మార్పులు అవసరమని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. ఆదివారం ఎఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ బంగ్లా వద్ద గల భగత్‌సింగ్ విగ్రహం ముందు ఆయన సంఘ జెండాను ఎగురవేశారు. దేశంలో నిరుద్యోగం దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే సంక్షోభంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియామకాలు తగ్గించి ప్రైవేటీకరణను ప్రోత్సహించడం వల్ల యువత అస్థిరతకు గురవుతోందన్నారు. భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్య, ఉపాధి హక్కుల కోసం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ నాయకులు హరీష్, రాజు, ప్రవీణ్, నారాయణ, యోహేష్, బాలు, నగేష్ పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనం అగ్నికి ఆహుతి



ప్రజాపక్షం / ఖానాపూర్ : ఖానాపూర్ మండలం పాత తర్లపాడ్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనానికి ఆదివారం నిప్పు అంటుకుంది. దీంతో అక్కడున్న చెట్లు, మొక్కలు, కాలిపోగా నర్సరీ మొక్కలు మొలక దశల్లోనే అగ్నిదాటికి గురయ్యి మొలకెత్తకుండా పోయాయి. సమీపాన అడవిలో అగ్ని రాజుకుని క్రమక్రమంగా పల్లె ప్రకృతి వనానికి అంటుకుంది. పల్లె ప్రకృతి వనంలో మంటలు చెలరేగుతున్నప్పటికీ విబిజి రాం జీ సిబ్బంది , స్థానికులు, గ్రామస్థులు గుర్తించకపోవడంతో మొక్కలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ప్రభుత్వం అంతలా నిధులు కేటాయించి పల్లె ప్రకృతి వనం పేరిట పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు తీసుకొచ్చిన కార్యక్రమాన్ని అధికారులు నిర్వీర్యం చేయడం విమర్శలకు దారితీస్తుంది.అధికారుల సమన్వయ, పర్యవేక్షణ లోపం మూలాన వేలాది మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి.

## అర్హులైన వారికి సంక్షేమ..

## పథకాలు అందేలా కృషి



ప్రజాపక్షం / భైంసా : ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సహకారంతో అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించేందుకు పాటుపడతానని దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉందన్నారు. ప్రతి పేదవాడికి స్వంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ళలో ఒక్కరికి ఇల్లు నిర్మించి ఇవ్వలేదన్నారు. అర్హులందరికి దశల వారిగా ఇండ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. నరేశ్ముదిరాజ్, పొల్కం కవిత ముదిరాజ్, లక్కడి ఆనంద్ ముదిరాజ్, అయిండ్ల మోహన్ రెడ్డి పెద్దలు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో ఉద్యోగాల

## నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రజాపక్షం/ఉట్నూర్: ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో ఆదివారం గిరిజన నిరుద్యోగులు సమావేశమయ్యారు. జీవో నెంబర్ 3ని పునరుద్దరించాలని, ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి జాధవ్ సుమేష్ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వయోపరిమితి 46 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'అన్నదాతకు 'నకిలీ' ముప్పు'...

# నిమ్మకు నీరెత్తిన నిర్మల్ యంత్రాంగం



ప్రజాపక్షం / నిర్మల్ : వానాకాలం వ్యవసాయ సీజన్ ముంచుకొస్తున్న తరుణంలో నిర్మల్ జిల్లాలో నకిలీ విత్తనాల దందాపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా శూన్యంగా మారింది. కాగితాల మీద టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు, సరిహద్దుల వద్ద కఠిన నిఘా అంటూ గొప్పగా ప్రకటనలు గుప్పిస్తున్న జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో తనిఖీలను మాత్రం గాలికొదిలేసింది. అధికారుల ఈ ఉదాసీనత అక్రమ వ్యాపారులకు వరంగా మారగా, అమాయక రైతన్నలు మరోసారి మోసపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉందని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

### కాగితాలకే పరిమితమైన తనిఖీలు..

నిర్మల్ జిల్లాలోని భైంసా, ఖానాపూర్, నిర్మల్ వంటి ప్రధాన వ్యాపార కేంద్రాల్లో నకిలీ విత్తనాలు 'పాముకింద నీరులా' విస్తరిస్తున్నాయి. గతంలో భైంసా ప్రాంతంలో నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల తయారీ అడ్డాలు బయటపడిన చేదు అనుభవాలు ఉన్నప్పటికీ, అధికారులు ఇప్పటి వరకు ఒక్క విత్తన దుకాణంలో కూడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 474 రిటైల్ లైసెన్స్ కలిగిన విత్తన హోల్డర్లు ఉన్నప్పటికీ, నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలను పరిక్షించే నాథుడే కరువయ్యారు. 10వ తరగతి ఫలితాల విడుదల మరియు ఇతర పరిపాలనా పరమైన విధులను సాకుగా చూపుతూ విత్తన నిఘాను విస్మరించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. పక్కనే ఉన్న ఇతర రాష్ట్రాల సరిహద్దుల నుండి నాసిరకం మరియు నిషేధిత విత్తనాలు యథేచ్ఛగా జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. సరిహద్దులో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నా, తనిఖీలు నామ మాత్రంగానే సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పత్తి, మిర్చి విత్తనాల కొనుగోలు కోసం రైతులు దుకాణాలకు వస్తుండగా, అదే అదనుగా అనాధికారిక విక్రేతలు రంగంలోకి దిగి తక్కువ ధరకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపుతున్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అనుమతించని హెచ్ టి (జన్యుమార్పిడి) పత్తి విత్తనాలను రైతులకు అంటగట్టేందుకు దళారులు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ఈ విత్తనాల వల్ల పర్యావరణానికి ముప్పు కలగడమే కాకుండా, దిగుబడి రాక రైతు ఆర్థికంగా చితికిపోయే అవకాశం ఉంది.

### మేల్కొకుంటె అన్నదాతకు కన్నీళ్ళే !

సాధారణంగా మే నెల ద్వితియార్థం నాటికే తనిఖీలు ముమ్మరం కావాల్సి ఉండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గతంలో నకిలీ విత్తనాల వల్ల పంటలు పండక, పెట్టిన పెట్టుబడి రాక అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు జిల్లాను కలిచివేసాయి. ఇప్పుడైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వదిలి, విత్తన గోదాములపై మెరుపు దాడులు నిర్వహించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లైసెన్స్ లేని సంస్థలు తయారు చేసినవి, సరైన లేబులింగ్ లేని ప్యాకెట్లు గడువు ముగిసిన విత్తనాలు మార్కెట్లో చలామణి కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.అధికాఉలు మండల స్థాయికి వెళ్ళి రైతులకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. సమయం మించిపోకముందే క్షేత్రస్థాయిలో నిఘా పెంచకపోతే, ఈ ఏడాది కూడా అన్నదాతకు భారీ నష్ట తప్పదని రైతు ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

## నేటి నుంచి రైతు వారోత్సవాలు

### మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్ వెల్లడి

ప్రజాపక్షం/ఎడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎడపల్లి మండలంలో ఈ నెల 4వ తేది నుంచి 9వ తేది వరకు రైతు వారం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ది రామేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు రైతు వేదికల వేదికగా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. మే 4న జాన్కంపేట్, ఎడపల్లి రైతు వేదికలో నేల ఆరోగ్య సంరక్షణ, ఎరువుల యాజమాన్యం, వరిలో సన్న రకాల సాగు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, మే 5న బోధన్ నియోజకవర్గ కేంద్రంలో ఉద్యాన పంటల సాగు, ఆయిల్ ఫామ్ విస్తీర్ణం పెంపు, ప్రత్యామ్నయ పంటలపై చర్చ, మే 6న బ్యాంకుల ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక పంట రుణాలు, సహకార సంఘాలు, ఎఫ్‌పిఓ ల ద్వారా సేవలు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన, మే 7న విద్యుత్ శాఖ, పీఎం కుసుం పథకంపై అవగాహన, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ల ప్రదర్శన, మే 8న పశు సంవర్ధక మత్స్య, నీటి పారుదల శాఖల ఆధ్వర్యంలో రైతులకు సదుస్సులు, మే 9న గ్రామ పంచాయతీల పరిధిలో చెరువుల్లో గుర్రపు డెక్క, కంప చెట్ల తొలగింపు, నీటి వినియోగంపై అవగాహన కార్యాలయాల శుభ్రత తదితర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని ఏఓ తెలిపారు. మండలంలోని రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించి, ఈ రైతు వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## నిర్మల్‌లో 'ప్రత్యేక విద్యా వారోత్సవాలు'

ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : జిల్లాలో ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో "ప్రత్యేక విద్యా వారోత్సవాల"ను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి దర్శనం భోజన్న ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించబడే ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.సెన్సెస్ ఎనిన్యూమరేషన్ డ్యూటీలో ఉన్నారని, అదే విధంగా 10వ తరగతి ఫలితాల విడుదల నేపథ్యంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విధులకు హాజరవుతున్నారని ఆయన గుర్తు చేశారు. నిర్వహణకు ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల వారిగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని వారోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించాలని డిఇఓ భోజన్న కోరారు.

## నిజామాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్



ప్రజాపక్షం/ నిజామాబాద్ : జిల్లా కేంద్రంలో నీట్ యుజీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగింది. విద్యార్థులు ఉదయమే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నీట్ పరీక్షకు గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో సీపీ సాయితచైన్య తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడున్న పోలీసు సిబ్బందికి సూచనలు, సలహాలు చేవారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు స్టేషనరీ దుకాణాలను మూసివేయించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లకుండా ఆయా పరీక్ష కేంద్రాల సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. నీట్ పరీక్షకు నిమిషం నిబంధన ఉండటంతో విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. నీట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమై 5 గంటలకు ముగిసింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు రెండు , మూడు గంటలు ముందుగానే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 3334 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3227 పరీక్షకు హాజరయ్యారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదనే నిబంధన ఉండటంతో విద్యార్థులు పరీక్ష ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు.


## అంబంలో వైభవంగా గంగాదేవికి బోనాలు



ప్రజాపక్షం/ఎడపల్లి: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని అంబం గ్రామంలో గంగాదేవి అమ్మవారి బోనాల ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గత మూడు రోజుల క్రితమే అంబం గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగాదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా పూర్తైంది. గ్రామ ఆనవాయితీ ప్రకారం.. ప్రతిష్టాపన జరిగిన అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆచారంగా వస్తుంది. ఆదివారం ఉదయం నుంచే గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆదివారం కావడంతో గంగపుత్ర సంఘం సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలు కొత్త కుండలను అలంకరించి, నైవేద్యంతో కూడిన బోనాలను తలపై మోస్తూ మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. గంగాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాన్ని సమర్పించారు. తమ వృత్తి నైపుణ్యం మెరుగు పడాలని, గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలని భక్తులు వేడుకున్నారు. విగ్రహ ప్రతిష్టాపన ముగిసిన తదుపరి జరిగిన ఈ మొదటి బోనాల ఉత్సవం కావడంతో గంగపుత్రుల కుటుంబాల్లో పండుగ వాతావరణం కన్పించింది. అంబం గ్రామ వీధులన్నీ మారుమోగాయి. గంగపుత్ర సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థి చేతిలో పేలిన బ్యాటరీ

### తెగిపడిన ఎడమచేతి వేళ్లు



ప్రజాపక్షం/శివ్వంపేట : మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రమైన శివ్వంపేటలో ఓ విద్యార్థి చేతిలో బ్యాటరీపేలి చేతి వెళ్లు తెగిపడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం శివ్వంపేటకు చెందిన రాజిపేట శివతేజ 4వ తరగతి చదువుతున్నాడు. సమ్మర్ కావడంతో స్థానికంగా ఓ దుకాణంలో చిన్న బ్యాటరీ కలిగిన ఫ్యాన్‌ను కొనుగోలు చేసి ఉపయోగిస్తుండగా ఒక్కసారిగా ఇంట్లో పేలింది. పేలుడు ధాటికి విద్యార్థి ఎడమచేతి నాలుగు వేళ్లు ఛిద్రమయ్యాయి. వెంటనే కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## నిర్మల్‌లో 150 ఏళ్ళనాటి 'మోడీ లిపి' వెలుగులోకి



ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో చారిత్రక ప్రాధాన్యత కలిగిన అరుదైన మోడీ లిపి దస్తావేజులు బయల్పడ్డాయి. ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావు సుమారు 150 ఏళ్ళనాటి ఒక ఫర్మానాను సేకరించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తెలంగాణ మరియు మహారాష్ట్ర ప్రాంతాల సామాజిక, రాజకీయ చరిత్రలో మోడీ లిపికి ఉన్న విశిష్టతను వివరించారు. చారిత్రక నేపథ్యం మరియు ప్రాముఖ్యత 13వ శతాబ్దంలో దేవగిరిని పాలించిన యాదవ రాజుల కాలంలో మంత్రిగా పనిచేసిన హేమాద్రి పండితుడు (మేమాడ్‌పంత్) దర్బారుల్లో రహస్య భాషగా ఉపయోగించడానికి ఈ లిపిని అభివృద్ధి చేశారని పరిశోధకులు చెబుతున్నారు. మరాఠీ భాషకు అనుబంధంగా ఉన్న ఈ లిపిని గతంలో రాజుల ఆజ్ఞలు, గెజిట్లు, శాసనాలు మరియు భూమి శిస్తు పత్రాలు నమోదు చేయడానికి వినియోగించేవారు. ఛతపతి శివాజీ మహారాజ్ కాలంలో బాలాజీ అనచి చిట్నీస్ ఈ లిపిని సంస్కరించి రాజ్యాంగపరమైన ఆదేశాలను వేగంగా పంపడానికి ఉపయోగించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. శివాజీ మహారాజ్ కంకాపూర్ సందర్భనలో జారీ చేసిన 'సనద్' కూడా ఇదే లిపిలో ఉండటం గమనార్హం.

### గొలుసుకట్టు రాతల విశిష్టత


మరాఠీలోని 'మోడణే' (వంచడం లేదా మడవడం) అనే పదం నుండి 'మోడీ' అనే పేరు వచ్చింది. పెన్నును కాగితం మీద నుంచి ఎత్తకుండా వేగంగా గొలుసుకట్టు రాతలా రాయడం ఈ లిపి యొక్క అతిపెద్ద ప్రత్యేకత. నిర్మల్ జిల్లాలో 1950 వరకు కూడా వాపారస్తులు, కర్ణాలు తమ దస్తావేజులను, వంశవృక్షాలను ఈ లిపిలోనే భద్రపరిచేవారని డాక్టర్ దేవరావు గుర్తు చేశారు.

### అంతరిస్తున్న కళ సంరక్షణకు పిలుపు

ఒకప్పుడు నిర్మల్ జిల్లాలోని అనేక గ్రామాల్లో మోడీ లిపిని చదివేవారు ఉండేవారని, ప్రస్తుతం ఈ విద్య తెలిసిన వారు కనుమరుగైపోవడం ఆందోళనకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో విలువైన శిలాశాసనాలు, ప్రాచీన పత్రాలు ఇప్పటికకే కాల గర్భంలో కలిసిపోగా, ప్రస్తుతం లభిస్తున్న దస్తావేజులనైనా భవిష్యత్తు తరాల కోసం ప్రభుత్వం సేకరించి, భద్రపర్చాల్సిన అవసరం ఉందని డాక్టర్ తుమ్మల దేవరావు కోరారు.

# గ్రామాల్లో 'సమాంతర' సర్కార్!

(విడిసి)ల అరాచక పాలనపై సర్పంచ్‌ల యుద్ధభేరి !
రాజ్యాంగ విరుద్ధంగా ఇసుక దందా.. లు రూ. లక్షల వసూళ్ళు
ఎన్నికైన పాలకులను తొక్కిపెట్టి..''పెద్దమనుషుల'' పెత్తనం !
అధికారం పాలకులది.. పెత్తనం విడిసిలది




ప్రజాపక్షం / సారంగాపూర్ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఓట్లతో ఎన్నికైన సర్పంచ్‌లకు గౌరవం లేకుండా పోతోంది. సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు (విడిసి) వ్యవస్థాగత అరాచకానికి తెరలేపాయి. ఎన్నికైన సర్పంచులను కేవలం ఉత్సవ విగ్రహాలుగా మార్చి, ఈ కమిటీలే సర్వాధికారాలను చెలాయిస్తున్నాయి. గ్రామాల్లో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా, ఏపని చేయాలన్నా సర్పంచ్‌తో సంబంధం లేకుండా వీడిసిలే నిర్ణయించడం ప్రజాస్వామ్యసూర్పిని తుంగలో తొక్కడమేనన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### లక్షల రూపాయల ఇసుక మాఫియా

ఈ కమిటీల అరాచకం ప్రధానంగా ఇసుక దందాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామాల్లోని వాగులు, వంకల్లో ఇసుకను విక్రయించేందుకు పంచాయతీకి ఏ లాంటి సమాచారం లేకుండానే వీడీసి సభ్యులు టెండర్లు వేస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా వస్తున్న లక్షలాది రూపాయల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు లేదా పంచాయతీ ఖాతాకు చేరడం లేదు. ఆ సొమ్మును కమిటీ సభ్యులే పంచుకుంటూ జల్సాలు చేస్తున్నారని, ఇసుక అక్రమాల వల్ల చట్టపరమైన సమస్యలు తలెత్తినప్పుడు మాత్రం సర్పంచులు బలిపశువులవుతున్నారని గ్రామ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అభివృద్ధికి మోకాలడ్డుతున్న సమాంతర పాలన

వీడిసిల పెత్తనం వల్ల గ్రామాల్లో నిజమైన అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీద్వారా జరగాల్సిన పనులకు అడ్డుతగులుతూ,నచ్చిన వారికి కాంట్రాక్టులు వీడిసిలు ఒక రహస్య పాలనను సాగిస్తున్నాయి. ప్రశ్నించిన సర్పంచులను రాజకీయంగా వేధించడం సామాజిక బహిష్కరణల పేరు తో భయపెట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యర్థి వర్గాలకు చెందిన వారు ఈ కమిటీల్లో చేరి అధికార పార్టీ సర్పంచులను పని చేయనివ్వకుండా అడ్డుకోవడంతో గ్రామాల్లో వర్గ పోరు రాజుకుంటుంది. రాజ్యాంగ విరుద్ధంగా నడుస్తున్న ఈ సమాంతర ప్రభుత్వంపై సర్పంచుల సంఘం భగ్గుమంటుంది. ఇసుక టెండర్ల పేరుతో జరిగిన లక్షలాధి రూపాయల వసూళ్ళపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణజరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అసలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక కాకుండానే గ్రామంపై పెత్తం చెలాయిస్తున్న వీడిసిలను రద్దు చేయాలని లేదా వాటిని పూర్తిగా పంచాయతీ ఆధీనంలోకి తీసుకురావాలని గర్జిస్తున్నారు. లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలు దెబ్బతినక ముందే ప్రభుత్వం ఈ వ్యవహారంపై స్పందించాల్సి ఉంది. ఎన్నికైన ప్రజాప్రతినిధుల అధికారాలను హరిస్తున్న వీ డిసిల అక్రమాలకు అడ్డుకట్ట వేయకపోతే, భవిష్యత్తులో స్థానిక సంస్థల వ్యవస్థే కుప్పకూలే ప్రమాదం ఉంది, ఇసుక మాఫియా ముసుగులో సాగుతున్న ఈ అక్రమ రాజ్యానికి స్వస్తి పలికి, సర్పంచ్‌లకు పూర్తి అధికారాలు ఇచ్చేల చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
సోమవారం
04-05-2026
www.prajapaksham.in

'ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 ఇప్పుడు మరో కొత్త సిరీస్ స్ట్రీమింగ్ డేట్‌ను అనౌన్స్ చేసింది. 'మేము 'కాప్'లం'. కామెడీ, మిస్టరీ కలయికగా రూపొందిన ఈ సిరీస్ అందరినీ మెప్పించే కథాంశంతో రూపొందుతోంది. గ్రామీణ నేపథ్యంలో, అక్కడి రోజువారీ జీవితం, ఊహించని గందరగోళం.'

రీల్

## కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో 'బాలన్-ది బాయ్'




గ్రాండ్ ఇయర్ ఫిలిం మేకింగ్‌కు మారు పేరైన కెవిఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మించిన సినిమా 'బాలన్ ది బాయ్'. ఈ చిత్రానికి ఆవేశం ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్‌తో 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహించారు . వెంకట్ కె. నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.'బాలన్' సినిమా ప్రఖ్యాత కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితం కానుంది. ఈ నెల 14న కేన్స్ ఫిలిం ఫెస్టివల్ బిజినెస్ వింగ్ అయిన మార్షడు ఫిలింలో బాలన్ ది బాయ్ స్క్రీనింగ్ జరగనుంది. తమ మూవీ కేన్స్‌లో స్క్రీనింగ్ కానుండటంపై మూవీ మేకర్స్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ చిదంబరం మాట్లాడుతూ కేన్స్ ఫిలిం ఫెస్టివల్ ప్రపంచ సినిమాకు ఇల్లు లాంటిది. ఇక్కడి ప్రేక్షకులు సినిమాను నమ్ముతారు. మా 'బాలన్ ది బాయ్' మూవీ అలాంటి నిజమైన మూవీ లవర్స్ ను హత్తుకుంటుంది. బాలన్ సినిమా చూస్తూ ప్రేక్షకులు అనుభూతికి లోనవుతారు. మనం ఎక్కడినుంచి వచ్చాం, ఎక్కడికి ప్రయాణిస్తున్నాం తెలుసుకోవాలనే తపనతో రూపొందించిన చిత్రమిది. ఇలాంటి భావోద్వేగాలను అనుభవించినా చెప్పేందుకు మాటలు దొరకని వ్యక్తి కోసం ఈ సినిమాను తెరకెక్కించాం. అన్నారు. ప్రొడ్యూసర్ వెంకట్ కె.నారాయణ మాట్లాడుతూ మలయాళ చిత్ర పరిశ్రమ తమ కంటెంట్‌తో ప్రపంచ సినీ ప్రియులను ఆకట్టుకుంటోందన్నారు. ప్రొడ్యూసర్ శైలజా దేశా య్ ఫెన్ మాట్లాడుతూ కేన్స్ ఫిలిం ఫెస్టివల్ అంటే నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టం. నాలుగేళ్ల క్రితం కేన్స్‌కు వచ్చినప్పుడు నెక్స్ట్ టైమ్ నా సినిమాతోనే వస్తానని ప్రామిస్ చేసుకున్నా. ఇప్పుడు 'బాలన్ ది బాయ్'తో కేన్స్‌కు రావడం సంతోషంగా ఉందని అన్నారు. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ నటించారు.

## గోపీచంద్ కొత్త సినిమా షురూ




చిత్రం షూటింగ్ ఆదివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా, తెలంగాణ ఎఫ్‌డిసి చైర్మన్, నిర్మాత దిల్ రాజు కెమెరా స్విచ్‌ఆన్ చేశారు. మైథికల్, యాక్షన్ డ్రామాను ఈ సినిమా తెరకెక్కుతోంది. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా

హీరో టి.గోపీచంద్ వరుసగా ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లతో ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం 'భరత వర్ష' అనే పీరియాడిక్ యాక్షన్ డ్రామా చేస్తున్న ఆయన, ఇప్పుడు తన 34వ చిత్రాన్ని ప్రారంభించారు. ప్రముఖ ఫైట్ మాస్టర్ వి.వెంకట్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాణంలో 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ భారీ బడ్జెట్ యాక్షన్ డ్రామా రూపొందుతోంది. ఈ ఇప్పటికే మంచి పేరు సంపాదించిన వెంకట్, ఈ సినిమాకు ఎపిక్ యాక్షన్ కథను సిద్ధం చేశారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇతర నటీనటుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: వి వెంకట్, నిర్మాతలు: విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి, డీఓపీ: షాందత్ , సంగీతం: సామ్ సి ఎస్, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: రామకృష్ణ–మోనిక.



## 'వేదవ్యాస్ లోగో' ఆవిష్కరణ

ప్రముఖ దర్శకులు ఎస్ వి కృష్ణారెడ్డి తాజాగా తెరకెక్కిస్తున్న చిత్రం 'వేద వ్యాస్'. ఈ చిత్రాన్ని సాయి ప్రగతి ఫిలిమ్స్ బ్యానర్‌పై కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా విజువల్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం ఘట్ కేసర్‌లోని కెపిఆర్ ఐటి విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకలో ఘనంగా జరిగింది. షిరిడి సాయిబాబా విగ్రహానికి నిర్మాత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి కలసి పూజ చేస్తున్న దృశ్యాన్ని బ్యానర్ లోగోలో చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ప్రతాప్ రెడ్డితో పాటు దర్శకులు కృష్ణారెడ్డి, సమర్పకులు అచ్చిరెడ్డి, హీరో పిడుగు విశ్వనాథ్, నటుడు రఘుబాబు, తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ కెపిఆర్ ఐటి విద్యా సంస్థల వైస్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, సెక్రటరీ రాకేష్ రెడ్డి ఈ వేడుకలో పాల్గొన్నారు.

## 8న 'గోదారి గట్టుపైన' రిలీజ్

### మీడియా 'చిట్‌చాట్'లో డైరెక్టర్ సుభాష్ చంద్ర

సుమంత్ ప్రభాస్ హీరోగా తెరకెక్కిన రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన'. సుభాష్ చంద్ర దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం మే 8న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ సుభాష్ చంద్ర మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మాది రేలంగి. మా నాన్నగారు బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్‌య్యారు. నేను బీటెక్ చదువుతున్నప్పటి నుంచే షార్ట్ ఫిలిమ్స్ చేయడం ప్రారంభించాను. దాదాపు 80 షార్ట్ ఫిలిమ్స్ చేసిన తర్వాత చెన్నైలో ఎల్‌వీ ప్రసాద్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో ఫిలిం మేకింగ్ కోర్స్ చేశాను. ఆ తర్వాత ఫీచర్ ఫిలిమ్స్‌లోకి వచ్చాను. నేను ఎక్కువగా రాజ్ తరుణ్‌తో షార్ట్ ఫిలిమ్స్ చేశాను. నేను ఎప్పుడూ ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఒక సినిమా ప్రీప్రొడక్షన్ మొత్తం పూర్తి చేసి షూటింగ్‌కు వెళ్లే సమయానికి ఆగిపోయింది. మరో సినిమా పూర్తయింది కానీ రిలీజ్ కాలేదు. ఆ సినిమా విడుదల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేనికైనా ఒక సమయం రావాలని నేను నమ్ముతాను. ఆ సమయం 'గోదారి గట్టుపైన' సినిమాతో వచ్చిందని భావిస్తున్నాను. ముందుగా సునీల్ నారంగ్, జాన్వి నారంగ్‌కి థాంక్స్ చెప్పాలి. వారే సుమంత్‌ని రిఫర్ చేశారు. వాళ్లు మా ప్రొడ్యూసర్ పార్ట్‌నర్స్. సుమంత్‌కు కథ చెప్పగానే ఆయనకి చాలా నచ్చింది. ఇది ఆయనకు పర్ఫెక్ట్‌గా సరిపోయే కథ. ఈ సినిమాలో సుమంత్ గోదావరి అబ్బాయి పాత్ర. గోదారి యాసను పర్ఫెక్ట్‌గా పలికారు. అందుకోసం చాలా ట్రైనింగ్ తీసుకున్నారు. ఈ కథ మన జీవితాల్లో చూసినదే. ప్రతి ఇంట్లో తండ్రి–కూతురు ఉంటారు, వారి మధ్య ప్రేమ ఉంటుంది. అలాగే ఇద్దరు ప్రేమికుల మధ్య ప్రేమ కూడా ఉంటుంది. ఈ రెండింటినీ ట్రయాంగిల్ ఫార్మ్‌లో చూపించాను. సినిమా అందరూ రిలేట్ చేసుకునేలా ఉంటుంది. తప్పకుండా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాలో జగపతిబాబు పాత్ర మా బాబాయి పాత్ర నుంచి ఇన్‌స్పిరేషన్‌తో రాసుకున్నాను. సినిమాలో ఆయన వాడిన బండి కూడా మా బాబాయిదే. ఎన్ని తరాలు మారినా ప్రేమ ఎమోషన్ ఒకటే. ఈ కథను చాలా పరిణితితో ట్రీట్ చేశాం. నిధి ప్రదీప్ భరతనాట్యంలో కూడా ప్రావీణ్యం కలిగినది. కొన్ని సీన్‌లు ఇచ్చినప్పుడు చాలా అద్భుతంగా చేసింది. ఆమె కళ్లలో మంచి ఎక్స్‌ప్రెషన్స్ ఉంటాయి. నటి లైలా నాకు చిన్నప్పటి నుంచే చాలా ఇష్టం. 'ఎగిరే పావురమా' చూసినప్పటి నుంచి ఆమెంటే ఇష్టం. ఇందులో జగపతిబాబుతో ఆమె కాంబినేషన్ కొత్తగా ఉంటుంది. ఆయనకు ఎదురుగా నిలబడే హుందాతనం ఉన్న పాత్ర కావాలి. దాదాపు 20 ఏళ్ల తర్వాత లైలా తెలుగులో నటిస్తున్నారు. ఇందులో చాలా ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు.నాకు హారర్ థ్రిల్లర్ అంటే చాలా ఇష్టం. కానీ ఇప్పటివరకు ఎక్కువగా రొమాంటిక్ కామెడీలు చేశాను. భవిష్యత్తులో మంచి హార్రర్ థ్రిల్లర్ చేయాలని ఉంది.



## నాగబాబు ప్రధాన పాత్రలో మేము 'కాప్'లం సిరీస్




ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 ఇప్పుడు మరో కొత్త సిరీస్ స్ట్రీమింగ్ డేట్‌ను అనౌన్స్ చేసింది. 'మేము 'కాప్'లం'. కామెడీ, మిస్టరీ కలయికగా రూపొందిన ఈ సిరీస్ అందరినీ మెప్పించే కథాంశంతో రూపొందుతోంది. గ్రామీణ నేపథ్యంలో, అక్కడి రోజువారీ జీవితం, స్థానిక రాజకీయాలు, ఊహించని గందరగోళం..ఇలా అన్నీ కలగలిపిన ఆసక్తికరమైన కథతో ఈ సిరీస్ తెరకెక్కుతోంది. తాజాగా సిరీస్ టైటిల్‌ను మేకర్స్ ఓ స్పెషల్ వీడియో ద్వారా రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. రా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి, కౌముది కె నేమాని నిర్మాతలుగా ప్రదీప్ మద్దాలి క్రియేటివ్‌తో కలిసి రూపొందుతున్న మేము కాప్'లం సిరీస్‌కు 'వికటకవి' డైరెక్టర్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్‌కి శోభన్ చిట్టుప్రోలు కథను అందించారు. ఇందులో నాగబాబు కొణిదెల ప్రధాన పాత్రలో కనిపిస్తున్నారు. గెటప్ శ్రీను, రవితేజ నన్నిమాల కీలక పాత్రల్లో నటించారు. గోదావరి జిల్లాల్లోని ఓ గ్రామంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో జరిగే కథ ఇది. అక్కడ ఒక విచిత్రమైన ఘటన జరగడంతో గ్రామంలో గందరగోళం ఏర్పడుతుంది. ఆ కేసును విచారించడానికి ఇద్దరు పోలీసుల ద్వయం రంగంలోకి దిగుతారు. వారికి ఇదే ఫస్ట్ బిగ్ కేస్ అవుతుంది. ఆ ఇద్దరూ ఎంతో కాన్ఫిడెంట్‌గానే ఉంటారు కానీ కాస్త టెన్షన్‌గా ఫీల్ అవుతుంటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ పరువు తర్వాత జీ5లో నేను చేస్తోన్న సిరీస్ మేము కాప్‌లం కథా నేపథ్యం, పాత్రలు, ఆసక్తికరమైన కథనం వల్ల నాకు బాగా నచ్చింది. ఈ సిరీస్‌లో భాగం కావటం నాకు సంతోషంగా ఉంది. త్వరలోనే ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది అన్నారు.

## సమరశీల ఉద్యమాలకు సిద్ధమవుదాం

(మొదటి పేజీ తరువాయి)



సంక్షోభం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని ఆరోపించారు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఖాళీగా పోస్టులను భర్తీ చేయకుండ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ అంటూ యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, విద్య, ఉపాధి రంగాలలో ప్రజా పెట్టుబడులు పెంచ దంతో పాటు నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ , అనిల్ కుమార్, చెట్టు కింద శ్రీనివాస్, దశరథ్ నాయక్, మామిడి చెట్ల భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, హేమంత్, పి. జగన్, రఘు, అరుణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

**నిరుద్యోగ సంక్షోభం నివారణకు సమగ్ర విధాన మార్పులు అవసరం : కె. ధర్మేంద్ర**

నిరుద్యోగ సంక్షోభం నివారణకు సమగ్ర విధాన మార్పులు అవసరమని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు.ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద ఎఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకై పోరాడుదామని, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుదామని నినాదాలు చేశారు. ఈసందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కోవడం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదని,ఇది దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్మాణాత్మక సంక్షోభమన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రైవేటీకరణ వేగవంతమవుతూ, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరుగుతున్నాయని, విద్య ఖర్చులు పెరిగి యువతపై భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి రంగంలో జాతీయ స్థాయిలో భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ ఖాళీలను నిర్దిష్ట సమయంలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బేగ్, టి. సత్య ప్రసాద్. మాట్లాడుతూ ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేశ యువతకు హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి బాబు, శేఖర్, నదీమ్, సాయిలు, ప్రతాప్, భరత్, ప్రకాష్, గణేష్,పవన్, ఎఐఎస్ఎఫ్ నేతలు మహేష్, అజీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

**నిరుద్యోగం, ప్రైవేటీకరణ, అసమానతలపై యువత ఐక్యంగా పోరాడాలి : ఎన్.శ్రీకాంత్**

నిరుద్యోగం, ప్రైవేటీకరణ, అసమానతలపై యువత ఐక్యంగా పోరాడాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు నేర్లకంటి శ్రీకాంత్ పిలుపునిచ్చా రు. ఎఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గురుబ్రహ్మ నగర్ లో నియోజకవర్గ కార్యదర్శి మామిడి చెట్ల భగత్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేర్లకంటి మాట్లాడుతూ దేశంలో అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ మహోన్నతమైన నాయకుల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని దేశంలో విద్య వైద్యం ఉపాధి అవకాశాల కల్పన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై రాజీ లేని పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పి. అనిల్ కుమార్, మామిడి చెట్ల చంద్రశేఖర్, భాస్కర్ రమేష్, శివ, భీమేష్, సాయిరాజు, లక్ష్మ ణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కిరిబిక్కిరి

(మొదటి పేజీ తరువాయి)

బులెటిన్ ప్రకారం, ఆదివారం నుంచి ఈనెల 10 వరకు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నాయి. ఆదివారం, సోమవారం కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షా లు కురిసే అవకాశం ఉందన్నారు. ఈనెల మంగళవారం, బుధవారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. గురువారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని చెప్పారు. గాలి వేగం పెరగనున్నందున పాత భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ ప్రాంతాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



**పలు జిల్లా ల్లో ఈదురు గాలులతో వర్షం**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడ, నేరేడుచర్ల, త్రిపురాంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. నకిరేకల్‌లో పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. సూర్యాపేటలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఇక్కడి మార్కెట్‌యార్డులో ధాన్యం, మొక్కజొన్న తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్‌లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మందమర్రి, సింగరేణి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో గాలి దుమారంతో భారీ వర్షం పడింది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లిలో విషాదం చోటుచేసుకుంది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిడుగుపడి కార్మికుడు మృతిచెందాడు. కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుడుతుండగా పిడుగుపాటు సంభవించింది. ఈ క్రమంలోనే అక్కడ పనిచేస్తున్న నీలం వెంకన్న ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఇద్దరు రైతులు అస్వస్థతతకు గురయ్యారు.

## సర్ నిలిపివేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

సంఘం, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, రిటైర్డ్ ఐఎఎస్, సిటిజన్స్ కమిషన్ ఆఫ్ ఎలక్షన్స్ ఎం.జి.దేవసహాయం, పొలిటికల్ ఎకనామిస్ట్ పరకాల ప్రభాకర్, కన్సర్డ్ సిటీజన్ లలితా రాందాస్, బహుభాషా నటుడు ప్రకాష్ రాజ్, సీనియర్ గాంధేయవాది తుషార్ గాంధీ, క్రాంతికారి కిస్సాన్ యూనియన్ దర్శన్ పాల్, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ సయ్యదా హమీదా, సబ్రంగ్ ఎడిటర్ తీస్తా సెతల్వాద్, సినిమా నిరాత, రచయిత డాక్టర్ పువర్ధన్ కో ఉన్నారు. ఓటర్ల జాబితా నుండి తొలగించిన వారిలో అధికశాతం మైనారిటీలు, ఆదివాసులు, దళితులు, వలస కార్మికులు, మహిళలే ఉన్నారని, ఇది సార్వత్రిక వయోజన ఓటు హక్కు సూత్రాన్ని దెబ్బతీస్తోందన్నారు. నోబెల్ గ్రహీత అమర్త్య సేన్, మాజీ నేవీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాష్, క్రికెటర్ మహమ్మద్ షమీ వంటి ప్రముఖుల పేర్లను కూడా తొలగించడం లేదా నోటీసులు పంపడం ఈ ప్రక్రియలోని లోపాలకు నిదర్శనమని తెలిపారు. పశ్చిమ బెంగాల్లో సుమారు 35 లక్షల మంది ఓటర్లు తమ తప్పు ఏమీ లేకపోయినా ఓటు హక్కు కోల్పోయారని వివరించారు. ఓటర్ల జాబితా నవీకరణకు ముందు సమగ్ర సమీక్ష, దిద్దుబాటు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియపై సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న విచారణను త్వరగా ముగించి, ఓటర్ల హక్కులను కాపాడాలన్నారు. గ్రామసభ నుండి లోక్‌సభ వరకు ఒకే ఉమ్మడి ఓటర్ల జాబితా ఉండాలని, గ్రామసభ జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎస్ఐఆర్ కొనసాగించాలనుకుంటే, సిఎజి ప్రమాణాల ప్రకారం కఠినమైన ఆడిట్, ధృవీకరణ జరగాలని కోరారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని ఈసిఐ నిరంతరం ధిక్కరిస్తే దేశ వ్యాప్త పోరాటం తప్పదని వారు తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

## ఇరాన్ కొత్త ప్రతిపాదన

(మొదటి పేజీ తరువాయి)

వస్తుందని హెచ్చరించారు.30 రోజుల్లో యుద్ధానికి శాశ్వతంగా ముగింపు పలుకుదామని ఇరాన్ ప్రధానంగా తన 14 అంశాల్లో ప్రతిపాదించింది. లెబనాన్ సహా అన్ని రంగాలలోనూ యుద్ధం ఈ గడువులోపు ఉద్రిక్తలకు ముగింపు పలకాలని కోరింది. కాల్పుల విరమణ పొడిగింపు అనే తాత్కాలిక సంధి చర్యను తిరస్కరించింది. ఇరాన్‌పై ఆంక్షలు ఎత్తివేయాలని, హోర్ముజ్ జలసంధి నుండి సైన్యాన్ని ఉపసంహరించాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, ఇరాన్‌లో జరిగిన యుద్ధ నష్టానికి పరిహారం చెల్లించాలని కోరింది. మధ్యవర్తిత్వ వ్యవహారాలు,పరిణామాలతో బాగా సంబంధాలున్న సీనియర్ అధికారి ఒకరు ఆదివారం లాహోర్‌లో ఈ 14 అంశాల ప్రతిపాదన గురించి చెప్పారు. ఈ ప్రతిపాదన ప్రకారం తక్షణం సైన్యాలను వెనక్కు మళ్లించడం, యుద్ధం ముగించడం, హోర్ముజ్ చుట్టూ ఉద్రిక్తతలను సడలించడం ప్రధానాంశంగా ఉందని పిటిఐ వార్తాసంస్థకు ఆ అధికారి చెప్పారు. సైన్యాలను, యుద్ధ నౌకలను వెనక్కు మళ్ళించడం ద్వారా చర్చల్లో పాల్గొనేందుకు విశ్వాస పునరుద్ధరణ చర్యలకు దారితీస్తాయని ఇరాన్ భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. అదేవిధంగా హోర్ముజ్ ద్వారా నౌకా వాణిజ్యాన్ని పునరుద్ధరించాలని ఇరాన్ కోరుకుంటున్నది. ప్రపంచదేశాలకు సులభంగా చమురు రవాణా చర్యలను పునరుద్ధరించాలని, చమురు సంక్షోభాన్ని నివారించాలని కోరుతున్నది. ఈ కొత్త ప్రతిపాదన గురించి మరో వర్గం ద్వారా లభించిన సమాచారం ప్రకారం అంతర్జాతీయ నిబంధనల చట్రానికి అనుగుణంగా ఇరాన్‌కు ఉన్న అణుహక్కులను లాంఛనంగా గుర్తించాలని కోరింది. అదేవిధంగా ఇరాన్‌పై మళ్ళీ మళ్ళీ దాడులు జరగకూడదని, ఇక శాశ్వత దాడుల నివారణకు, సైనిక చర్యలు లేకుండా పూర్తి భద్రతా హామీ ఇవ్వాలని కూడా ఈ 14 అంశాలలో అమెరికాను ఇరాన్ కోరింది. గత వారారంభంలో కూడా మూడు దశల చర్చలతో ఇరాన్ చేసిన ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు. ఈ ప్రతిపాదనల్లో కూడా అణు హక్కులు,అణ్వాయుధాంశాన్ని చివరి విడత చర్చల్లో తుది ప్రాధాన్యతగా ఇరాన్ భావించడాన్ని ట్రంప్ వ్యతిరేకించారు. ఒప్పందం కుదిరేవరకూ తాము ఓపికగా ఎదురుచూస్తామని ట్రంప్ అంటున్నారు. హోర్ముజ్ జలసంధిని దిగ్బంధం చేయడంవల్ల ఇరాన్ చమురు వాణిజ్యం స్తంభించిందని, ఇరాన్ ఆర్థికంగా దివాళా తీస్తే ఖచ్చితంగా దిగి వస్తుందని, ఒప్పందం కుదురుతుందని ట్రంప్ ఆయన వంది మాగధులు గట్టి ధీమాతో ఉన్నారు. కానీ మళ్ళీ యుద్ధం వచ్చే వాతావరణం కనిపిస్తోందని, యుద్ధం తప్పదని రెండు రోజుల క్రితమే ఇరాన్ సైనిక నాయకులు ప్రకటించారు. ఈ సారి యుద్ధం వస్తే అమెరికా,ఇజ్రాయెల్ దేశాలకు వణుకు పుట్టించే గుండె పోటు రప్పించేంత సరికొత్త ఆయుధాలను ప్రయోగిస్తామని కూడా ఇరాన్ సంచలన ప్రకటన చేయడం గమనార్హం.ఐతే అమెరికా దౌత్య చర్యలపై నమ్మకం పోయిందని, ఇస్లామాబాద్‌లో చర్చలు జరగాలంటే ఆ నమ్మకం సంపాదించుకోవాలని, ఇప్పుడు బంతి అమెరికా కోర్టులోనే ఉందని ఇరాన్ నాయకులు చెబుతున్నారు. ఏప్రిల్ 8వ తేదీన అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. ఈ తాత్కాలిక కాల్పుల విరమణ సంధి చర్యలను ఇరాన్ తిరస్కరించి శాశ్వత యుద్ధ నివారణ చర్యలు అవసరమని పేర్కొంటూ ఈ కొత్త ప్రతిపాదన చేసింది.

## భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

అంతస్తులలోని ఫ్లాట్లను మంటలు చుట్టుముట్టడంతో, సహాయక చర్యల కోసం తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. టెర్రస్ తలుపు తాళం వేసి ఉండటంతో, భవన నివాసులు ఎగసిపడుతున్న మంటల నుండి తప్పించుకోవడానికి ఇబ్బంది పడ్డారు. పన్నెండు అగ్నిమాపక వాహనాలను రంగంలోకి దించగా, ఢిల్లీ విపత్తు నిర్వహణ అథారిటీ (డిడిఎంఎ), ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసుల బృందాలు తరలింపు, సహాయక చర్యలలో తోడ్పడ్డాయి. అగ్నిప్రమాదానికి గల కారణం ఇంకా తెలియరాలేదు. ఢిల్లీ ఫైర్ సర్వీస్ (డిఎఫ్ఎస్) ప్రకారం, భవనంలోని వివిధ భాగాల నుండి తొమ్మిది కాలిపోయిన మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మొదటి అంతస్తు నుంచి ఒక మృతదేహం, రెండో అంతస్తు నుంచి ఐదు, తాళం వేసి ఉన్న మెట్ల మార్గం నుంచి మూడు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని డిఎఫ్ఎస్ అధికారి ఒకరు తెలిపారు. రెండో అంతస్తులో మృతులను అరవింద్ జైన్ (60), అతని భార్య అనితా జైన్ (58), వారి కుమారుడు నిశాంత్ జైన్ (35), కోడలు అంచల్ జైన్ (33), మనవడు ఆకాష్ జైన్‌గా గుర్తించారు. మూడో అంతస్తులో మరో కుటుంబానికి చెందిన ముగ్గురు నితిన్ జైన్ (50), అతని భార్య షైలీ జైన్ (48), వారి కుమారుడు సమ్యక్ జైన్ (25) మృతదేహాలు లభ్యమయ్యాయి. మొదటి అంతస్తులో శిఖా జైన్ (45) అనే మహిళ మరణించగా, ఆమె భర్త నవీన్ జైన్ (48) గాయపడ్డాడు. ఈ ఆపరేషన్‌లో భవనం నుంచి సుమారు 10 నుంచి 15 మందిని రక్షించినట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. స్వల్ప గాయాలైన ఇద్దరిని గురు తేగ్ బహదూర్ ఆసుపత్రికి తరలించారు. భవనంలోని చాలా భాగాలను మంటలు చుట్టుముట్టాయి, దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించింది. మంటలను అదుపులోకి తీసుకురావడానికి గంటల తరబడి శ్రమిస్తున్నప్పుడు, భవనం లోపల చిక్కుకున్న వారి అరుపులు వినిపించాయని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. భవనం వెనుక భాగంలో మంటల తీవ్రత గణనీయంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఒక అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. టెర్రస్ స్థాయికి సమీపంలో మూడు మృతదేహాలు లభ్యమయాయని, పైకప్పుకు వెళ్లే మార్గానికి తాళం వేసి ఉండటంతో, వారు తమ ప్రాణాలను కాపాడుకోలేకపోయారన్నారు. ఒకవేళ దానికి తాళం వేసి ఉండకపోతే వారు బతికి ఉండేవారేమోనన్నారు. 'ప్రవేశానికి, నిష్క్రమణకు మార్గంగా ఉపయోగపడే ఒక మధ్య మెట్లదారి ఉంది. వెనుక వైపు గేటుకు గ్రిల్ కప్పి ఉండటంతో, సహాయక చర్యలు చేపట్టేందుకు పనిముట్లను ఉపయోగించి దానిని కత్తిరించాల్సి వచ్చింది. సుమారు 15 మందిని రక్షించడానికి వివిధ వైపుల నుండి ఐదు నిచ్చెనలను, అలాగే ఒక టర్న్‌టేబుల్ లాడర్ వాహనాన్ని కూడా ఉపయోగించాము' అని ఆ అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు, ముఖ్యమంత్రి రేఖా గుప్తా సంతాపం తెలిపారు. బాధితులకు తక్షణ వైద్య సహాయం, సహాయక చర్యలు అందిస్తున్నట్లు వారు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com